Pubilshed from Vijayawada
PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com


మనిషి మనుగడలో అతిముఖ్యమైనది
శాంతి సుఖం సంతోషం ఆర్థికాభివృద్ధిఎదుగుదల,
ఇలాంటివి సాధించుకోవటానికి ఎదురయ్యే సమస్యలకు
గృహవాస్తు. జాతకదోషాలు,
అనేక రకాల సందేహాల నివృత్తి కోసం
చక్కటి పరిష్కారం కోసం సంప్రదించగలరు.
వాస్తు - జ్యోతిష పండితులు
మహామంత్రోపాసకులు
శ్రీ లలితాంబికా పీఠం వ్యవస్థాపకులు
బ్రహ్మశ్రీ మాడుగుల శివప్రసాద్ గురూజీ
79970 39039

విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 | సంచిక : 185 | గురువారం | అక్టోబర్ 29, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 15 | Issue No : 185 | THURSDAY | 29 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## తుపాను ప్రభావం తగ్గే వరకు క్షేత్ర స్థాయి విధుల్లోనే ఉండాలి : డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని నష్టంపై ప్రత్యేకంగా ఆరా తీసిన పవన్ కల్యాణ్ గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు.. పలు జిల్లాల్లో భారీగా ఆస్తి, పంట నష్టంఅర్నబ్ తీవ్ర తుపాను తీరం దాటిన నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం మొత్తం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అధికారులు క్షేత్ర స్థాయిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బాపట్ల నుంచి శ్రీకాకుళం వరకు తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం మధ్యాహ్నం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశించారు.ముఖ్యంగా తుపాను తీరం దాటిన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది పరిసరాలు, కాకినాడ జిల్లా తీర ప్రాంతాలపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిస్థితిపై కూడా ఆరా తీశారు. ఉప్పాడ తీరంలో దెబ్బతిన్న రహదారి, కూలిపోయిన ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. సహాయక చర్యలను మరింత పకడ్బందీగా చేపట్టాలి. తుపాను ప్రభావం తగ్గాక పంట నష్టం అంచనాలను అత్యంత పారదర్శకంగా నమోదు చేయాలి. చెరువుల గట్లు, వాగులు, వంకల్లో వరద ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలి" అని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.




# తుపాను నష్టంపై బాధితులకు తక్షణ సాయం: సీఎం చంద్రబాబు

- అధికార యంత్రాంగం, సిబ్బంది వేగంగా స్పందించారు
- బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందిస్తాం
- తుఫాన్ నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక
- సహాయక చర్యల్లో సాంకేతికతతో సత్ఫలితాలు
- ఆర్టీజీఎస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి

అర్నబ్ తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేస్తూ, మూడు రోజుల్లో ఏడు సమీక్షలు నిర్వహించి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించ గలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ ద్వారా తుఫాను గమనాన్ని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించామని చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రభుత్వం విశ్రాంతి తీసుకోదని స్పష్టం చేశారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ నుంచి నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తుఫాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలకు అత్యంత ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల వరకు అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేశారని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు, షెల్టర్ క్యాంపులకు తరలించడంతో పాటు, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించామని చెప్పారు. రెస్క్యూ, రిలీఫ్ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని సీఎం తెలిపారు. పంట నష్టాన్ని మినహాయించి, ఇతర నష్టాలకు

- తరువాయి 2లో..



## ప్రగతి ప్రాజెక్టులపై ప్రధాని మోదీ సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి

వివిధ ప్రగతి ప్రాజెక్టులను వేగవతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు.ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు రైల్వే కనెక్టివిటీ,పిఎం ఏక్తా మాల్స్,బల్క్ డ్రగ్ పార్కుల అభివృద్ధి,పియం సేతు సహా ఐటిఐ ఇకోసిస్టమ్ వంటి ప్రగతి అంశాలపై బుధవారం ఆయన ఢిల్లీ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం ద్వారా ఆయా ప్రాజెక్టుల ప్రగతిని సమీక్షించారు.వివిధ ప్రగతి ప్రాజెక్టలను సకాలంలో పూర్తి చేసే విధంగా రాష్ట్ర పభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రధాని కోరారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి ఎర్రుపాలెం-అమరావతి-నంబరు రైల్వే లైనుకు సంబంధించిన ప్రగతని సమీక్షిస్తూ ఈరైల్వే ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వర్వితగతిన పూర్తి చేసి రైల్వేకు అప్పగించాలని సిఎస్ సాయి ప్రసాద్ ను ఆదేశించారు.అదే విధంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిఎస్ ను ఆదేశించారు.తదుపరి విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న పియం ఏక్తామాల్ నిర్మాణానికి సంబంధించిన ప్రగతిని ప్రధానమంత్రి నరేంద్ర మోడి సమీక్షించారు.
ఈవీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

- మిగతా 2లో..



## తుఫాన్ నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై అధికారుల పరిశీలన

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి

తీవ్ర తుఫాను, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో భక్తుల భద్రత మరియు ముందస్తు రక్షణ చర్యలపై దేవస్థాన యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఇంజినీరింగ్ అధికారులు రమ, అశోక్ కుమార్ తదితరులతో కలిసి ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులోని పలు కీలక ప్రాంతాలలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు.
?ఈ సందర్భంగా అధికారులు ఓం టర్నింగ్, ఘాట్ రోడ్డు మార్గం, టోల్ గేట్ తదితర ప్రాంతాలను సమగ్రంగా తనిఖీ చేశారు. కొండపై నుండి వర్షపు నీరు సాఫీగా, వేగంగా కిందకు చేరేందుకు ఏర్పాటు చేసిన డ్రైనేజీ ప్రవాహ మార్గాలను పరిశీలించి, ఎక్కడా అడ్డంకులు లేకుండా పూడికతీత చర్యలు చేపట్టాలని సూచించారు.

- తరువాయి 2లో..



## ప్రజల్ని తుపానుకి వదిలేసి చంద్రబాబు పబ్లిసిటీ

### వైసీపీ నేత కారుమూరు వెంకట్‌రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:

రాష్ట్రంలో అర్నబ్ తుపాను సృష్టిస్తున్న బీభత్సాన్ని చూసి ప్రజలు అతలాకుతలం అవుతుంటే, బాధ్యతగా, అండగా ఉండాల్సిన సీఎం చంద్రబాబు మాత్రం సహాయక చర్యలను విస్మరించి కేవలం పబ్లిసిటీపైనే దృష్టి పెట్టారని వైయస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరు వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వెన్నుపోటు పార్టీ అరాచకాలు పెరిగిపోయి, తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న తరుణంలో వాటిని డైవర్ట్ చేసేందుకే చంద్రబాబు ఈ పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారని ఆయన ఆక్షేపించారు.

2 లో..

# తెలంగాణ సాయం



- విద్యుత్ సిబ్బంది, సామగ్రి పంపేందుకు సిద్ధం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు భట్టి విక్రమార్క ఫోన్
- తెలంగాణ ప్రభుత్వానికి గొట్టిపాటి కృతజ్ఞతలు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి

అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలపై తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ఈ మేరకు ఏపీ ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బుధవారం ఫోన్ చేసి పరిస్థితులను తెలుసుకున్నారు. తుపాను కారణంగా ఇప్పటివరకు జరిగిన నష్టం, ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చేపట్టిన చర్యలను గొట్టిపాటి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నష్ట నివారణ, సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టాన్ని సరిచేస్తూ, సరఫరాను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని వివరించారు.

**పూర్తి సహకారం అందిస్తాం**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులకు అవసరమైన సిబ్బంది, సామగ్రిని పంపేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

- తరువాయి 2లో..



## దెబ్బతిన్న రహదారులకి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

2 లో

## ఆర్నాబ్ తుఫానుతో రైతులకు తీవ్ర నష్టం

- ఆదుకోవాలని కేంద్రానికి మంత్రి అచ్చెన్నాయుడు లేఖ

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి

ఆర్నాబ్ అత్యంత తీవ్ర తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయని, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు బుధవారం లేఖ రాశారు. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 2,24,489 హెక్టార్లలో పంటలు నీటమునగడం లేదా దెబ్బతినడంతో సుమారు 3.45 లక్షల మంది రైతులు ప్రభావితమైనట్లు ప్రాథమిక నివేదికల ద్వారా వెల్లడైందని తెలిపారు. పంటలు చేతికందే కీలక సమయంలో ప్రకృతి విపత్తు సంభవించడం రైతాంగానికి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అక్టోబర్ 28 తెల్లవారుజామున యానాంకు దక్షిణంగా ఆంధ్రప్రదేశ్--యానాం తీరాన్ని దాటిన ఆర్నాబ్ తుఫాను గంటకు



125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులకు కారణమైందని మంత్రి వివరించారు. తీరం దాటే సమయంలో తుఫాను దాదాపు స్థిరంగా కొనసాగడంతో కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకు పలు తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయన్నారు. రాష్ట్రంలోని 688 మండలాలకు గాను 317 మండలాల్లో 10 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైందని, శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు విస్తరించిన 16

- తరువాయి 2లో..

ప్రజాభూమి
సోమవారం 26 అక్టోబర్ 2026


## సంపాదకీయం

# విపత్తుల వేళ ప్రజల ప్రాణాలే ప్రథమ ప్రాధాన్యం!

**ముందస్తు అప్రమత్తతే నష్ట నివారణకు అసలైన మార్గం**

ప్రకృతి వైపరీత్యాలు మానవ జీవితానికి ఎప్పటికప్పుడు సవాల్ విసురుతూనే ఉన్నాయి. తుఫాన్లు, భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులు ప్రజల జీవితాలను అతలాకుతలం చేయడమే కాకుండా, అపారమైన ఆస్తి నష్టానికి కారణమవుతున్నాయి. అయితే ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా ఆపడం మన చేతుల్లో లేకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించడం, ప్రజల ప్రాణాలను కాపాడటం, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంతవరకు నివారించడం మాత్రం సమర్థవంతమైన ప్రణాళికలు, ముందస్తు జాగ్రత్తలు, సమన్వయంతో కూడిన చర్యల ద్వారా సాధ్యమే. అందుకే విపత్తుల సమయంలో స్పందించడం ఎంత ముఖ్యమో, విపత్తు ముప్పు పొంచి ఉన్నప్పుడే అప్రమత్తమై చర్యలు చేపట్టడం అంతకంటే ముఖ్యం. తుఫాను హెచ్చరికలు వెలువడినప్పటి నుంచి ప్రభుత్వ యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలి. వాతావరణ శాఖ అందించే సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ, ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలి. లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. అవసరమైన సందర్భాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, ప్రజలకు భరోసా కల్పించాలి. కేవలం సమావేశాలు నిర్వహించడం, ఆదేశాలు జారీ చేయడంతో సరిపెట్టకుండా, ఆ ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయో నిరంతరం పర్యవేక్షించాలి.

**ప్రజల భద్రతలో అధికారుల పాత్ర కీలకం**

ప్రకృతి విపత్తుల సమయంలో జిల్లా యంత్రాంగం, పోలీసు, రెవెన్యూ, వైద్య, విద్యుత్, రవాణా, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయడం అత్యవసరం. ఒక శాఖ తీసుకునే చర్య మరో శాఖ పనితీరుతో అనుసంధానమై ఉంటుంది. అందువల్ల సమాచార లోపాలు, సమన్వయ లోపాలు తలెత్తకుండా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉండాలి. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో బాధ్యతలు నిర్దిష్టంగా కేటాయించి, అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి, సహాయక చర్యలు ఎలా చేపట్టాలి అనే అంశాలపై సిబ్బందికి ముందస్తు అవగాహన కల్పించాలి. భారీ వర్షాలు కురిసే సమయంలో రహదారులపై నీరు నిలిచిపోవడం, చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం, కాలువలు పొంగిపొర్లడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. వీటిని ఎదుర్కొనేందుకు అవసరమైన యంత్రాలు, సిబ్బంది, వాహనాలు, జనరేటర్లు ముందుగానే సిద్ధంగా ఉంచాలి. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. ముఖ్యంగా ఆసుపత్రులు, విద్యుత్ కేంద్రాలు, తాగునీటి సరఫరా వ్యవస్థలు, రవాణా మార్గాల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**రైతులకు అండగా నిలవాలి**

తుఫాన్లు, భారీ వర్షాల ప్రభావం వ్యవసాయ రంగంపై తీవ్రంగా పడుతుంది. రైతులు నెలల తరబడి కష్టపడి సాగు చేసిన పంటలు ఒక్క వర్షంతో నీటమునిగే పరిస్థితులు ఏర్పడతాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి, ఇతర పంటలు దెబ్బతినడం, కోసిన ధాన్యం తడిసిపోవడం, ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లడం వల్ల రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు ముందస్తు సూచనలు అందించాలి. పంటల కోత, ధాన్యం నిల్వ, వ్యవసాయ ఉత్పత్తుల రక్షణకు అవసరమైన జాగ్రత్తలను వివరించాలి. పొలాల్లో నీరు నిలిచిపోయినప్పుడు దాన్ని తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టాలి. పంట నష్టం జరిగిన ప్రాంతాలను వెంటనే గుర్తించి, శాస్త్రీయ పద్ధతుల్లో నష్టం అంచనా వేయాలి. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులకు పరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడం కేవలం ఆర్థిక సహాయం అందించడానికే పరిమితం కాకూడదు. తిరిగి సాగు చేపట్టేందుకు అవసరమైన విత్తనాలు, ఇతర వ్యవసాయ సహాయాన్ని అందించే దిశగా కూడా కార్యాచరణ ఉండాలి. రైతులకు భరోసా కల్పించినప్పుడే వ్యవసాయ రంగం త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

**పునరావాస కేంద్రాల్లో కనీస సదుపాయాలు తప్పనిసరి**

విపత్తుల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం ఎంత ముఖ్యమో, అక్కడ వారికి అవసరమైన సదుపాయాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు, విద్యుత్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలి. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగుల అవసరాలను ప్రత్యేకంగా గుర్తించాలి. అత్యవసర మందులు, ప్రథమ చికిత్స సామగ్రి, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలి. ప్రజలు తమ ఇళ్లను విడిచి రావాల్సిన పరిస్థితుల్లో భయాందోళనలకు గురికాకుండా వారికి భరోసా కల్పించాలి. విపత్తు ప్రభావం తగ్గిన తర్వాత కూడా అధికారుల బాధ్యత ముగిసిపోదు. దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ లైన్లు, తాగునీటి సరఫరా వ్యవస్థలను పునరుద్ధరించాలి. ఇళ్లు, పంటలు, పశువులు, చిన్న వ్యాపారాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు అందాల్సిన సహాయాన్ని వేగవంతం చేయాలి. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజలు సాధారణ జీవనానికి తిరిగి చేరుకునే వరకు పర్యవేక్షణ కొనసాగాలి.

**ప్రజల భాగస్వామ్యంతోనే విపత్తులను సమర్థంగా ఎదుర్కోగలం**

ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల సహకారం లేకుండా విపత్తుల ప్రభావాన్ని పూర్తిస్థాయిలో తగ్గించడం సాధ్యం కాదు. అధికారుల సూచనలను పాటించడం, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకపోవడం, అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం, అత్యవసర సమయంలో వదంతులను వ్యాప్తి చేయకపోవడం ప్రతి పౌరుడి బాధ్యత. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మకుండా, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలి. అత్యవసర సహాయం అవసరమైన వారికి తోడ్పడటంతో పాటు, తమ పరిసరాల్లోని వృద్ధులు, ఒంటరిగా నివసించే వారు, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల భద్రతపై కూడా శ్రద్ధ చూపాలి. పాఠశాలలు, కళాశాలలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విపత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, సురక్షిత ప్రాంతాలకు ఎలా చేరుకోవాలి, అధికారులకు సమాచారాన్ని ఎలా అందించాలి వంటి అంశాలపై ప్రజలకు శిక్షణ ఇవ్వాలి. ముందస్తు సంసిద్ధత ప్రజల్లో పెరిగినప్పుడు ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చు.

**నష్ట నివారణే నిజమైన విజయానికి కొలమానం**

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం ఎంత వేగంగా స్పందించింది, ఎంతమందికి సహాయం అందించింది అనే అంశాలతో పాటు, ముందస్తు చర్యల వల్ల ఎంతమేర ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగిందన్నది కూడా ముఖ్యమైన ప్రమాణం కావాలి.

# ప్రజల్ని తుపానుకి వదిలేసి చంద్రబాబు పబ్లిసిటీ

**ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి**

బీభత్సాన్ని చూసి ప్రజలు అతలాకుతలం అవుతుంటే, బాధ్యతగా, అండగా ఉండాల్సిన సీఎం చంద్రబాబు మాత్రం సహాయక చర్యలను విస్మరించి కేవలం పబ్లిసిటీపైనే దృష్టి పెట్టారని వైయస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరు వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వెన్నుపోటు పార్టీ అరాచకాలు పెరిగిపోయి, తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న తరుణంలో వాటిని డైవర్ట్ చేసేందుకే చంద్రబాబు ఈ పబ్లిసిటీ స్టంట్లు చేస్తున్నారని ఆయన ఆక్షేపించారు. గతంలో బుడమేరు వరదలు, విశాఖలో హుద్ హుద్ తుపాను సమయాల్లోనూ ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే, బాబు అండ్ కో మాత్రం క్రేన్లు ఎక్కి ఫోటోలకు ఫోజులివ్వడం, పబ్లిసిటీ కార్యక్రమాలు చేసుకోవడానికే పరిమితం అయ్యారని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కారుమూరు వెంకట్‌రెడ్డి గుర్తు చేశారు. ప్రెస్‌మీట్‌లో కారుమూరు వెంకట్‌రెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే...

లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బ తిని, వందలాది గ్రామాలకు కరెంట్, రవాణా సౌకర్యాలు నిలిచిపోతే... మంత్రులు, నేతలు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ఏకంగా సీసీ కెమెరాలలో తుపాను నష్టాన్ని చూస్తున్నామని చెప్పడం మహా విడ్డూరం. వెన్నుపోటు పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఏకంగా 17 తుపానులు, వాయుగుండాలు వస్తే.. వాటిలో నష్టపోయిన ఒక్క రైతన్నకైనా పరిహారం అందించిన పాపాన పోలేదు. అర్నబ్ తుపాను వల్ల భారీ వర్షాలు పడుతూ ఉంటే, ముందే కేవలం 70 వేల ఎకరాల్లోనే పంట నష్టం జరిగిందంటూ తప్పుడు లెక్కలు చెప్పి మరోసారి రైతులను మోసం చేయడానికి సిద్ధమయ్యారు. ఇకనైనా పబ్లిసిటీ కార్యక్రమాలకు తక్షణమే ఫుల్ స్టాప్ పెట్టాలి. తుపాను బాధితులకు తక్షణమే నగదు సహాయంతో పాటు, నిత్యావసర సరుకులు అందించాలి.

తుపాను సమయంలో ప్రజలకు అండగా నిలవాల్సిన చంద్రబాబు ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికే ప్రాధాన్యం ఇస్తోంది. తుపాను వస్తుందని ముందే తెలిసినా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అధికారులను అప్రమత్తం చేయడం, బాధితులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చూపారు. తుపానును అడ్డుకున్నామని, ప్రకృతి వైపరీత్యాలు నియంత్రించామన్న పిచ్చి మాటలు కాకుండా, అసలు ఎంత మందిని ఆదుకున్నారో చెప్పాలి. పబ్లిసిటీ స్టంట్లు, ఉత్తుత్తి ప్రచారంతో సమయం వృథా చేయకుండా సహాయ చర్యలు చేపట్టాలి.

గత తుపాన్లలో నష్టపోయిన రైతులకే పరిహారం అందించని ప్రభుత్వం ఇప్పుడు మరోసారి రైతులను మోసం చేయకూడదు. మొంథా తుపాను సమయంలో జరిగిన పంట నష్టానికి సంబంధించిన పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలను తక్షణమే చెల్లించాలి. ప్రస్తుత తుపానులో పంట నష్టం ఎంత జరిగిందో క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించకుండా ముందుగానే పరిమిత లెక్కలు ప్రకటించడం సరికాదు. గత తుపాన్ల పరిహారంతో పాటు ప్రస్తుత తుపాను నష్టపరిహారాన్ని కూడా అర్హులైన రైతులందరికీ అందించాలి.

తుపాను బాధితులకు తక్షణమే నగదు సాయం, నిత్యావసర సరుకులు, తాగునీరు, నాణ్యమైన ఆహారం, సురక్షిత వసతి కల్పించాలని పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణనష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలి. విద్యుత్, రవాణా సౌకర్యాలు నిలిచిపోయిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి. చంద్రబాబు ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా బాధితుల కష్టాలను గుర్తించి తక్షణ సహాయం అందించాలి. నారా లోకేష్ ట్వీట్లు, ప్రకటనలతో నాయకత్వాన్ని నిరూపించుకునే చీప్ ట్రిక్స్ కాకుండా, తుపాను బాధితులకు క్షేత్రస్థాయిలో ఎంత సహాయం అందించారో చెప్పాలని కారుమూరు వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రగతి ప్రాజెక్టులపై ప్రధాని మోదీ సమీక్ష

జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఎర్రుపాలె-అమరావతి-నంబూరు రైల్వే ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నవంబరు,డిశంబరు మాసాల్లో పూర్తి స్థాయిలో భూసేకరణ పూర్తి చేసి అప్పగించడం జరుగుతుందని ప్రధానికి వివరించారు.అనంతరం నక్కపల్లిలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కు,విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న ఏక్తామాల్ కు సంబంధించిన ప్రగతిని ప్రధానికి వివరించారు.
ఈవీడియో సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా,ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు,కార్యదర్శులు కోన శశిధర్,డా.ఎన్.యువరాజ్,ఎపిఐఐసి ఎండి దినేష్ కుమార్,సిఆర్డిఏ అదనపు కమీషనర్ భార్గవ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# తుపాను ప్రభావం తగ్గే వరకు క్షేత్ర స్థాయి విధుల్లోనే ఉండాలి

**అమరావతి ప్రజాభూమి ప్రతినిధి,**

అర్నబ్ తుపాను సహాయక చర్యలపై జిల్లాల కలెక్టర్లతో పవన్ కళ్యాణ్ సమీక్ష సహాయ చర్యలు వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు విద్యుత్, రహదారులను వెంటనే పునరుద్ధరించాలని సూచన కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని నష్టంపై ప్రత్యేకంగా ఆరా తీసిన పవన్ కళ్యాణ్ గంటకు 140 కి.మీ. వేగంతో గాలులు.. పలు జిల్లాల్లో భారీగా ఆస్తి, పంట నష్టంఅర్నబ్ తీవ్ర తుపాను తీరం దాటిన నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం మొత్తం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అధికారులు క్షేత్ర స్థాయిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. బాపట్ల నుంచి శ్రీకాకుళం వరకు తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో బుధవారం మధ్యాహ్నం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశించారు.ముఖ్యంగా తుపాను తీరం దాటిన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది పరిసరాలు, కాకినాడ జిల్లా తీర ప్రాంతాలపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిస్థితిపై కూడా ఆరా తీశారు. ఉప్పాడ తీరంలో దెబ్బతిన్న రహదారి, కూలిపోయిన ఇళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. సహాయక చర్యలను మరింత పకడ్బందీగా చేపట్టాలి. తుపాను ప్రభావం తగ్గాక పంట నష్టం అంచనాలను అత్యంత పారదర్శకంగా నమోదు చేయాలి. చెరువుల గట్లు, వాగులు, వంకల్లో వరద ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలి" అని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

గంటకు 140 కి.మీ. వేగంతో గాలుల బీభత్సంఈ సమీక్ష సందర్భంగా, అధికారులు తుపాను పరిస్థితిని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. యానాంకు దక్షిణంగా అర్ధరాత్రి 1:20 గంటలకు ప్రారంభమైన తీరం దాటే ప్రక్రియ ఉదయం వరకు కొనసాగిందని తెలిపారు.

# తుఫాన్ నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై అధికారుల పరిశీలన

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా దసరా ఉత్సవాల ముందు కొండచరియలు జారిపడిన సున్నితమైన ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించడంతో పాటు, భారీ వర్షాల ప్రభావంతో రాళ్లు జారిపడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కనకదుర్గ నగర్ మీదుగా సాగుతున్న భక్తుల రాకపోకలను పరిశీలించిన అధికారులు వర్షం వల్ల సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు. వర్షపు గాలుల వల్ల విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఈ చలి, వర్షపు వాతావరణంలో దర్శనార్థం విచ్చేసే భక్తులకు నిరంతరాయంగా వేడి వేడి అన్నప్రసాదం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల సిబ్బందిని ఆదేశించారు.

# దెబ్బతిన్న రహదారులకి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

- **126.165 కి.మీ మేర ఆర్‌అండ్‌బీ రహదారులకు నష్టం**
- **1,058 చెట్లు కూలిపోగా ఇప్పటికే 859 చెట్లు తొలగింపు**
- **57 చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం.. 20 చోట్ల రాకపోకలు పునరుద్ధరణ**
- **రహదారుల పునరుద్ధరణకు రూ.59.45 కోట్లు అవసరమని ప్రాథమిక అంచనా**

**రాష్ట్రవ్యాప్తంగా 53 కంట్రోల్ రూమ్‌లు.. 57 మంది నోడల్ అధికారులతో నిరంతర పర్యవేక్షణ**

**ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:**

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. తుఫాన్ ప్రభావం ప్రారంభమైనప్పటి నుంచి ఆర్‌అండ్‌బీ శాఖ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశామని, క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఎక్కడికక్కడ పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 126.165 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారి ఉపరితలం దెబ్బతిన్నట్లు మంత్రి వెల్లడించారు. తొమ్మిది చోట్ల సీడీ వర్క్స్ దెబ్బతినగా, రెండు చోట్ల స్కోర్లు, ఒక చోట బ్రీచ్ ఏర్పడినట్లు తెలిపారు. తుఫాన్ తీవ్రతకు ఆర్‌అండ్‌బీ రహదారులపై 1,058 చెట్లు కూలిపోగా, ఇప్పటికే 859 చెట్లను తొలగించినట్లు మంత్రి తెలిపారు. మొత్తం 57 చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, 20 చోట్ల ట్రాఫిక్‌ను పునరుద్ధరించామని చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లోనూ రహదారులను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిబ్బంది, యంత్రాంగం నిరంతరం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణకు రూ.59.4486 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో తాత్కాలిక పునరుద్ధరణ పనులకు రూ.9.1756 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ పనులకు రూ.50.273 కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. రూ.24.943 కోట్లు, విజయనగరంలో రూ.4.2214 కోట్లు, పార్వతీపురం మన్యంలో రూ.0.863 కోట్లు మేర పునరుద్ధరణ పనులు అవసరమని ప్రాథమిక అంచనాలు అందినట్లు తెలిపారు. ప్రజల భద్రతే అత్యంత ప్రాధాన్యమని, వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలు, కల్వర్టులు, కాజ్‌వేలు, వంతెనలు, దెబ్బతిన్న రహదారుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. అవసరమైన చోట్ల బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండాలని, రహదారులపై ఎక్కడైనా చెట్లు పడినా, కోతలు ఏర్పడినా, రాకపోకలకు అంతరాయం కలిగినా తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ రహదారి కనెక్టివిటీని వీలైనంత త్వరగా పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తుగానే రాష్ట్రవ్యాప్తంగా 53 కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసి 57 మంది నోడల్ అధికారులను నియమించినట్లు మంత్రి తెలిపారు. 614 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 550 జేసీబీలు, 596 పవర్ సాలు సిద్ధంగా ఉంచడంతో పాటు 78 ప్రాంతాల్లో అవసరమైన సిబ్బంది, యంత్ర సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు వివరించారు. కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పనిచేస్తున్నాయని తెలిపారు.

# తెలంగాణ సాయం




ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో ఏపీకి అండగా నిలిచేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యల్లో సహకారం అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడాన్ని అభినందించారు.

# తుపాను నష్టంపై బాధితులకు తక్షణసాయం

సంబంధించి అర్హులైన బాధితులకు గురువారం నుంచే ఆర్థిక సాయం అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఈ అంశంపై గురువారం వర్చువల్ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తుఫాను వల్ల జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాయడంతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడి తుఫాను తీవ్రత, రాష్ట్రంపై దాని ప్రభావాన్ని వివరించినట్లు చెప్పారు. కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని, సమగ్ర నష్ట నివేదికను కూడా త్వరలోనే కేంద్రానికి పంపిస్తామని వెల్లడించారు.

**సాంకేతికతతో కచ్చితమైన అంచనాలు**

తుఫాను ప్రభావంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయని, పలు ప్రాంతాల్లో ఆస్తి నష్టం జరిగిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు తెలిపారు. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా మిగతా జిల్లాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాల్లోనూ ఎల్లుండి సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని వెల్లడించారు. రాష్ట్ర రహదారులు, రహదారుల పై రాకపోకలను బుధవారం రాత్రికే పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఆహారం, ఔషధాలు అందించేందుకు డ్రోన్లను కూడా సిద్ధం చేశామని వివరించారు. గతంలో తుఫాను హెచ్చరికలు వచ్చినప్పుడు శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సి వచ్చేదని సీఎం గుర్తుచేశారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో తుఫాను ప్రభావం ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందో ముందుగానే గుర్తించి, అక్కడే అధికార యంత్రాంగాన్ని మోహరిస్తున్నామని వివరించారు. ప్రిడిక్షన్, యాక్యురెసీ, క్షేత్రస్థాయిలో అప్రమత్తత అనే విధానాలతో విపత్తును ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఐఎండీ సమాచారం, ఉపగ్రహ ఛాయాచిత్రాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తుఫాను గమనాన్ని అంచనా వేశామని చెప్పారు. సముద్రంలో నెలకొన్న వివిధ వాతావరణ పరిస్థితుల కారణంగా తుఫాను ఏపీ తీరంపై సుమారు 10 గంటలపాటు నిలిచిపోయిందని, తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని వెల్లడించారు. సుమారు 30 వేల మంది క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో టెలి కాన్ఫరెన్సుల ద్వారా నిరంతరం సమన్వయం చేసుకున్నామని తెలిపారు.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం**

తుఫాను ప్రభావంతో విశాఖపట్నంలో విద్యుత్‌పై చెట్టు కూలిన ఘటనలో ఇద్దరు, అనకాపల్లిలో ఒకరు, కోనసీమలో ఒకరు, భీమవరంలో మరొకరు ప్రాణాలు కోల్పోయారని ముఖ్యమంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. తుఫాను కారణంగా ఇళ్లు, పంటలు, దుకాణాలు, ఇతర ఆస్తులు నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. ముంపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరిన బాధితులకు 25 కిలోల బియ్యం అందించాలని ఆదేశించినట్లు చెప్పారు.

# తుఫాను బాధితులకు పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు



❖ తుఫాను తగ్గే వరకు కేంద్రాల్లోనే ఉండాలి
❖ పునరావాస కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్

ప్రజాభూమి ప్రతినిధి, కృష్ణా జిల్లా, మచిలీపట్నం :
అర్నబ్ తుఫాను నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డీకే బాలాజీ తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రజలకు పునరావాస కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొ న్నారు. బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్‌తో కలిసి కృత్తివెన్ను మండలం చందాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.

## ప్రజలకు కలెక్టర్ భరోసా

పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. భోజనం, తాగునీరు, వసతి తదితర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో కల్పించిన సౌకర్యాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ప్రజల భద్రత కోసం జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు అందిస్తామని తెలిపారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు.

## మౌలిక వసతులపై క్షేత్రస్థాయి పరిశీలన

అనంతరం బంటుమిల్లి మండలం మం జులూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పా టు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్, జా యింట్ కలెక్టర్ సందర్శిం చారు. అక్కడ ప్రజ లకు కల్పిస్తున్న వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యుత్ సరఫరా లో అంత రాయం ఏర్పడితే వినియోగించేందుకు జనరేటర్ ఏర్పా టు, భోజన సదుపాయం, సుర క్షిత తాగు నీరు, మరుగుదొడ్లు, నిరంతర నీటి సరఫరా తది తర మౌలిక వసతులపై అధికారులను వివ రాలు అడిగి తెలుసుకున్నారు.కేంద్రంలో ఆ శ్ర యం పొందుతున్న ప్రజలతో మాట్లాడి వారి అవస రా లు, సమస్యలను తెలుసుకున్నారు. తుఫా ను సమయంలో ప్రజల ప్రాణాలను కాపా డటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

## పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చాకే ఇళ్లకు వెళ్లాలి

తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గి, పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నట్లు అధికారులు నిర్ధారించిన తర్వాతే ప్రజలు తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని కలెక్టర్ సూచించారు. అప్పటివరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, ఇతర అత్యవసర సదుపాయాలకు ఎలాంటి కొరత లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన సహాయక చర్యలను తక్షణమే చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పోతురాజు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు అన్ని వసతులు కల్పించాలి.. అప్రమత్తంగా ఉండాలి

### మంజులూరు పునరావాస కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్





ప్రజాభూమి, ప్రతినిధి మచిలీపట్నం
కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం మంజులూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ సందర్శించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు చేపట్టిన ముందస్తు చర్యలను పరిశీలించారు.పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్రంలో భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణు లు, అనారోగ్యంతో ఉన్నవారికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టా లను నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## పునరావాస కేంద్రంలో వసతులను పరిశీలించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్




ప్రజాభూమి, ప్రతినిధి మచిలీపట్నం
కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం చందాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ సంద ర్శించారు.పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలతో అధికారులు నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవస ర మైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందు తున్న వారందరికీ నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగు నీరు, అత్యవసర వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, వారికి అవసరమైన సహాయసహకారాలు అందించాలని సూచించారు.



## పునరావాస కేంద్రాల్లో సంతృప్తికర ఏర్పాట్లు

❖ ఎవరికీ ఇబ్బంది లేకుండా సౌకర్యాల కల్పన ❖ నిరంతరం పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అర్నబ్ తుపాను ప్రభావిత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వెల్లడించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 605 స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో మొత్తం 313 మంది ఆశ్రయం పొందుతున్నట్లు వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో ప్రజలకు తాగునీరు, ఆహారం, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పునరా వాస కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నిర్వహించాలని, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం సక్రమంగా అందిస్తున్నారా లేదా అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆహారం, తాగునీరు పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అవసరమైన వారికి సకా లంలో వైద్య సహాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పిల్ల లు, వృద్ధులు, మహిళలు, అనారోగ్య సమస్యలున్న వారికి ప్రత్యేక శ్రద్ధతో సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నగరంతో పాటు జిల్లాలోని ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

## సంగమేశ్వరం పునరావాస శిబిరం పరిశీలించిన ఎమ్మెల్యే

### తుఫాన్ బాధితులకు మధ్యాహ్న భోజనం వడ్డించిన ఎమ్మెల్యే



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
నాగాయలంక మండలం సంగమేశ్వరం లోని ఆర్ణబ్ తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాన్ని బుధవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. బాధితులను పరామర్శించి, వారికి అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. తుఫాన్ తీరం దాటినా, ప్రభావిత వర్షాల ముప్పు తప్పే వరకూ అధికారుల సూచనలకు అనుగుణంగా బాధితులు శిబిరాల్లోనే ఉండాలని సూచించారు. శిబిరాల్లో బాధితులకు ఎలాంటి లోటు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. శిబిరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. బాధితుల కోసం సిద్ధమైన మధ్యాహ్న భోజనం వారికి వడ్డించారు.



## పారదర్శకంగా అధికారుల పనితీరు ఉండాలి

### జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
స్థానిక సంస్థలకు సంబంధించి జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయ్ కుమార్ బుధవారం విజ యవాడ నగరపాలక సంస్థలోని పట్టణ స్థానిక సంస్థ ఎన్నికల వ్యయ నిర్వహణ విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోటీచేస్తున్న అభ్యర్థులు చేసిన ఖర్చుల వివరాలను నిర్వహిస్తున్న షాడో రిజిస్టర్లను పరిశీలించారు. అదేవిధంగా సభలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలకు సంబంధించి వీడియో సర్వైలెన్స్ బృందం (వీఎస్‌టీ) సేకరించిన ఆధారాలను, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకుల పర్యవేక్షణలోని అకౌంటింగ్ బృందాల ఖర్చు లెక్కింపు కోసం ఉపయోగిస్తున్న తీరును ధ్రువీకరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు చక్రవర్తి పాల్గొన్నారు. ఎన్నికల వ్యయ నిర్వహణపై సంబంధిత అధికారులు, సిబ్బందికి పరిశీలకులు తగిన సూచనలు జారీచేశారు. విభాగం పనితీరు సంతృప్తికరంగా ఉన్నట్లు ఆయన గుర్తించారు. స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలు సమన్వయంతో, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ ఈ సందర్భంగా సూచించారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ సవరణ

# నవంబర్ 5న పోలింగ్.. 6న రీపోలింగ్..7న ఓట్ల లెక్కింపు

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ.



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను సవరించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం పోలింగ్ తేదీ నవంబర్ 5, 2026 (గురువారం), ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రీపోలింగ్ (అవసరమైన చోట) నవంబర్ 6, 2026 (శుక్రవారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుం దన్నా రు. అలాగే ఓట్ల లెక్కింపు నవంబర్ 7, 2026 (శనివారం), ఉదయం 8 గంటల నుంచి ఉంటుందని, ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాల ప్రకటన చేయడం జరుగుతుందన్నారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఒకే రోజున ఉండటంతో పోలీసు, పోలింగ్ సిబ్బంది మరియు ఇతర అవసరమైన వనరుల సమర్థ వినియోగం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ షెడ్యూల్‌ను సవరించినట్లు తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల నిర్వహణకు సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని, ఎన్నికల తేదీలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన మండలి వెంకట్రామ్



### తుఫాన్ ప్రభావం తగ్గిన తరువాతే ఇళ్లకు వెళ్లాలని సూచన

ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ
అవనిగడ్డ గరల్స్ హైస్కూల్లోని పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే తనయుడు మండలి వెంక ట్రామ్ పరిశీలించారు. ఆర్ణబ్ తుఫాన్ నేప థ్యంలో అవనిగడ్డలోని పూరిళ్ళు, బలహీన గృహా ల్లో జీవించే నిరుపేద కుటుం బాల వారు ఈ శిబి రంలో పునరా వాసం పొందుతున్నారు. బుధ వా రం వారిని వెంకట్రామ్ పరామ ర్శించి, వారికి అందిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. బాధిత కుటుంబాల్లోని చిన్నారులు, వృద్ధు లకు బిస్కెట్ ప్యాకెట్లు అందచేశారు. బాధితుల కోసం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గిన తరువాత అధికారుల సూచనల ప్రకారం ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, తహసీల్దార్ బీ.అం కాలు, ఆర్ఐ బాలాజీ తమ సిబ్బందితో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ శిబిరంలో బాధితులకు ఆహారం, త్రాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య చర్యలను అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారు.

## తుఫాన్ పునరావాస కేంద్రాలను పరిశీలించిన విక్కుర్తి



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ / నాగాయలంక
ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు పునరావాస కేంద్రాలను అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. అవనిగడ్డ గర్ల్స్ హైస్కూల్, నాగాయలంక జెడ్పీ హైస్కూల్, గుల్లలమోద, ఏటిమొగ గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను సందర్శించి అక్కడ ఆశ్రయం పొందుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.పునరావాస కేంద్రాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాల్లోని చిన్నారులు, వృద్ధులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే బాధితుల కోసం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహార పంపిణీ, ఇతర సదుపా యాలపై వివరాలు తెలుసుకున్నారు. తు ఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గేవరకు ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని విక్కుర్తి శ్రీనివాసరావు సూచిం చారు. అధికారులు సూచించిన విధంగా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పరిస్థితులు పూర్తిగా సాధా రణ స్థితికి చేరుకున్న తర్వాతే తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని బాధితులకు విజ్ఞప్తి చేశారు.




# అర్నబ్ తుఫానుతో మచిలీపట్నం అతలాకుతలం

❖ 24 గంటల పాటు ఎడతెరిపిలేని వర్షం..
❖ జలమయమైన నగర రహదారులు
❖ నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు.. సహాయక చర్యల్లో అధికారులు
❖ వర్షం తెరిపివ్వడంతో క్రమంగా సాధారణ స్థితికి జనజీవనం






ప్రజాభూమి, ప్రతినిధి మచిలీపట్నం :
అర్నబ్ తుఫాను ప్రభావంతో మచిలీపట్నం నగరం భారీ వర్షాలు, ఈదురుగాలులకు గురైంది. తుఫాను తీరం దాటే సమయంలో గాలులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదైంది. దాదాపు 24 గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు జలమయమై చెరువు లను తలపించాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభా లు, వృక్షాలు నేలకొరగడంతో ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొన్నారు.

### రంగంలోకి దిగిన సహాయక బృందాలు

తుఫాను ప్రభావంతో నేలకొరిగిన చెట్లను తొలగించేందుకు మున్సిపల్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. రహదారులపై పడిన వృక్షాలను తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

### 24 గంటల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

తుఫాను సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ అధికారులు పలు ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేశారు. గాలుల ధాటికి తెగిపోయిన విద్యుత్ తీగలు, దెబ్బతిన్న స్తంభాలకు మరమ్మతులు చేపట్టి 24 గంటల్లోపే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తొలగించేందుకు సిబ్బంది శ్రమించారు.

### రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు

నగరంలోని రహదారులపై నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపేందుకు మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులు నిరంతరం పనిచేస్తున్నారు. నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగిస్తూ, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నారు. తుఫాను ప్రభావంతో ఉదయం నుంచే పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. దీంతో నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపించాయి.

### పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆశ్రయం

తుఫాను ముప్పు నేపథ్యంలో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న బాధితులకు అల్పాహారం, భోజనంతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షణ కొనసాగించారు.

### వర్షం తెరిపివ్వడంతో కదిలిన జనజీవనం

ఎడతెరిపిలేని వర్షాలతో స్తంభించిన జనజీవనం, వర్షం కొంత తెరిపివ్వడంతో క్రమంగా కదలడం ప్రారంభించింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి నిత్యావసర సరుకుల కొనుగోళ్లకు వెళ్లారు. అయితే రహదారులపై నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.మరో 12 గంటల్లో వర్షాల తీవ్రత తగ్గితే నగరం మరింతగా సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని సూచిస్తున్నారు.

# ఆర్నాబ్ తుఫాన్ బీభత్సం

- విరిగిపడ్డ కొబ్బరి చెట్లు, నేలకొరిగిన వరి చేలు
- రైతంగానికి కోలుకోలేని దెబ్బ



ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు

ఖాతం లో ఏర్పడ్డ ఆర్నాబ్ తీవ్ర తుఫాన్ దెబ్బకు రైతాంగానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. 27వ తేది ఆరు గంటలకు ప్రారంభమైన తుఫాన్ ప్రభావం 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు విలయ తాండవం చేసింది. ఏకంగా 140 కిలోమీటర్ల స్పీడుతో వీచిన భికర గాలులు ప్రకృతి బీభత్సం సృష్టించింది. ఇలాంటి తీవ్ర వాయుగుండం 1969 వచ్చింది అని దాని కంటే కూడా ఎక్కువ గానే ఉందని కొందరు పెద్దలు చెబుతున్నారు.ఎక్కడ చూసినా కొబ్బరి చెట్లు గాలులు దెబ్బకు విరిగిపడ్డాయి. కొన్ని చెట్లు కోకటివేలతో పడిపోయాయి. అరటి చెట్లయితే నామరూపాలు లేకుండా పడిపోయాయి. ఒకటి రెండు నెలల్లో పంట చేతికొచ్చే పంట చేతికొచ్చే వరిచేలు నెలకొరిగి పోయాయి. ఇక రొయ్య, చేప సాగు రైతు లకు తుఫాన్ భీబత్సం భారీ నష్టం కలుగ చేసింది. ఈ తీవ్ర వాయుగుండ ప్రభావం రైతంగానికి నష్టం వేల కోట్లు రూపాయలు ఉంటుంది అని అంచనా వేస్తున్నారు. భికర గాలులకు విద్యుత్ స్తంబాలు పడిపోవడం తో విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ చెట్లు రోడ్డుకడ్డం గా పడి పోవడం తో కొన్ని చోట్ల రాకపోకలు కూ ప్రజలు ఇబ్బంది పడ్డారు.ముందు జాగ్రత్త చర్య గా రైళ్లు రద్దు చేయడం, స్కూల్స్ సెలవులు ఇవ్వడం మంచి దయ్యిందంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



# ఏలూరు జనసేనలోకి 150 మంది చేరిక

- మారుతీనగర్ కాలనీ నుంచి ఇతర పార్టీల నాయకులు, యువత జనసేనలో చేరిక

ప్రజాభూమి ఏలూరు

స్థానిక 6వ డివిజన్ మారుతీనగర్ కాలనీకి చెందిన ఇతర పార్టీల నాయకులు,కార్యకర్తలు, యువతీ యువకులు సుమారు 150 మంది స్థానిక జనసేన నాయకులు ఓలిపల్లి సాయి ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు.వారికి జనసేన ఇంచార్జి,ఏలూరు నగర మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.జనసేన సిద్ధాంతాలు,అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు,ఏలూరులో రెడ్డి అప్పలనాయుడు చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు వీరంకి పండు, రెడ్డి గౌరీ శంకర్,నూకల సాయి ప్రసాద్,బోండా రాము నాయుడు,అల్లు సాయి చరణ్,బొత్స మధు, ఎట్రించి ధర్మేంద్ర పాల్గొన్నారు.

# తుఫాన్ పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ఏలూరు

అర్నబ్ అతి తీవ్ర తుఫాన్ నేపథ్యంలో ఏలూరు నగరంలో ఎమ్మెల్యే బడేటి చంటి బుధవారం విస్తృతంగా పర్యటించి పరిస్థితులను సమీక్షించారు.ప్రజలకు ధైర్యం చెబుతూ, అధికారులకు తగిన సూచనలు చేశారు.నగరంలో పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,జిల్లా వ్యాప్తంగా చెదురుమదురు సంఘటనలు మినహా పరిస్థితులు అదుపులో ఉన్నాయని తెలిపారు.ముందస్తు చర్యలతో నగరంలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆయన వెంట టీడీపీ నగర కార్యదర్శి రెడ్డి నాగరాజు, సీనియర్ నాయకులు బెల్లపుకొండ కిషోర్,చల్లా విజయ్ కుమార్ ఉన్నారు.

# భారీ వర్షంలోనూ మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు విస్తృత ప్రచారం

ప్రజాభూమి ఏలూరు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏలూరు నగర మేయర్ కూటమి అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.బుధవారం భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వన్ టౌన్,టూ టౌన్ పరిధిలోని పలు షాపింగ్ మాల్స్‌ను సందర్శించి, వ్యాపారులు, ఉద్యోగులను ఆప్యాయంగా పలకరిస్తూ ఓటు అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏలూరు నగర అభివృద్ధి,ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా,ఎమ్మెల్యే బడేటి చంటి నాయకత్వంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో సేవలందిస్తానన్నారు. నగరఅభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.నవంబర్ 1న జరిగే ఎన్నికల్లో తనను గాజు గ్లాస్ గుర్తుపై, 62 డివిజన్లలో కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్,నగర అధ్యక్షుడు వీరంకి పండు, గౌరవ అధ్యక్షుడు నగిరెడ్డి కాశీ నరేష్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# తుఫాను బాధితులకు సబ్ కలెక్టర్ భరోసా



ప్రజాభూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం పిన్నమరెడ్డిపల్లిలో తుఫాను ప్రభావంతో పాక్షికంగా దెబ్బతిన్న కొవ్వలి శాంతమ్మ ఇంటిని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న బుధవారం తహశీల్దార్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఇంటి నష్టంపై నివేదిక అందించాలని హౌసింగ్ ఏఈ సుందర్ కుమార్‌ను ఆదేశించారు. బాధిత కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు చేర్చాలని అధికారులకు సూచించారు. తుఫాను పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదికలు అందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

# గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రజా భూమి ప్రతినిధి,జీలుగుమిల్లి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించేందుకు జీలుగుమిల్లి మండలంలోని జీలుగుమిల్లి మరియు దర్భ గూడెం గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జీలుగుమిల్లి మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో పాటు గతంలో ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు అధికారులు మరియు జిల్లా స్పెషల్ పార్టీ సిబ్బంది ఈ ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో పోలీసు బలగాలు కవాతు నిర్వహించి, ప్రజలకు భద్రతాభావాన్ని కల్పించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో సిఐ బి యాదగిరి, జీలుగుమిల్లి ఎస్ఐ వి క్రాంతి కుమార్, బుట్టాయిగూడెం ఎస్ఐ చెన్నారావు అలాగే పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలా పరిధిలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసు నిఘా మరియు భద్రతా చర్యలు కొనసాగుతాయి. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.



# వర్షాల వేళ అప్రమత్తం..

## లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాసం

- 223 మందిని ఆగిరిపల్లి, 70 మందిని సగ్గూరు పునరావాస కేంద్రాలకు తరలింపు
- ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్ విజ్ఞప్తి

ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్ తెలిపారు. ఆగిరిపల్లి, వడ్లమాను గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 223 మందిని ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి, సగ్గూరు గ్రామానికి చెందిన మరో 70 మందిని సగ్గూరు యూపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించినట్లు వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో బాధితులకు అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఈదర గ్రామం నుంచి ఎస్.ఏ.పేటకు వెళ్లే మార్గంలో వృక్షం కూలిపోవడంతో సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుని విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో దానిని తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. మండలంలో ఈరోజు 30.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రదేశాలకు దూరంగా ఉండాలని, ఉధృతంగా ప్రవహించే వాగులు, కాలువలను దాటే ప్రయత్నం చేయరాదని ఆయన సూచించారు. అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ, అవసరమైతే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తుఫాన్ సహాయక చర్యలు ముమ్మరం

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా

తుఫాన్ సహాయక చర్యలు ముమ్మరం చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. తుఫాన్ పరిస్థితిపై మంగళవారం రాత్రి నుండి బుధవారం ఉదయం 7 గంటల వరకు తుఫాన్ పరిస్థితిపై కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ నుండి కలెక్టర్ పరిశీలించారు. పలుమార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో పాల్గొని, అనంతరం తుఫాన్ సహాయక చర్యలపై సీఎం అందించిన సూచనలతో అధికారులతో తుఫాన్ సహాయక చర్యలపై అధికారులకు ఏలూరు కలెక్టరేట్ నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఏలూరు జిల్లాలో 28 మండలాల్లోని 185 గ్రామాలు తుఫాన్ ప్రభావానికి గురయ్యాయని, ప్రాధమిక అంచనాల ప్రకారం 16 వేల 796 హెక్టార్లలోని పంటలు నీటమునిగాయన్నారు. తుఫాన్ ప్రభావం మరో రెండు రోజులపాటు ఉండే అవకాశం ఉన్నదని ముంపు ప్రాంతాలలోని ప్రజలందరినీ పునరావాస కేంద్రాలకు చేర్చి, భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. పునరావాస కేంద్రాలలో తుఫాన్ బాధితులకు నాణ్యమైన భోజనం ఐదించాలని, త్రాగునీరు ఉండేలా చూడాలని, విద్యుత్ కు అంతరాయం లేకుండా జనరేటర్ లు ఏర్పాటుచేయాలన్నారు. వైద్య కేంద్రం ఏర్పాటుచేయాలన్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను పరిశీలించాలని, సామర్థ్యానికి మించి వచ్చే నీటి నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, వసతి గృహాలలో జెనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పెనుగాలులకు నేలకొరిగిన చెట్లను వెంటనే తొలగించి రవాణా సౌకర్యాలను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్ స్థంబాలు నేలకొరిగిన ప్రదేశాలలో యుద్ధప్రాతిపదికన విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్దరించాలన్నారు. తుఫాన్ ప్రభావం పూర్తి



అయ్యేంతవరకు అత్యవసర పరిస్థితులలో తప్ప ప్రజలెవ్వరూ బయటకు రాకుండా చూడాలన్నారు. వర్షాలు తగ్గి, పంట పొలాలలో వరద నీరు తగ్గిన తరవాత పంట నష్టం అంచనాలను రూపొందించాలని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో నియమించిన తుఫాన్ ప్రత్యేక అధికారులు విపత్తుల సమయంలో క్షేత్రస్థాయిలో పరిస్థితుల ఆధారంగా తక్షణ నిర్ణయాలు తీసుకుని, ఎక్కడా ఎటువంటి నష్టం కలగకుండా వాటిని సమర్ధంగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తుఫాన్ పునరుద్ధరణ చర్యలలో విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు, పునరావాస శిబిరాలలో తుఫాన్ బాధితులకు అధికారులు, సిబ్బంది చక్కని సేవలు అందిస్తున్నారని కలెక్టర్ వారి సేవలను కొనియాడారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, ఇంచార్జ్ డిఆర్ఓ ఎం. ముక్కంటి, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, డిపిఓ మల్లికార్జునరావు, సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ట్రాన్స్కో ఎస్ఈ లు జెడ్. రమేష్, విజయరత్నం, అంబేద్కర్ , స్వర్ణగ్రామ, స్వర్ణ వార్డ్ సచివాలయాల జిల్లా ఎస్డీసీ దేవకీదేవి, మెప్మా పీడీ రాజబాబు, ప్రభృతులు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావంతో విద్యాసంస్థలకు సెలవు

ప్రజాభూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

అర్నాబ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆగిరిపల్లి మండలంలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల 29న సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. తుపాను ప్రభావం, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సెలవు సమాచారాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. బుధవారం ఉపాధ్యాయులు పాఠశాలలను పరిశీలించి, విద్యుత్ సరఫరా సమస్యలు, భారీ వర్షాల వల్ల భవనాల పరిస్థితిని అంచనా వేసి నివేదికలు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు.

# తెల్లవారి జాము నుంచే తుఫాన్ సహాయక చర్యల్లో మంత్రి నిమ్మల

- తెల్లవారి జాము నుంచే తుఫాన్ సహాయక చర్యల్లో మంత్రి నిమ్మల రామానాయుడు....
- ఈదురు గాలులు, భారీ వర్షంలో తడుస్తూనే మోటార్ సైకిల్ పై పర్యటన
- రహదారులపై కూలిన భారీ వృక్షాల తొలగింపు పనుల్లో స్వయంగా భాగస్వామ్యం..

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

అర్నాబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించి స్వయంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈదురు గాలులు, భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తడుస్తూనే మోటార్ సైకిల్ పై క్షేత్రస్థాయిలో తిరిగారు. తుఫాన్ ప్రభావిత బాధితులను పలకరించి కూటమి ప్రభుత్వంతోపాటు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పలు ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేయించి భోజనాలు వంటి సహాయ కార్యక్రమాలను అందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రధాన రహదారులపై భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో ప్రజా జీవనానికి ఆటంకం ఏర్పడిన నేపథ్యంలో ఆయన పాలకొల్లు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బైక్‌పై క్షేత్రస్థాయి పర్యటన చేపట్టి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాలకొల్లులోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారికి అడ్డంగా భారీ వృక్షం కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో మున్సిపల్, విద్యుత్ శాఖ సిబ్బందితో కలిసి మంత్రి నిమ్మల చెట్టును తొలగించే పనుల్లో స్వయంగా పాల్గొన్నారు. పట్నంలో పలు ప్రాంతాలను పర్యటించి అక్కడ సహాయ పనుల్లో పాల్గొన్నారు. మున్సిపల్ మంచినీటి సరఫరా చెరువును, ఫిల్టర్ ప్లాంట్లను పరిశీలించారు. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ రోగులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని ప్రభుత్వంతోపాటు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలకుండా అవసరమైన చర్యలను తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోను పర్యటించి అక్కడ పరిస్థితులపై అధికారులను ఆరా తీసి సహాయ చర్యలు చేపట్టాలన్నారు. ఈదురు గాలులు, భారీ వర్షానికి పడిపోయిన వరి పొలాలను చూసి రైతులను ఓదార్చారు. రహదారులపై కూలిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యుత్ సరఫరాను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని, తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర పర్యవేక్షణ, ప్రభుత్వ శాఖల అధికార యంత్రాంగం ముందస్తు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వడం వంటి కారణంగా అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదని మంత్రి పేర్కొన్నారు. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో కొంతమేర ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. ప్రజలకు సాధారణ జీవనంలో ఇబ్బందులు కలగకుండా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పలు



గ్రామాల్లో పర్యటించి నేలకొరిగిన పంట పొలాలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను పలకరించి ఓదార్చారు. వ్యవసాయ రంగానికి జరిగిన నష్టాన్ని కూడా అధికారులు తక్షణమే అంచనా వేయాలని మంత్రి ఆదేశించారు. వరి, అరటి, ఇతర ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించాలని సూచించారు. బాధిత రైతులకు నష్టం వివరాల నమోదు విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ రహదారుల పునరుద్ధరణ, ప్రజలకు అవసరమైన సహాయం అందించడం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అత్యవసర సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప ఇళ్లల్లో నుంచి బయటకు రావద్దని కోరారు.

# చెప్పాం చేస్తున్నాం' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళండి

• మంత్రి కొలుసు పార్ధసారథి

**ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు**

నూజివీడు పట్టణం 27వ వార్డులో బుధవారం మున్సిపల్ ఎన్నికలు సందర్భంగా డోరు టూ డోరు ప్రచార కార్యక్రమంలో కూటమిపార్టీ బలపరిచిన అధికారిక అభ్యర్థితో కలసి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విస్తృత ప్రచారం చేశారు. నూజివీడు మున్సిపాలిటీలో రెండున్నర ఏళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కూటమిపార్టీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థి బర్రె ఇళయరాజాను, కౌన్సిలర్లు అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.
ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ చెప్పాం చేస్తున్నాం' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళి, ప్రచారాన్ని మరింత ముమ్మరంచెయ్యాలన్నారు. అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలు ద్వారా అందుతున్నప్రయోజనాలను కూడా ప్రజలకు వివరించాల్సిన



బాధ్యత అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.ఇప్పటికే పూర్తిచేసిన అభివృద్ధి పనులతో పాటు,మిగిలిన కాలంలో చేపట్టనున్న కార్యక్రమాలను కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు. ప్రజలు సమస్యలను తెలుసుకుంటూ, వారికి అందుబాటులో ఉంటూ ఎన్నికలు ప్రచారం నిర్వహించాలని చెప్పారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమమే కూటమి అభ్యర్థులకు ప్రధాన బలమని మంత్రి పేర్కొన్నారు. జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గమనిస్తున్నారని, అన్ని వర్గాలు ప్రజలు మద్దతు కూడగట్టేలా నాయకులు సమన్వయంతో పనిచేయ్యాలన్నారు. కూటమిపార్టీ అభ్యర్థులు,నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఎన్నికలు ప్రచారంలో పాల్గొని, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. వార్డులు అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజలు భాగస్వామ్యం కీలకమని అన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయ్యాలని మంత్రి కోరారు.ఈ కార్యక్రమంలో పోటీలో ఉన్న అధికారిక అభ్యర్థి, కూటమిపార్టీ నాయకులు, వార్డునాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు వార్డు ప్రజలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లా వ్యాప్తంగా 137 పునరావాస కేంద్రాల ద్వారా సమర్థవంతంగా
# తుఫాను సహాయక చర్యలు

• జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

**ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ**

జిల్లాలో సంభవించిన 'అర్నాబ్' తుఫాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బాధితులను ఆదుకునేందుకు యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని, సహాయక చర్యలు వేగవంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం 8:00 గంటల వరకు అందిన క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా తుఫాను ప్రభావం, పునరావాస కేంద్రాల నిర్వహణపై వివరాలను వెల్లడించారు.

**కాకినాడ డివిజన్ పరిధిలో సహాయక చర్యలు:**

కాకినాడ రెవెన్యూ డివిజన్‌లో పరిధిలో తుఫాను ప్రభావం ఎక్కువగా ఉన్నందున ముందస్తు భద్రతా చర్యలు ముమ్మరంగా చేపట్టామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ డివిజన్ పరిధిలోని 28 రెవెన్యూ గ్రామాలు, ఒక మున్సిపాలిటీ తుఫాను ప్రభావానికి గురయ్యాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు డివిజన్ వ్యాప్తంగా 110 పునరావాస కేంద్రాలను సిద్ధం చేయగా, అందులో 61 కేంద్రాలను ప్రారంభించి ప్రజలకు ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు. ఈ కేంద్రాలలో ప్రస్తుతం 10,503 మంది ప్రజలు సురక్షితంగా ఉన్నారన్నారన్నారు. ఇందులో 18 మంది దివ్యాంగులు ఉన్నారని ఆయన తెలిపారు. ఇప్పటివరకు 15,345 ఆహార ప్యాకెట్లు మరియు 15,736 తాగునీటి క్యాన్లను పంపిణీ చేశామని వివరించారు.

**పెద్దాపురం డివిజన్ పరిధిలో సహాయక చర్యలు:**

పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో కూడా ముందస్తు అప్రమత్తతతో సహాయక చర్యలు ప్రారంభించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ డివిజన్‌లో ఒక రెవెన్యూ గ్రామం తుఫాను బారిన పడిందని ఆయన తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా 27 పునరావాస కేంద్రాలను అందుబాటులో ఉంచగా, అత్యవసర ప్రాతిపదికన ఒక పునరా వాస కేంద్రాన్ని తెరిచి 600 మంది బాధితులకు సురక్షిత ఆశ్రయం కల్పించినట్లు ఆయన వివరించారు. ఈ సహాయంలో ఉన్న ప్రజలందరికీ 2,130 ఆహార ప్యాకెట్లు, 30 తాగునీటి క్యాన్లతో పాటు ప్రాథమిక వైద్య, వసతి సౌకర్యాలను అందజేస్తున్నామని తెలిపారు.

**సమన్వయంతో సహాయక పునరావాస పనులు:**

కాకినాడ జిల్లాలోని కాకినాడ, పెద్దాపురం డివిజన్ల పరిధిలో మొత్తం 29 రెవెన్యూ గ్రామాలపై అర్నాబ్ తుఫాను ప్రభావం పడిందని, యంత్రాంగం సిద్ధం చేసిన 137 పునరావాస కేంద్రాలలో ఇప్పటివరకు 62 కేంద్రాలను బాధితుల సేవల్లోకి తీసుకువచ్చామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా మొత్తం 11,103 మంది నిరాశ్రయులకు సురక్షిత వసతి, మొత్తంగా 17,475 ఆహార ప్యాకెట్లు మరియు 15,766 తాగునీటి క్యాన్లను అందజేశామని తెలిపారు. ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని, తుఫాను తీవ్రత తగ్గే వరకు పునరావాస కేంద్రాలను విడిచి వెళ్ళవద్దని కోరారు. పునరావస కేంద్రంలో ఉన్నవారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తూ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటు ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉండడం జరుగుతుంద జిల్లా కలెక్టర్ తెలిపారు.

## అర్నాబ్ తుఫాన్ తీవ్ర ప్రభావంతో జిల్లాలో
# యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు..



• జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్..

**ప్రజాభూమి ప్రతినిధి, కాకినాడ**

జిల్లాలో సంభవించిన అర్నాబ్ తుఫాన్ కారణంగా ఆయా రంగాల పై తీవ్ర ప్రభావం చూపిన నేపథ్యం లో, జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితులను నిశితంగా పర్యవేక్షిస్తూ, పూర్తి సహాయక చర్యలను ముమ్మరం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. వాతావరణ శాఖ తెలిపిన తుఫాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులను అప్రమత్తం చేస్తూ, బాధితులకు తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. బుధవారం సాయంత్రం ఆయా మండల కేంద్రాల నుంచి కాకినాడ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు వచ్చి ప్రాథమిక సమాచారం ఆధారంగా జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా వివరాలు వెల్లడించారు.

**-ముంపు ప్రాంతాల వివరాలు..**

అర్నాబ్ తుఫాను ధాటికి జిల్లాలో జనజీవనం తీవ్రంగా అస్తవ్యస్తమైందని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 7 మండలాలు, 29 గ్రామాలు ఈ విపత్తు ప్రభావానికి గురయ్యాయన్నారు. ఒక గ్రామం పూర్తిగా నీట మునిగిపోగా, సుమారు 21,522 మంది ప్రజలు ఈ వరదల బారిన పడ్డారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

**వ్యవసాయ ఉద్యానవన పంటలకు జరిగిన నష్టం..**

భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్ట వాటిల్లిందన్నారు. జిల్లాలో మొత్తం 14,414 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాట్లు ఆధునికంగా అంచనా వేశామన్నారు. అలాగే 997.344 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఆయన వెల్లడించారు.

**దెబ్బతిన్న గృహ సముదాయాలు, కూలిపోయిన ఇళ్లు..**

వరద నీటి ఉధృతికి పలు ఇళ్లు పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 78 ఇళ్ల ధ్వంసమయ్యాయని, ఇందులో 1 పక్కా ఇల్లు, 4 పూరి గుడిసెలు పూర్తిగా కూలిపోగా, 1 పూరి గుడిసె తీవ్రంగా దెబ్బతిందన్నారు. అలాగే 5 పక్కా ఇళ్లు, 67 పూరి గుడిసెలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

**పశువులు నష్టం, చెట్ల నేలకూలడం..**

ఈ అర్నాబ్ ప్రకృతి వైపరీత్యం వల్ల పశువులు కూడా బలయ్యాయన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10 పెద్ద జంతువులు ప్రాణాలు కోల్పోగా, పశువులు ఉండే 3 షెడ్లు దెబ్బ తిన్నాయన్నారు. భారీ ఈదురు గాలుల కారణంగా రహదారులపై మొత్తం 484 చెట్లు నేలకూలిపోవడంతో రవాణాకు అంతరాయం ఏర్పడిందన్నారు.

**మత్స్య శాఖకు వాటిల్లిన నష్టం వివరాలు..**

మత్స్యకారులకు ఈ తుఫాను కారణంగా సముద్రంలో వేటకు వెళ్లిన ముగ్గురు మత్స్యకారులు గల్లంతయ్యారన్నారు. మొత్తం 68 బోట్లు, వలలు పూర్తిగా కోల్పోగా, మరో 682 బోట్లు, వలలు దెబ్బతిన్నాయని. ఇందులో 459 వలలు పూర్తిగా పాడవగా, 261 బోట్లు దెబ్బతిన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. దీనికి తోడు 80 ఎకరాల చేపలు, రొయ్యల సాగు చెరువులు దెబ్బతినడం వల్ల మత్స్య శాఖ పరిధిలో మొత్తం 151 లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేయడం జరిగిందన్నారు.

**విద్యుత్ సరఫరా వ్యవస్థకు తీవ్ర నష్టం..**

తుఫాను గాలుల కారణంగా విద్యుత్ వ్యవస్థ చిన్నాభిన్నమైంది. జిల్లాలో 3 విద్యుత్ ఉప కేంద్రాలు (సబ్-స్టేషన్లు), 33 కేవీ ఫీడర్లు 3, 30 ఎలక్ట్రిక్ 11 కేవీ ఫీడర్లు దెబ్బతిన్నాయన్నారు. ప్రమాదకరంగా మారి దెబ్బతిన్న వాటిలో 11 కేవీ విద్యుత్ పోల్స్ 80, ఎల్టీ పోల్స్ 68, 33 కేవీ పోల్స్ 11 వరకు నేలకూలినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి కొన్ని పనులు దెబ్బతినగా, 10 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందన్నారు.

**యుద్ధప్రాతిపదికన సహాయక చర్యల..**

జిల్లాలో తీవ్ర తుఫాను నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో 137 పునరావస శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అన్ని శాఖల యంత్రాంగం సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. విపత్తు నిర్వహణ సిబ్బంది (ఎన్.డి.ఆర్.ఎఫ్ / ఎస్.డి.ఆర్.ఎఫ్) నుండి 20 మందిని రంగంలోకి దించామన్నారు. సహాయక చర్యల కోసం మొత్తం 55 పునరావస బోట్లను వినియోగిస్తున్నామని, ఇప్పటివరకు తుఫాను ప్రభావిత ప్రాంతాల నుండి మొత్తం 5,192 మందిని సురక్షితంగా రక్షించి, పునరావస శిబిరాలకు తరలించి, అవసరమైన వసతి కల్పించామన్నారు. బాధితుల కోసం 19,896 ఆహార పొట్లాలను, 19,802 తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వెల్లడించారు.

# అన్ని వార్డుల్లో పట్టణ ప్రజలకు సకల సౌకర్యాలు కల్పిస్తాం

• రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

**ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు**

నూజివీడు పట్టణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 17వ వార్డులో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి, కౌన్సిలర్ అభ్యర్థి శ్రీ బజారు దుర్గాప్రసాద్ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా అపార్ట్‌మెంట్ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, పార్కు అభివృద్ధి జరగక నిరుపయోగంగా ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి రానున్న నాలుగు నెలల్లో వార్డులో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలనుపరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ నూజివీడు పట్టణంలో ఇప్పటివరకు సుమారు రూ.88.46 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. హైమాస్ట్ లైట్లు, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఇండోర్ స్టేడియం, ఐదు పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. హనుమాన్ జంక్షన్ రోడ్డును కూడా గతంలో



ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపించామని తెలిపారు. ద్వారకానగర్ వాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, నవంబరు 25వ తేదీ నాటికి ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ అధికారులతో వెంటనే మాట్లాడి, అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు, రిక్వెస్ట్ స్టాప్‌లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.నూజివీడు పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడతామని మంత్రి స్పష్టం చేశారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో హైదరాబాద్‌లోని ప్రముఖ పార్కులకు దీటుగా ఒక అత్యాధునిక పార్కును అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించి, వారి అవసరాలను తెలుసుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని, రానున్న నాలుగు నెలల్లో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 17వ వార్డు పరిధిలోని శివారు ప్రాంతమైన శ్రీనగర్‌లో మంత్రి పర్యటించారు. అక్కడ నివసిస్తున్న సుమారు 50 కుటుంబాలు సరైన తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు, రోడ్లు లేక ఇబ్బందులుపడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి అవసరమైన చోట గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలనిఅధికారులను ఆదేశించారు. అలాగే 33 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ కిందకు ఉండటంతో ఎదురవుతున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ లక్ష్యమని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలంటే కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి, భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# నేడు జిల్లాలో అన్ని మేనేజ్మెంట్ పాఠశాలలకు సెలవు

**ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా**

ఏలూరు, జిల్లాలో అర్నాబ్ తుపాను కారణంగా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు ఈనెల 29వ తేదీన సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. తుపాను ప్రభావం మరియు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అందరూ గమనించి, సంబంధిత విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. బుధవారం ఉపాధ్యాయులు తమ పాఠశాలలను పరిశీలించి, విద్యుత్ సరఫరా సమస్య, భారీ వర్షాలకు పాఠశాల భవనాలు స్థితిని పరిశీలించి నివేదికలు అందించాలని కలెక్టర్ డీఈఓ ని ఆదేశించారు.

## ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో
# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

• రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

**ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు**



ఆర్నబ్ తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాల నివారణ చర్యలు చేపట్టడం కోసం అధికారులు మరియు కౌన్సిల్ అభ్యర్థులతో వర్చువల్లో రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి సమీక్ష సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని వార్డులలో అధికారులు మరియు కౌన్సిల్ అభ్యర్థులు సమన్వయంతో కలిసి వార్డులను అనుక్షణం పర్యవేక్షించాలని, నివారణ చర్యలను తక్షణమే చేపట్టాలని మంత్రివర్యులు అధికారులకు మరియు కౌన్సిల్ అభ్యర్థులకు దిశా నిర్దేశం చేశారు.మరి ముఖ్యంగా వార్డుల్లో కురిసిన వర్షాలకు, గాలి తుఫానుకు గాను విద్యుత్ ఆటంకాలు, త్రాగునీరు మరియు ఇతర ఆటంకాలు ఏర్పడితే వెంటనే పరిష్కరించాలని, నిర్మూలించాలని మంత్రివర్యులు ఆదేశించారు.ఎన్నికల ప్రచారాన్ని కాస్త పక్కన పెట్టి ప్రజల అవసరాలు, ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు మరియు నాయకులకు ఆదేశించారు.తుఫాను, భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా చెట్లు మరియు విద్యుత్ స్తంభాలు విరిగిన చోట వెంటనే పనులు చేపట్టాలని మంత్రివర్యులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కూటమి కౌన్సిల్ అభ్యర్థులు, మున్సిపల్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్



**ప్రజాభూమి ప్రతినిధి,యు.కొత్తపల్లి:**

అర్నబ్ తుఫాను ప్రభావంతో యు .కొత్తపల్లి లో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్..జిల్లా ఎస్పీ బిందు మాధవ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. తీర ప్రాంతం, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలో భాగంగా యు.కొత్తపల్లి జెడ్పి హైస్కూల్ ఏర్పాటు చేసిన 'అర్నాబ్' తుఫాను పునరావాస కేంద్రాన్ని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈ సందర్శించారు. సంబంధిత అధికారులతో కలిసి ఆయన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, పునరావాస కేంద్రంలో నిర్వహిస్తున్న సహాయక చర్యల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి అందుతున్న మౌలిక సదుపాయాలు, తాగునీరు, వసతి, భోజన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ప్రజలకు సకాలంలో భోజనం అందాం చాలన్నారు. తాగు నీరు, విద్యుత్తు సుదుపాయల అంతరం లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. అవసరమైన వారికి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, పాడా పీడీ డాఎన్.శివ రామ్ ప్రసాద్ పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఆనంద్ రావు, యు.కొత్తపల్లి తహసీల్దార్ జి.చిన్నారావు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్నాబ్ తుఫాను ప్రభావం..
# వాగులు, లోతట్టు ప్రాంతాల పరిశీలన

**ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి**



ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆగిరిపల్లి ఎస్సై వి. సురేష్ బుధవారం కుంపిణీ వాగు, తోటపల్లి, వడ్లమాను గ్రామాలకు వెళ్లే మార్గాల్లోని వాగులు, మండలంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఆగిరిపల్లి, సగ్గూరు గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు పొంగి ప్రవహిస్తున్నప్పుడు దాటేందుకు ప్రయత్నించవద్దని, వరద నీరు ఉన్న రహదారులపై ప్రయాణించవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బ్రాహ్మణ వీధి తిలక్ రోడ్ గాంధీ బజార్ ప్రచారంలో ఎంపీ అంబిక



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలోని 13వ వార్డు పరిధిలో బ్రాహ్మణ వీధి, తిలక్ రోడ్, గాంధీ బజార్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో బుధవారం కమలానగర్ 18వ వార్డులో కూటమి బీజేపీ అభ్యర్థి చిత్రాల రాజేష్ కుమార్ ని, మేయర్ అభ్యర్థి రాజేష్ కుమార్ యాదవ్ ని కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ కూటమి బీజేపీ మేయర్ అభ్యర్థి అజయ్ బాబు యాదవ్ ని, 13వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి కుర్లపల్లి విజయ్ కుమార్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని స్థానిక ఓటర్లను అభ్యర్థించారు. ఈ వార్డులో స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రజల సంక్షేమం, నగర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలియజేశారు. అనంతపురం నగరంలో రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మౌలిక వసతుల కల్పనతో పాటు పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శబరి, విశ్వబ్రాహ్మణ డైరెక్టర్ రంగాచారి, మాజీ కార్పొరేటర్ గూడూరు మల్లికార్జున, వ్యాపారవేత్త బాలసుబ్రహ్మణ్యం, కరీముల్లా, అస్లాం భాష, రాజాచారి, పిన్ని నాగరత్నం, వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'మైన్స్ ప్రూఫ్' వాహనాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ జగదీష్

**ఎన్నికల వేళ ... ఎలాంటి సవాళ్లనైనా తిప్పికొట్టేందుకు జిల్లా పోలీస్ సిద్ధం**



ప్రజాభూమి ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు మూకలు విసిరే ఎలాంటి సవాళ్లనైనా సురక్షితంగా తిప్పికొట్టేందుకు వాహనం సర్వసన్నద్ధం ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, అవాంఛనీయ సంఘటనల నివారణే ధ్యేయంగా జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో మైన్స్ ప్రూఫ్ వాహనాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల వేళ గుంపులు, హింసాత్మక మూకలు (మాబ్) ఎదురైనా, వాటిని సులువుగా చెదరగొట్టేందుకు పోలీసు సిబ్బంది సురక్షితంగా సవాళ్లను తిప్పికొట్టేందుకు ఈ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వెల్లడించారు. వాహనం పనితీరు, సాంకేతిక పరిజ్ఞానం, అత్యవసర సమయాల్లో ఉపయోగించే విధానాన్ని ఎస్పీ స్వయంగా తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ?ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలు, ఆయుధాలను సిద్ధం చేసుకుంటున్నామని... శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సి.ఐ క్రాంతికుమార్ , ఆర్ ఐ లు పవన్ కుమార్ , మధు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నకాలవీధిలో వైసీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం

**ఓటర్లను అడుగుతున్న ఎంపీటీసీ 1 షేక్ యూనస్ భాష**



ప్రజాభూమి శింగనమల

శింగనమల మండల కేంద్రంలోని చిన్నకాలవీధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం సందడిగా సాగింది. వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు వీధిలో పర్యటిస్తూ ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలిపి, ఎన్నికల్లో తమకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో చిన్నకాలవీధిలో రాజకీయ సందడి నెలకొంది. ప్రచార కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న ఇంటికి విద్యుత్ బిల్లు బాదుడు!

**యూనిట్లు తక్కువ.. బిల్లు మాత్రం రూ.1449**



ప్రజాభూమి శింగనమల

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాల వెనుక ఉన్న ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న కోమలి నాగరత్న కోమలి శేఖర్ నివాసం ఉంటున్నారు మే నెలలో ఇల్లు ఖాళీ చేసి వేరే ఇంటికి వెళ్లారు ఇంట్లో ఎవరూ లేకపోయినా విద్యుత్ వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ అక్టోబర్ నెలలో ఒకేసారి రూ.1,449 రూపాయలు బిల్లు రావడంపై బాధితుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు నెలలుగా ఇల్లు ఖాళీగా ఉన్నప్పటికీ నెలనెలా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నానని శేఖర్ తెలిపారు. అయితే గత నెలలో ఒక్కసారిగా రూ.1,449 బిల్లు రావడంతో ఆ మొత్తం ఎలా వచ్చిందో వివరించాలని విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్ నారాయణస్వామిని ప్రశ్నించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా లైన్‌మెన్ నుంచి పొంతనలేని సమాధానాలు వచ్చాయని, తన ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడినట్లు బాధితుడు ఆరోపించారు. తక్కువ విద్యుత్ వినియోగం ఉన్నప్పుడు అధిక బిల్లు ఎందుకు వచ్చిందనే విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పరిశీలించి, బిల్లు వివరాలను తనిఖీ చేసి, సమస్యను పరిష్కరించాలని కోమలి శేఖర్ విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం అభ్యర్థి కే. నాగభూషణాన్ని గెలిపించండి- పుట్లూరు మండల కార్యదర్శి ఎస్ సూరి



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలం కడవకల్లు బీసీ కాలనీలో బుధవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పుట్లూరు మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా సీపీఎం పార్టీ తరఫున పోటీ చేస్తున్న కే. నాగభూషణాన్ని గెలిపించాలని కోరుతూ ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ పుట్లూరు మండల కార్యదర్శి ఎస్. సూరి మాట్లాడుతూ, సీపీఎం పార్టీ నిత్యం రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలు ఎక్కడ ఉన్నా వాటి పరిష్కారం కోసం ముందుండి పోరాడే పార్టీ సీపీఎం అని అన్నారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలంటే ప్రజా ఉద్యమాలు, పోరాటాల ద్వారా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పుట్లూరు మండల అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పలు పోరాటాలు చేపడతామని తెలిపారు.

సీపీఎం ప్రధాన డిమాండ్లు

పుట్లూరు మండలంలో రైతు మార్కెట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రెండు ఎకరాల భూమి కేటాయించాలి. కార్మికులకు లేబర్ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. ఆటో డ్రైవర్లకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు అందించాలి. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహించాలి. కరువు పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలి. వ్యవసాయ కార్మికులకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలి. రైతులకు పంట నష్టపరిహారం అందించడం తోపాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. రైతులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి. ఈ సమస్యలన్నింటి పరిష్కారం కోసం సీపీఎం పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు కొనసాగిస్తుందని ఎస్. సూరి స్పష్టం చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఎం పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి కే. నాగభూషణాన్ని గెలిపించాలని పుట్లూరు మండల ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. సీపీఎం అభ్యర్థిని గెలిపించడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలను మరింత బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి. పెద్దయ్య, వెంకట శివారెడ్డి, జె. పెద్దయ్య, పుట్లూరు మండల జెడ్పీటీసీ అభ్యర్థి కే. నాగభూషణం పాల్గొన్నారు.

# వైకాపాలోనే మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత

- వైసీపీ ఏకంగా చైర్మన్ స్థానం ఇచ్చింది -టీడీపీ కనీసం వైస్ చైర్మన్ పదవైనా కేటాయిస్తుందా..
- ముస్లిం మహిళకు అవకాశం కల్పించిన జగన్‌కు కృతజ్ఞతలు
- రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షులు ఖాదర్ భాష



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడమే కాకుండా, కీలక పదవుల్లో భాగస్వామ్యం కల్పించడంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుందని ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షులు ఖాదర్ భాషా పేర్కొన్నారు. హిందూపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ముస్లిం మహిళ డి. షాజియాకు అవకాశం కల్పించడం ద్వారా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు రాజకీయంగా అండగా నిలిచారని తెలిపారు. వైసీపీ ఏకంగా చైర్మన్ స్థానాన్ని మైనార్టీ మహిళకు కేటాయిస్తే, తెలుగుదేశం పార్టీ కనీసం వైస్ చైర్మన్ పదవినైనా మైనార్టీలకు కేటాయిస్తుందా అని ప్రశ్నించారు. మైనార్టీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలో వివిధ పార్టీల వైఖరిని ప్రజలు గమనించాలన్నారు. బుధవారం హిందూపురం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చైర్మన్ అభ్యర్థి షాజియా, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, ఇతర మైనారిటీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేశారని ఖాదర్ భాషా గుర్తు చేశారు. ఆయన బాటలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు సంక్షేమ పథకాలతోపాటు రాజకీయంగా అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. తమ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 12 మున్సిపల్ చైర్మన్ స్థానాలను మైనార్టీలకు కేటాయించిందని, కూటమి ప్రభుత్వం మాత్రం రెండు స్థానాలకే పరిమితమైందని విమర్శించారు. మైనార్టీలకు రాజకీయ పదవులు కల్పించడం ద్వారా వారి సమస్యలను పాలనా వ్యవస్థ దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభిస్తుందని అన్నారు. కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, నిర్ణయాలు తీసుకునే స్థానాల్లోనూ మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలని అభిప్రాయపడ్డారు. హిందూపురం నియోజకవర్గంలో గతంలో మహమ్మద్ ఇక్బాల్‌కు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించామని, అనంతరం ఎమ్మెల్సీగా కూడా అవకాశం ఇచ్చామని ఖాదర్ భాషా తెలిపారు. ఇప్పుడు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా షాజియాను ఎంపిక చేయడం ద్వారా ముస్లిం మహిళకు నాయకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం కల్పించిందన్నారు. సుమారు 25 ఏళ్ల తర్వాత మైనార్టీలకు ఇలాంటి అవకాశం లభించిందని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. మైనార్టీ మహిళలకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముస్లిం సమాజంతోపాటు ఇతర వర్గాల ప్రజలు కూడా ఈ అంశాలను పరిశీలించి తమ అభిప్రాయాలను ఏర్పరచుకోవాలని అన్నారు. చైర్మన్ అభ్యర్థి డి. షాజియా మాట్లాడుతూ, హిందూపురం పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు సేవ చేస్తూ, పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న తనకు మైనార్టీ మహిళగా చైర్మన్ అభ్యర్థిత్వం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అవకాశం కల్పించడంలో సహకరించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి, వేణురెడ్డి, దీపికాతోపాటు పార్టీ సీనియర్ నాయకులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందిస్తున్న సహకారంతో ప్రజల ముందుకు వెళ్తున్నానని పేర్కొన్నారు. హిందూపురం పట్టణ ప్రజలందరూ తనను ఆదరించి, కులమతాలకు అతీతంగా విలువైన ఓటు వేసి గెలిపించాలని షాజియా విజ్ఞప్తి చేశారు. ముస్లిం సోదరులు, సోదరీమణులతోపాటు పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు తనకు మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులందరికీ ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆశీర్వాదంతో అవకాశం లభిస్తే పట్టణ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, డాక్టర్ బాషా, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు చాంద్ భాషా, ఇస్మాయిల్, మన్సూర్, షాజహాన్, ఫారూక్, అయూబ్, హుమాయూన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశంతోనే అన్ని వర్గాల సంక్షేమం

- మంజునాథ్ గెలిపించి అభివృద్ధికి సహకరించండి
- కూటమి అభ్యర్థుల గెలుపు కోసం వసుంధర దేవి రోడ్ షో
- ప్రజల నుండి అపూర్వ స్పందన





ప్రజాభూమి, హిందూపురం టౌన్

తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి పేర్కొన్నారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎనలేని చేస్తున్నారని, ముఖ్యంగా హిందూపురం పట్టణ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి పురిడి మంజునాథ్, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా వసుంధర దేవి బుధవారం పట్టణంలోని త్యాగరాజనగర్, శాంతి నగర్, ఆర్టీసీ కాలనీ, మేళాపురం, చౌడేశ్వరి కాలనీ, కొల్లకుంట, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్ షో నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ షోలకు అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా స్థానికులు పూలవర్షం కురిపిస్తూ, మంగళ హారతులు పాడుతూ స్వాగతించారు. మన ప్రాంతాల్లో క్రేన్లతో గజమాలలు వేస్తూ కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఆయా ప్రాంతాల్లో వసుంధర దేవి మాట్లాడుతూ, నవంబర్ 1వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పురిడి మంజునాథను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అదేవిధంగా 50 వార్డులకు పోటీ చేస్తున్న కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను సైతం గెలిపించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన స్వర్గీయ ఎన్టీ రామారావు నుండి ప్రస్తుతం వరకు హిందూపురం ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించి అభిమానిస్తున్నారన్నారు. ఆ అభిమానాన్ని నిలబెట్టుకోవడానికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సైతం ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రావాలంటే కూటమి అభ్యర్థి మంజునాథ్ ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి చైర్మన్ అభ్యర్థి మంజునాథ్ మాట్లాడుతూ, పట్టణాన్ని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు తనకు అవకాశం కల్పించాలన్నారు. అన్ని వార్డుల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తొలి ప్రాధాన్యతగా ఆయన తెలిపారు. హిందూపురం పట్టణాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రజలందరూ సహకరించి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రావిళ్ళ లక్ష్మి, చైర్మన్ అభ్యర్థి సతీమణి యుక్త శ్రీ, శ్రీసత్యసాయి జిల్లా టిడిపి మాజీ అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇమాములు, ఖాజీలు, ముస్లిం మత పెద్దల ఆత్మీయ సమావేశం మంత్రి, ఎంపీ అంబిక



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరంలోని రాంనగర్‌లో క్రీసెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ముతవల్లీల సంఘం అధ్యక్షులు సైకిల్ షఫీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఇమాములు, ఖాజీలు, ముస్లిం మత పెద్దల ఆత్మీయ సమావేశంలో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం నగర మేయర్ అభ్యర్థి అజేష్ బాబు యాదవ్ ని, 62 డివిజన్లలో కూటమి అభ్యర్థులను గెలిపించి నగర అభివృద్ధికి సహకరించాలని ముస్లిం సోదరులను కోరారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మైనారిటీల కోసం మూడు ప్రాంతాల్లో రూ.53 లక్షలతో కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేసిన విషయాన్ని తెలియజేశారు. ఆరోగ్య సేవలు, ఇమాములు, ఖాజీలకు గౌరవ వేతనాలు, పేదలకు గృహాలు, మైనారిటీలకు విద్యా, ఉపాధి అవకాశాలు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలియజేశారు. మైనారిటీల సంక్షేమం, నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు అవసరమని, అనంతపురం అభివృద్ధికి అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు పూల నాగరాజు, మాజీ మంత్రి, ఎన్నికల పరిశీలకులు ఏరాసు ప్రతాపరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ బల్ల పల్లవి, ముతవల్లీల సంఘం ప్రతినిధులు, ఎమ్మెల్సీ రికియా భాను, ఏపీఐసీ ప్రతినిధి ప్రసాద్, హాస్పిటల్ కమిటీ ప్రతినిధి నర్సింహులు, బీజేపీ నాయకులు దినకర్, లలిత్ కుమార్, డాక్టర్ ఉమర్ ముక్తార్ ఇతర కూటమి నాయకులు, ఇమాములు, ఖాజీలు, ముస్లిం మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం సాగుతుంది

**ప్రచారంలో పాల్గొన్న తరిమెల వంశీ గోకుల్ రెడ్డి**



ప్రజా భూమి శింగనమల

మండలం పరిధి గురుగుంట్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ' జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్ రెడ్డి పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ప్రచారంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలుపై వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలతో మాట్లాడారు. జగనన్న ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ పార్టీ శ్రేణులు గ్రామంలో ప్రచారం కొనసాగించాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గన్ను, పెన్నుల కనుసన్నల్లో, పట్ట పగలు ప్రజాస్వామ్యం ,ఖూనీ

ప్రజాభూమి పోరుమామిళ్ల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పోలీసుల గన్ను, ఉన్నత అధికారుల పెన్ను సహాయ సహకారలతో పూర్తిగా,అత్యంత నీచాతి,నీచమైన, దారుణంగా, దుర్మార్గమైన పద్దతిలో ప్రజా స్వామ్యం పట్టపగలే, ఖూనీ చేయ పడినదని, భారతదేశ చరిత్ర లో,కని, విని ఎరుగని రీతిలో సినిమాల్లో చూసినవి, నిజ జీవితంలోచూశామని,ఒక భారతదేశ పౌరుడిగా ,కడప రమణారెడ్డి ఆవేధన వ్యక్త పరిచారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ లో ప్రజలే తమను పాలించే పాలకులను తమ ఓటు వేసి ,తద్వార ఎన్నుకునే హక్కులను మన పెద్దలు రాజ్యాంగాన్ని ఏర్పాటుచేసినారు, ఆ రాజ్యాంగ పరిరక్షణ,ప్రజా స్వామ్య పరిరక్షణకు, ,ఏరాజకీయ పార్టీలకు తలొగ్గ కుండా స్వయం ప్రతిపత్తి కలిగిన కొన్ని,వ్యవ స్థలను ఏర్పాటుచేశారు. రాజ్యంగంపై ప్రమాణం చేసి, ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అత్యున్నత పదవులలో ఉండి, నిష్పక్షపాతంగా వ్యవహారిం చవలసిన అదికార యంత్రాంగం, అదికార పార్టీకి, కొమ్ముకాసి ,వారి సమక్షంలోనే నిర్ధాక్షిణ్యంగా ప్రజాస్వామ్య వ్యవస్థను, సీసీ కెమెరాలు, మీడి యాల,సమక్షంలో, పట్టనపగలు ఖూనీ చేస్తున్నా, (కంచే చేనుమేస్తే ,కాపాడేదెవరు?) వారికి,కన పడదు,వినపడదు. ఈ మధ్య జరిగిన నామినేషన్ల ప్రక్రియ ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలు,మన రాష్ట్ర అదికార యంత్రాంగంపై ,అదికార పార్టీలపై దుమ్ము ఎత్తిపోస్తున్నా చలనం లేదు .సామాన్యులు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కోర్టులకు వెళ్లే అవకాశాలు కూడ లేకుండ ప్రకటనలు గొప్పగా చెప్తారు ఆచరణ మాత్రం శూన్యం. గతంలో అదికా ర పక్షానికి అదికారులు 5% ,సహకరించేవారు. కానీ ప్రస్తుతం 95% సహాయ సహకారం అందించినారు. సమాజంలో గంజా, బ్లేడ్ బ్యాచ్, రౌడీలు, గూండాలు, హత్యలు, మానభంగాలు చేస్తే, మానవమృగాలు అంటారు ప్రజాస్వామ్యాన్ని ఈ మధ్య భరత మాత కంట తడిపెట్టే విధంగా నామినేషన్ల కేంద్రాల వద్ద అధికారుల సమక్షంలో,



వారి కనుసన్నలో జరిగిన,జరుగుతున్న దౌర్జన్య కాండ, రక్తపాతం నామినేషన్ల పత్రాలు బలవం తంగా చించివేత, మహిళలపై నిర్ధాక్షిన్య దాడులు, రిటర్నింగ్ అధికారుల, ఆధీనంలో ఉన్న టేబుల్స్ లోని నామినేషన్ల పత్రాల చించివేసిన విధానం చూస్తు వారికి రక్షణ కవచంలా నిలిచిన అదికార యంత్రంగంలోని కొందరు అధికారులకు ఏ బిరుదు అంకితంచేయాలి?ప్రజాస్వామ్య పరిరక్షణే మాద్యే యం అని రాజ్యాంగపై ప్రమాణం చేసి అత్యు న్నత,పదవులు చేపట్టిన అదికారుల ఆత్మసాక్షి ఎలా నిద్ర పోనిస్తుందో ? "విక్రమార్క "సినిమాను తలపిస్తుందన్నారు. సామాన్య ప్రజల ఆస్తులకు, హక్కులకు రక్షణ కరువై వ్యవస్థలపై ప్రజలకు ఉన్న అత్యంత నమ్మకం, విశ్వావాసము,ధైర్యం పూర్తిగా కోల్పోయి బ్రతుక వలసిన పరిస్థితులు ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడినవి. బలవంతుడికి,అధికార యంత్రాంగం కవచంలా తోడైతే, సామాన్య ప్రజల పరిస్థితులు ఊహలకు అందవు. కావున మేధా వులు,విద్యావంతులు,ప్రజాసంఘాలు కలిసిభవిష్యత్ ఆలోచించండి. అదికార పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలు,దౌర్జన్య పద్ధతి లో ఏక గ్రీవాలు చేసుకొని, సంతోషించే బదులు, నామినేటెడ్ పోస్టులు గా జీవో సృష్టించు కొని,తమ పార్టీల కార్యకర్తలకు, ఇదేరీతిలో పదవులు పంపిని చేసుకొని ఉంటే బాగుండేది. ఎన్నికల ప్రక్రియ, ఖర్చులు, అధికార యంత్రాంగం, సమయమువృథా,గ్రామ గ్రామాన కక్షలు,రక్త సిక్తము,ఊరూర యుద్ధ పరిణామాలు లేకండా,రాష్ట్ర ప్రజలు ప్రశాంత జీవితం గడిపేవా రు కదా? అని తన ఆవేదన వ్యక్త పరిచారు.

# పులివెందులలో వైసీపీ నేత కారు దగ్ధం - ఉద్రిక్తత

### టీడీపీ నేతలపై ఎంపీ అవినాష్ రెడ్డి సంచలన ఆరోపణలు -తొందరలోనే సినిమా చూపిస్తామని హెచ్చరిక

ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల పట్టణంలోని నగిరిగుట్ట 36వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు నాగరాజు కారు దగ్ధం కావడం కలకలం రేపింది. మున్సిపల్ ఎన్నికల వేళ జరిగిన ఈ ఘటన పట్టణంలో తీవ్ర రాజకీయ చర్చకు దారితీసింది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నాగరాజుకు చెందిన శఖ౦ 500 కారుకు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినా, మంటలను అదుపు చేసేలోపే కారు పూర్తిగా అగ్నికి ఆహుతైం ది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన మున్సిపల్ వైసీపీ నాయకుల సమావేశానికి ప్రజలను తరలించాడనే కోపంతోనే టీడీపీ నాయకులు తన కారుకు నిప్పు పెట్టారని బాధితుడు నాగరాజు ఆరోపించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎంపీ అవినాష్ రెడ్డి

విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పులివెందుల మున్సిపల్ వైసీపీ ఇన్చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, మాజీ చైర్మన్ చిన్నప్ప తదితర వైసీపీ నాయకులతో కలిసి బుధవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్నారు. దగ్ధమైన కారును పరిశీలించి బాధితుడిని వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ - పులివెందులలో టీడీపీ నేతలు రాజకీయ దాడులకు పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభ మైనప్పటి నుంచి వైసీపీ కార్యకర్తల ఆస్తులను లక్ష్యంగా చేసుకుంటున్నారని, తమ కౌన్సిలర్ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నా రని, నామినేషన్ల సమయంలో ఏకే-47 తో కాల్పు లు జరిపారని ఆరోపించారు. గత పది రోజుల్లోనే ఐదు ప్రాంతాల్లో వాహనాలు దగ్ధం చేశారని, దుకాణాలు, ద్విచక్ర వాహనాలు, కార్లను తగలబెట్టి రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, పులివెందుల టీడీపీ ఇన్చార్జ బీటెక్ రవి ఆధ్వర్యంలోనే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. తమ కార్యకర్తలు ప్రస్తుతం ఇబ్బం దులు పడుతున్నా, తొందరలో మీకు సినిమా చూపిస్తాం అంటూ ఘాటుగా హెచ్చరించారు. ఘటనకు పాల్పడిన వారితో పాటు వెనుక ఉన్న వారికి తగిన సమాధానం చెబుతామని అన్నారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా టీడీపీలోకి భారీ చేరికలు

### నగరిగుట్ట నుండి టీడీపీలోకి 30 కుటుంబాలు

### కండువాలు కప్పి ఆహ్వానించిన ఇన్చార్జ్ బీటెక్ రవి

ప్రజాభూమి, పులివెందుల: పులివెందుల మున్సిపాలిటీలోని నగిరిగుట్టకు చెందిన కావేటి కొం డప్ప, శ్రీనివాసులు, ఎస్. పెంచ లయ్య ఆధ్వర్యంలో 30 కుటుంబా లు, అలాగే రాష్ట్ర హజ్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా, తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బుధవారం



పులివెందుల టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ బీటెక్ రవి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ - చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని, పులివెందులలో టీడీపీ జెండా ఎగర వేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరం పనిచేస్తామన్నారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ - పులివెందులలో వైకాపా పని అయిపోయిందని, అందుకే ప్రజలు స్వచ్ఛందంగా కూటమిలోకి చేరుతున్నారన్నారు. ఎవరు ఎన్ని ఊక దంపుడు మాటలు మాట్లాడినా భయపడేవారు ఇక్కడ ఎవరూ లేరన్నారు. పులివెందులలో టీడీపీ జెండా ఎగరవేయడమే లక్ష్యమని, తూట్ల గీతా కుమారిని మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా చేయడం, వార్డుల్లో కౌన్సిలర్లను గెలిపించుకోవడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ అధికార ప్రతినిధి నల్లగారి భాస్కర్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిద్దవటం మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం

### -జనసేనకు 2, టీడీపీకి 6, వైకాపాకు ఒక స్థానం

ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలకు గాను తొమ్మిది స్థానాలు ఏకగ్రీవమయ్యాయని ఆర్డీవో కృష్ణయ్య వెల్లడించారు. వీటిలో జనసేనకు రెండు, టీడీపీకి ఆరు, వైకాపాకు ఒక స్థానం దక్కాయి. మిగిలిన రెండు స్థానాల కు పోటీ జరగనుంది. జనసేన తరఫున సిద్ధవటం నుంచి అతికా రి వినుత, మాధవరం-1 నుంచి చింతగింజల సుభాషిణి ఏకగ్రీవం



గా ఎన్నికయ్యారు. టీడీపీ తరఫున జంగాలపల్లె నుంచి పాలెం వెంకటమ్మ, బొగ్గడివారిపల్లె నుంచి కొమ్మూరి పెంచలమ్మ, ఉప్పరపల్లె నుంచి సామా శ్రీనివాసులు, పెద్దపల్లె నుంచి కాడే చిన్నక్క, మాచుపల్లె నుంచి కోటపాటి మధు, వంతాటిపల్లె నుంచి బూసి చిన్న సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. వైకాపా తరఫున మాధవరం-2 నుంచి శ్రీరామదాసు లలిత ఏకగ్రీవమయ్యారు. పి.కొత్తపల్లె స్థానంలో వైకాపా అభ్యర్థి సౌరి డి. విజయలక్ష్మి, టీడీపీ అభ్యర్థి జ్యోతి శివారెడ్డి పోటీలో ఉండగా, టక్కోలు స్థానంలో స్వతంత్ర అభ్యర్థులు సింగం పద్మావతి, బత్తల లక్ష్మీదేవి పోటీ పడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిద్ధవటం ఎస్ఐ హారిక, ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయ కర్త అతికారి కృష్ణ, టీడీపీ మండల ఇన్ఛార్జి శ్రీనివాసరాజు, మండల అధ్యక్షుడు రాజశేఖర్, ఏపీ పంచాయతీరాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి, అవ్వారు రవిశంకర్, దేరంగుల శ్రీకాంత్, చెంచయ్య నాయుడు, భవనాసి ఓబులయ్య, జనసేన నాయకుడు అతికారి చిన్న వెంకటయ్య, మహబూబ్ బాషా, పసుపులేటి గంగయ్య, ఎన్నారై చలపాటి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి అభ్యర్థులు ఎంపిటిసి 1 ఎంపీటీసీ 2 జోరుగా సాగుతున్న ప్రచారం

### ప్రచారం పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

### కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి ఓటు వేయండి

ప్రజాభూమి శింగనమల మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. శింగనమల ఎంపీటీ సీ-1 అభ్యర్థి కాయల బాలకృష్ణ, శింగనమల ఎంపీటీసీ-2 అభ్యర్థి తొట్ల అనురాధకు మద్దతుగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి స్థానిక ప్రాంతాల్లో ప్రచారం చేపట్టి, అభ్యర్థులకు మద్దతు



ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని,సూచించారుగ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల మద్దతుతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక ఓటర్లను కలిసి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంతో మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట భద్రతా చర్యలు - ఎస్పీ ఆదేశం

### ఎన్నికల్లో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### పోలీస్ అధికారులతో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సమీక్ష



ప్రజాభూమి, పులివెందుల: మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకం గా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేం దుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పులివెందుల సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ - ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, సమస్యా త్మక ప్రాంతాల గుర్తింపు, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతర గస్తీ, కాలినడకన పర్యవేక్షణ, వాహన తనిఖీలను ముమ్మరం చేయాలని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సమన్వయం తో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రశాంత ఎన్నికలకు కృషి చేయాలని స్పష్టం చేశా రు. ఈ సమావేశంలో పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగభూష ణ్, పులివెందులఅర్బన్ సీఐ పురుషోత్తంరాజు, రూరల్ సీఐ శాంతిలాల్, ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, ఆర్కే వ్యాలీ సీఐ శంకర్ రెడ్డి, వేంపల్లి సీఐ నరసింహు లు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థి భారతి యాదవ్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం

### పులివెందుల మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

ప్రజాభూమి,పులివెందుల పులివెందుల మండల కూటమి జడ్పీటీసీ అభ్యర్థి బొంగగాని భారతి యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ చంద్రగిరి హరిజనవాడ, గుండువా రిపల్లి, యర్రబల్లె గ్రామాల్లో కూటమి నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ. కొత్తప



ల్లె మాజీ సర్పంచ్ గంగాధర్ యాదవ్ సతీమణి, జడ్పీటీసీ అభ్యర్థి బొంగగాని భారతి యాదవ్‌కు మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అజ్జుగుట్టు రవితేజ రెడ్డి, పులివెందుల నియోజకవర్గ పరిశీలకుడు సామకోటి ఆదినారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు మర్తల జగన్ మోహన్ రెడ్డి, ఈ. కొత్తపల్లె ఎంపీటీసీ పుష్పనాథ్ రెడ్డి, పుష్పగిరి పాఠశాల కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి, పులివెందుల మండల మాజీ వైస్ ఎంపీపీ విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామాల్లో ప్రజలను కలుసుకుని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొంటూ, జడ్పీటీసీ అభ్యర్థి బొంగగాని భారతి యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

# పులివెందుల ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష

### జేఎన్టీయూలో కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ప్రజాభూమి, పులివెందుల: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా పులివెందులలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను బుధవారం జిల్లా అధికారులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ



షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా కలిసి కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

# గంగానగర్‌లో అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి సమీపంలోని గంగానగర్ గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మండపారాధన, యంత్రాలకు అభిషేకం, దీక్షా హోమం, మహా నైవేద్యం తదితర విశేష పూజలు నిర్వహించారు.



ఈ సందర్భంగా వేద పండితుడు మధుసూదన్ శర్మ మాట్లాడుతూ.. మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవాచనంతో కార్యక్రమాలు ప్రారంభించామని, రెండో రోజు ఆంజనేయ స్వామి మూలవి రాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, కలశ పూజలు, మంత్రజపాలు, రుద్ర హోమం నిర్వహిస్తామని చెప్పారు. మూడో రోజు విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కోలాటాల నడుమ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆలయంలోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు సురేష్ బాబు శర్మ, వివేకానంద శర్మ, కేశవాచారి శర్మ, వినోద్‌శర్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# జెఎంజే కళాశాలలో జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీలు

ప్రజాభూమి, సిద్ధవటం: కడప--చెన్నై జాతీయ రహదారిలోని జీఎంజే కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు, మాధవరం, ఒంటిమిట్ట, పాయసంపల్లి ప్రాంతాలకు చెందిన పాఠశాలల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ



సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాగిణి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాగిణి, జిల్లా నెట్‌బాల్ కార్యదర్శి విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడలకు అంబేద్కర్ గురుకుల విద్యార్థులు

ప్రజాభూమి,పులివెందుల బెస్తవారిపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం విద్యార్థులు ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడప మున్సిపల్ స్టేడియంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన ఖో ఖో, కబడ్డీ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. ఖో ఖో అండర్--14 విభాగంలో



వెంకటకృష్ణ, సునీల్, అభిచరణ్, మాధవ్, మహేష్, అండర్--17 విభాగంలో సాయికృష్ణ, హేమంత్, హర్షవర్ధన్, సజీవరాజ్ ఎంపికయ్యారు. కబడ్డీ అండర్--17 విభాగంలో మనోజ్, హర్షవర్ధన్, అనుదీప్, నరేంద్ర, అండర్--14 విభాగంలో శ్రుతి కీర్తన్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ సి. నరసింహులు, వైస్ ప్రిన్సిపాల్, పీడీ బి. రామిరెడ్డి, పీఈటీ డి. సురేంద్ర, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
గురువారం 29 అక్టోబరు 2026

# ఆసియా క్రీడల్లో అర్చరీలో స్వర్ణ, కాంస్య పతకాలతో సత్తా చాటిన తిరుమూరు గణేష్ మణిరత్నం

## -క్రీడాకారుడిని అభినందించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,
ఆసియా క్రీడల్లో అర్చరీ విభాగంలో స్వర్ణ, కాంస్య పతకాలు సాధించి ప్రతిభ చాటిన తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నంను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అభినందించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని, ఆయన విజయాలు జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఎన్నికల అబ్జర్వర్ ఎం. వరప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు తో కలసి తిరుమూరు గణేష్ మణిరత్నంను జిల్లా కలెక్టర్. డా ఎస్. వెంకటేశ్వర్ అభినందించి, ఆయన క్రీడా విజయాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్చరీ వంటి ఏకాగ్రత, క్రమశిక్షణ, నిరంతర సాధనతో కూడిన క్రీడలో



అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం క్రీడాకారుడి పట్టుదలకు, ప్రతిభకు నిదర్శనమన్నారు. స్వర్ణ, కాంస్య పతకాల సాధనతో గణేష్ మణిరత్నం యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే నిరంతర సాధనతో పాటు ఆత్మవిశ్వాసం, లక్ష్యంపై స్పష్టత, పట్టుదల అవసరమని, గణేష్ మణిరత్నం సాధించిన విజయాలు ఈ లక్షణాలకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. దేశానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావడంతో పాటు, తిరుపతి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించాలని మనస్ఫూర్తిగా అభినందించారు. క్రీడాకారులు తమ ప్రతిభను మరింతగా అభివృద్ధి చేసుకునేందుకు ప్రోత్సాహం, అవసరమైన సహాయ సహకారాలు కీలకమని పేర్కొంటూ, గణేష్ మణిరత్నం క్రీడారంగంలో మరింత రాణించేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున కృషి చేస్తామన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించవచ్చని తెలిపారు.

# మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే ధమ్మున్న నాయకురాలు సరిత రమణమూర్తి:లంకెల్ల లలిత..!



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:
చంద్రగిరి మండలాన్ని శాసనసభ్యులు పులివర్తి నాని సహాయ సహకారాలతో అన్ని విధాల అభివృద్ధి చేసే దమ్మున్న నాయకురాలు క్లాస్ వన్ కాంట్రాక్టర్ ఎవి రమణమూర్తి సతీమణి, ఎంపిపి కాబోతున్న సరిత రమణమూర్తి అని చంద్రగిరి ఏఎంసి మాజీ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు లంకెల్ల లలిత తెలిపారు. బుధవారం లంకెల్ల లలిత సరిత రమణమూర్తి స్వగృహం ఐతేపల్లి కి భర్త లంకెల్ల శ్రీరాములతో చేరుకుని ఆమెను దుశ్శాలువాతో సన్మానించి ముందస్తు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాల ఎన్నికల్లో ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికైన ఐదు స్థానాలలో సరిత రమణమూర్తి కల్ రోడ్డు పల్లె నుండి ఎంపిపి అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారని, సరిత రమణమూర్తి ఎంపీపీ కావటానికి మిగిలిన నాలుగు స్థానాలు అవసరం కాగా ఆమె భర్త క్లాస్ 1 కాంట్రాక్టర్ ఎన్నికల వ్యూహ రచనలో దిట్ట కావటంతో కావలసిన నాలుగు స్థానాలే కాకుండా వీలైనంతవరకు ఎక్కువ స్థానాలు గెలుచుకోవటం తధ్యమని లంకెల్ల లలిత జోష్యం చెప్పారు. సరిత రమణమూర్తి ఎంపీపీ కావటానికి మండలంలోని ఓటర్లందరూ తమ తమ సెగ్మెంట్లలోని కూటమి అభ్యర్థులను గెలిపించాలని లంకెల్ల కోరారు. సరిత రమణమూర్తి ఎంపిపి అయ్యేంతవరకు తన సంపూర్ణ సహాయ సహకారాలను అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కూటమి నాయకులు, హర్షిత్, మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎంబీయూలో 'అంతర్జాతీయ ఇంజనీరింగ్ సదస్సు'!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
చంద్రగిరి మండలం, ఏ.రంగంపేట సమీపంలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 29 నుంచి 31 వరకు మూడు రోజుల పాటు "స్థిరమైన భవిష్యత్తు కోసం వినూత్న ఇంజనీరింగ్" అనే అంశంపై ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఇంజనీరింగ్ సదస్సును నిర్వహిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ ఆచార్య పి.వి. రమణ, రిజిస్ట్రార్ డాక్టర్ కే. సారథి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ సాంకేతిక సహకారంతో ఈ కార్యక్రమం ఘనంగా జరగనుందని పేర్కొన్నారు. సదస్సుకు సంబంధించిన వివరాలను వారు వెల్లడిస్తూ... ఈ సదస్సులో పునరుత్పాదక శక్తి, స్మార్ట్ మౌలిక వసతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై విస్తృతమైన చర్చలు జరుగుతాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, పారిశ్రామిక నిపుణులు ఈ వేదికపై తమ పరిశోధనా పత్రాలను పంచుకోనున్నారని తెలిపారు. దేశ విదేశాల నుంచి ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యే ఈ అంతర్జాతీయ సదస్సును దిగ్విజయం చేయడానికి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వైస్ ఛాన్సలర్ రమణ, రిజిస్ట్రార్ సారథి వివరించారు.హాపోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డీన్ ఎస్ఓఈ డాక్టర్ బాబు దేవసేనాపతి, జనరల్ ఛైర్ హెడ్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఈఈఈ డాక్టర్ ఎం. ఎస్. సుజాత, ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ డాక్టర్ బి. హేమంత్ కుమార్, టెక్నికల్ ప్రోగ్రామ్ కమిటీ ఛైర్, ఫ్యాకల్టీ అడ్వైజర్, ఐఈఈఈ పిఈఎస్ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ డాక్టర్ సురేష్ బాబు దారం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం బోనుపల్లి ఎంపీటీసీ సీ.చాముండేశ్వరి



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు
తొట్టంబేడు మండలం బోనుపల్లి ఎంపీటీ సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సీ. చాముండేశ్వరి ప్రజా సమ స్యల పరిష్కారానికి నిరంత రం కృషి చేస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడమే ఆమె ప్రధాన బాధ్యతగా పనిచేస్తారని పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం తరపున ఎంపీటీసీగా ఎన్నికైన చాముండేశ్వరి ప్రజలతో మమేకమై, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటారని నాగరాజు అన్నారు. ప్రజా సమస్యలపై జరిగే పోరాటాల్లో ముందుండి, గ్రామ అభివృద్ధితోపాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేయడం ద్వారా ఎంపీటీసీ పదవికి సార్థకత చేకూర్చాలని ఆకాంక్షించారు. చాముండేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్న బోనుపల్లి ప్రజలకు, ఆమె ఎన్నికకు సహకరించిన వారందరికీ సీపీఎం తరపున వందవాసి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, గురునాధం, రాజా, వెంకటేష్ పాల్గొన్నారు.

# ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ వినియోగ కేంద్రం ఏర్పాటు -కమిషనర్ ఎం.జయకృష్ణ



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తిరుపతి నగరపాలక సంస్థ సాదారణ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలో ఓటింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని కమిషనర్ ఎం.జయకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ రూమ్ నెంబర్ 102,103, తెలుగు విభాగం రూమ్ నెంబర్ 125,126, స్టాఫ్ రూమ్ వద్ద పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణ కొరకు ఇచ్చిన డ్యూటీ సర్టిఫికేట్, ఎపిక్ కార్డు, ఉద్యోగి గుర్తింపు కార్డు నకలు ను ఖచ్చితంగా తమ వెంట తీసుకురావాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు రెండు రోజులు పాటు ఉంటుందని తెలిపారు.. ఓటర్ల సందేహాలు నివృత్తి చేసేందుకు అక్కడే హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఉద్యోగులు అందరూ తమ ఓటు కోల్పోకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ జయకృష్ణ ఆ ప్రకటనలో తెలిపారు. తమ ఓటు వినియోగంపై ఎటువంటి సందేహాలు ఉన్న హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని తెలిపారు.

# తొట్టంబేడు మండలం జడ్పీటీసీ వైసిపి అభ్యర్థి ఉన్నం వాసుదేవ నాయుడుకు మద్దతుగా అంజూరు తారక శ్రీనివాసులు ప్రచారం

## గుర్రప్ప నాయుడు కండిగ ఇలగనూరు గ్రామంలో పర్యటన -- ఫ్యాను గుర్తుకు ఓటేయాలని పిలుపు

## కూటమి ప్రభుత్వ పాలనలో నిత్యావసర ధరల భారంతో సామాన్యుడిపై తీవ్ర ప్రభావం

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు
శ్రీకాళహస్తి నియోజకవర్గం, శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆశీస్సులతో తొట్టంబేడు మండలం జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉన్నం వాసుదేవ నాయుడుకి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇలగనూరు గ్రామంలో వాసుదేవ నాయుడు తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాల వల్ల పెట్రోల్, డీజిల్ ధరలు



ఆకాశాన్నంటాయని మండిపడ్డారు. నిత్యం ఉపయోగించే బియ్యం, ఉప్పు, పప్పు, వంటనూనె, గ్యాస్ సిలిండర్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, దీని కారణంగా సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉండే నాయకుడే మనకు కావలసిన ప్రజాప్రతినిధి అని పేర్కొంటూ, వాసుదేవ నాయుడు పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఏ కార్యకర్తకు లేదా ప్రజలకు ఆపద వచ్చినా వెంటనే స్పందిస్తూ ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. అటువంటి ప్రజా సేవకుడికి ప్రజలందరూ తోడుగా నిలవాలని, ఫ్యాను గుర్తుకు ఓటేసి అఖండ విజయంతో గెలిపించాలని ఇలగనూరు గ్రామ ప్రజలను అంజూరు తారక శ్రీనివాసులు అభ్యర్థించారు.

# అభివృద్ధిని చూసి టిడిపి అభ్యర్థులను గెలిపించండి-టిడిపికి ఓటు వేయండి



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం,
టిడిపి ప్రభుత్వ హయాంలో మండలంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు స్థానిక ఎన్నికలలో టిడిపి ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులను ఆదరించి సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ ఎన్ చిన్నబాబు కోరారు. బుధవారం మండలంలోని రావిళ్ళవారిపల్లి గ్రామంలో టిడిపి ప్రచార బేరి కార్యక్రమాని టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన అందరివాడు.... రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి జడ్పిటిసి అభ్యర్థి మేకల తిరుమలరెడ్డి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని నిరంతరం అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కార దిశగా కష్టపడి పని చేసి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. జడ్పిటిసి అభ్యర్థి మేకల తిరుమలరెడ్డి మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటా.... సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఆదరించాలాంటూ ఇంటింట ప్రచారం నిర్వహించారు. టిడిపి ప్రచార కార్యక్రమానికి ప్రజలు, ఓటర్ల నుండి విశేష స్పందన లభించింది. అవినీతి, అరాచక వైసిపిని ఓటర్లు ఓటుతో తరిమి కొట్టి... సైకిల్ గుర్తుకు ఓటేసి టిడిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవులనాయుడు, ఆర్ నీలకంట చౌదరి, పసుపులేటి విజయ్ కుమార్, చేకూరు వెంకటప్రసాద్, ఈ ఉమాపతి నాయుడు, కోరా హరిప్రసాద్, టి గిరిధర్ రెడ్డి, కల్లూరు రమేష్ నాయుడు, ఆర్ గిరి, కె. నరసింహారెడ్డి, సోమశేఖర్ నాయుడు, బండి విజయ్ కుమార్ రెడ్డి, రెడ్డప్ప నాయుడు, బాధూరు కోటేశ్వర్ రెడ్డి స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బి పి అగ్రహారం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ ఎఫ్ ఏ 2 ఎగ్జామినేషన్‌లో ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు టాపర్స్ కార్డ్



ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
పట్టణంలోని ఈ అగ్రహారం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నౌజియా మాట్లాడుతూ ఎఫ్ ఏ 2 ఎగ్జామినేషన్ మర్క్స్ రెండవ తరగతి క్లాస్ కండక్ట్ చేయడం జరిగింది ప్రతి ఒక్క స్టూడెంట్ 150మర్క్స్ గాను వంద మార్కులు దాటడం చాలా సంతోషంగా మా స్కూల్ యొక్క టీచర్స్ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను ప్రతి స్టూడెంట్ మంచి మార్కులు తెచ్చుకున్న తర్వాతే ఆ యొక్క టీచర్ కి ఆనందం మా స్కూల్ తరఫున స్టూడెంట్స్ కి టాపర్ కార్డ్స్ ఇవ్వడం జరిగింది ప్రతి ఒక్క తల్లి తండ్రి స్కూలుకి పంపించండి వాళ్లని విద్యావంతులు చేద్దాం పిల్లల తల్లిదండ్రుల ఆశీర్వాదం మా స్కూల్ కి శ్రీరామరక్ష ప్రధానోపాధ్యాయులు పాఠశాల చైర్మన్ పిల్లల తల్లిదండ్రులు విద్యార్థులను అభివృద్ధించారు

# అమర రాజా గ్రూప్‌లో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం-ఉచిత కళ్లద్దాల పంపిణీ




ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
అమర రాజా గ్రూప్ తమ ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతతో పాటు సంస్థకు రవాణా సేవలు అందించే లారీలు, కంటైనర్లు, ఇతర భారీ వాహనాల డ్రైవర్ల సంక్షేమానికి కూడా ప్రాధాన్య తనిస్తోంది. ఇందులో భాగంగా గ్రూప్ లాజిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో, తిరుపతిలోని ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో కరకంబాడి తయారీ ప్లాంట్‌లో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోగా, అవసరమైన వారికి కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్ ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సప్లై చైన్ హెడ్ భారత్ స్వామినాథన్ మాట్లాడుతూ, "రవాణా వ్యవస్థలో డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో అప్రమత్తతతో పాటు, మంచి ఆరోగ్యం, ముఖ్యంగా కంటి చూపు కలిగి ఉండటం ఎంతో ముఖ్యం. డ్రైవర్ల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడంతో పాటు, రహదారి భద్రతను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించాం. కంటి పరీక్షల ద్వారా అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. డ్రైవర్ల సంక్షేమానికి తోడ్పడే ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమర రాజా గ్రూప్ బిజినెస్ హెచ్ఎస్ఈ విభాగం అధిపతి డాక్టర్ సురేష్ కుమార్, హెచ్ఆర్ షేర్డ్ సర్వీసెస్ అధిపతి కె. నళినీ కుమార్, రాజన్న ఫౌండేషన్ అధిపతి రాళ్లపల్లి సతీష్, లాజిస్టిక్స్ విభాగం అధిపతి వి. సులోచన, సీనియర్ మేనేజర్ చక్రధర్ నలమ్, మేనేజర్ కె. చంద్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అమర రాజా గ్రూప్ సహకారంతో రాజన్న ఫౌండేషన్ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను . నిర్వహణలో భాగంగా డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇదే తరహాలో అక్టోబర్ 30న చిత్తూరులోని అమర రాజా గ్రోత్ కారిడార్ (ఏఆర్‌జీసీ)లో కూడా డ్రైవర్ల కోసం ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య బృందం కూడా సేవలందిస్తుందన్నారు.

# తొట్టంబేడు మండలంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గారి స్పృత ప్రచారం

## ప్రతి ఇంటా సైకిల్ గుర్తుకే ఓటేస్తామంటూ ప్రజల ఘన స్వాగతం

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు
శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలో జెడ్పిటి సి, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్ని కల ప్రచారం అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగిం ది. కూటమిలో భాగంగా తొట్టం బేడు మండలం జడ్పిటిసి అభ్య ర్థిగా పోటీ చేస్తున్న 'రావిళ్ళ మునిరాజా నాయుడు'కి మరియు ఎంపీటీసీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా సింగమాల గ్రామంలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి శుభసూచకంగా ఎన్నికల ప్రచారాన్ని వైభవంగా ప్రారంభించారు. ఆలయం వద్ద నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు మరియు బాణాసంచా పేలుళ్ల నడుమ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు మరియు స్థానిక గ్రామస్తులతో కలిసి ప్రతి వీధిలోనూ ఇంటింటా ప్రచారాన్ని ఘనంగా చేపట్టారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల క్షేమసమాచారాలను అడిగి తెలుసుకుంటూ, కూటమి పాలనలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి హారతులు పట్టి, పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఎటు చూసినా పసుపు జెండాల కోలాహలం, నాయకులు మరియు కార్యకర్తల నినాదాలతో పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, మండలంలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని బొజ్జల సుధీర్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, జెడ్పిటిసి-ఎంపీటీసీ అభ్యర్థులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని ప్రచారాన్ని జయప్రదం చేశారు.



# తొట్టంబేడు మండలంలో వైఎస్సార్‌సీపీ జోరుగా ఎన్నికల ప్రచారం

**జడ్పీటీసీ అభ్యర్థి ఉన్నం వాసుదేవ నాయుడు ని అఖండ మెజార్టీతో గెలిపించండి**

**ప్రజా సమస్యలను ఓటు రూపంలో చూపించేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారు**

**గుర్రప్పనాయుడు కండ్రిగ, ఇలగనూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించిన పవిత్ర రెడ్డి**





ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొట్టంబేడు మండలం,గుర్రప్పనాయుడు కండ్రిగ గ్రామంలో అలాగే ఇలగనూరు గ్రామంలో మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి ఉన్నం వాసుదేవ నాయుడు అలాగే మాజీ ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ గారితో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక మంచి మనసున్న నాయకుడు వాసుదేవ నాయుడుని జడ్పిటిసి అభ్యర్థిగా అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరుతున్నట్లు తెలిపారు. అలాగే జగనన్న ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అండగా ఉన్నారని కానీ నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని అన్నారు. గడపగ డపలో ప్రజలు ఎన్నో సమస్యలు తెలుపుతున్నారని వాళ్ళ బాధను అన్నింటిని ఓటు రూపంలో చూపించబోతున్నారు అన్నారు.జడ్పిటిసి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని మరోసారి కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు,వఞ సర్పంచ్ సుబ్రహ్మణ్యం నాయుడు, మనీ, ముకుంద, వెంకటసుబ్బయ్య, తిరుపాల్, సుబ్రహ్మణ్యం, చైతన్య, మనోజ్ కుమార్, ఏసు, ఆనంద్, సుమతి, భారతమ్మ, అమ్ములమ్మ, అంకమ్మ, వెంకటసుబ్బయ్య, వెంకటయ్య, సుబ్రమణ్యం, గంగయ్య, కళ్యాణ్, ఏడుకొండలు, అక్షయ్, రాఘవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తొండవాడలో హోరెత్తిన కూటమి ప్రచార హోరు..!

**శ్రీకృష్ణ మందిరం నుండి మొదలైన ఎన్నికల ప్రచారం..**

**జెడ్పీటీసీ అభ్యర్థి కొండేపాటి మధుమతి, ఎంపీటీసీ అభ్యర్థి భువనేశ్వరిలఇంటింటి ప్రచారం..**

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో భాగంగా చంద్రగిరి మండలం, తొండవాడ గ్రామంలో ఎన్డీయే కూటమి ప్రచారం హోరెత్తింది. తెలుగు దేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి శ్రేణులు ఒక్కటై కదంతొక్కడంతో గ్రామంలో పసుపు జెండాల రెపరెపలు, నినాదాలతో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కూటమి బలపరిచిన జెడ్పీటీసీ అభ్యర్థి కొండేపాటి మధుమతి, ఎంపీటీసీ అభ్యర్థి భువనేశ్వరిల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు గ్రామంలో విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారాన్నితొం డవాడ లోని శ్రీకృష్ణ మందిరం నుండి అభ్యర్థులు, నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రచార ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఆలయాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అక్కడి నుంచి నాయకులు, కార్యకర్తల భారీ ర్యాలీతో గ్రామంలోని ప్రతి వీధి, వాడవాడలా ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను నేరుగా కలుసుకున్నారు. స్థానికుల యోగక్షేమాలను, వీధుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు.ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులు కొండేపాటి మధుమతి, భువనేశ్వరి మాట్లాడుతూ.. తొండవాడ సమగ్ర ప్రగతికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గ్రామంలో ఏళ్ల తరబడి వేధిస్తున్న మురుగునీటి పారుదల (డ్రైనేజీ) సమస్య లకు శాశ్వత పరిష్కారం చూపడం, అంతర్గత వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ప్రతి ఇంటికీ పైపులైన్ ద్వారా స్వచ్ఛమైన సురక్షిత తాగునీరు అందించడమే తమ తొలి ప్రాధాన్యమని భరోసా ఇచ్చారు. అధికార కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటేనే మండల, జిల్లా పరిషత్ స్థాయిల నుంచి గ్రామానికి భారీగా అభివృద్ధి నిధులు తెచ్చుకునే వెసులుబాటు కలుగుతుందని వివరించారు. . గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా, సమస్యలు తీరాల న్నా 'సైకిల్' గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిఇంటికి సంక్షేమం వైకాపాతోనే సాధ్యం

**-నవంబర్ 5 స్థానిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి**

**ఆర్ సి పురం వైకాపా సమరశంఖారావంలో చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం :ప్రతిఇంటికి సంక్షేమ ఫలాలు అందాలంటే అది ఒక్క వైఎస్ఆర్‌సిపితోనే సాధ్యమవుతుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్న సంక్షేమ రాజ్యాన్ని మళ్లీ స్థాపించుకోవాలని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సిపి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు. రామచంద్రాపురం మండలంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సమరశంఖారావం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ... నవంబర్ 5న జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌లో వైఎస్ఆర్‌సిపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న జడ్పిటిసి ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, అనుపల్లి ఎంపీటీసీ ఆరేపల్లి నందిని, సికె పల్లి కె దొరస్వామి, నడవలూరు కే కర్ణ, దేసూరు కండ్రిగ మునెమ్మ, లను భారీ మెజారిటీతో గెలిపించి, ప్రతి ఇంటికీ సంక్షేమం అందించే దిశగా ప్రజలందరూ





భాగస్వాములు కావాలని కోరారు.

మోహిత్ రెడ్డి ప్రసంగంలోని ముఖ్య ముఖ్యాంశాలు: ఆలోచించి ఓటు వేయండి: ఓటర్లు కక్షపూరిత రాజకీయాన్ని, అభివృద్ధిని వేర్వేరుగా పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.మంచికి – – అరాచకానికి తేడా గమనించాలి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుభిక్ష పాలనలో ప్రతి ఇంటికీ చేరిన మంచిని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ అరాచక పాలనలో సాగుతున్న ఆగడాలను, వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలే పార్టీకి శ్రీరామరక్ష, పట్టు సడలకుండా ప్రతీ కార్యకర్తా క్షేత్రస్థాయిలో కష్టపడి పార్టీ అభ్యర్థుల విజయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ప్రజ సంక్షేమాన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ఆర్‌సిపి వైపే నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మాజీ మండల నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూములు, ఎన్నికల ఓట్ల లెక్కింపు వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలి

**-కమిషనర్ ఎం.జయకృష్ణ**



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

మునిసిపల్ ఎన్నికల్లో భాగంగా ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, ఎన్నికల ఓట్ల లెక్కింపు నకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పకడ్బం దీగా చేపట్టాలని కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులను ఆదేశించారు. ఎస్.వి ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాలను బుధవారం అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘా ఉండేలా చూడా లని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా



జరిగేలా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని, విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భద్రత, రిసెప్షన్ ఏర్పాట్లు, ఇతర సౌకర్యాల కల్పనలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లను పూర్తి చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రిటర్నింగ్ ఆఫీసర్ భరత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డి.ఎస్.పి భక్తవత్సల నాయుడు, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ. మహేష్, తదితరులు ఉన్నారు.

# కూటమి జెడ్పిటిసి అభ్యర్థి నంగా పద్మజా రెడ్డిని అఖండ మెజారిటీ తో గెలిపించుకుంటాం..!

ప్రజాభూమి ప్రతినిధి, పాకాల: (చంద్రగిరి)

చంద్రగిరినియోజకవర్గంపరిధి, పాకాల మండలంలోని గాదంకి,ఉప్పురపల్లి,పాకాల పంచాయతీలలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి జెడ్పిటిసి అభ్యర్థి నంగా పద్మజా రెడ్డి,ఏకగ్రీ వంగా ఎన్నికైన కూటమి ఎంపీపీ అభ్యర్థి ఆముద పాకల శ్రీహరి నాయుడు, టిడిపి మండలాధ్యక్షుడు బోయపాటి నాగరాజు నా యుడు,స్థానిక నాయకులు



టి.జె ప్రవీణ్,మాజీ జెడ్పిటిసి కనుమూరి సురేష్,బట్టు బాలశేఖర్ రెడ్డి,బట్టు తారాపతి రెడ్డిలు కార్యకర్తలతో కలిసి ప్రచారాన్ని ప్రారంభించారు. స్థానిక కూటమి నాయకులతో కలిసి సైకిల్ గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.ముందుగా పంచాయతీలకు విచ్చేసిన జడ్పీటీసీ,ఎంపీపీ,ఎంపీటీసీ అభ్యర్థులకు కు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా కూటమి పాకాల మండల జడ్పిటిసి అభ్యర్థి నంగా పద్మజా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పోటీ చేసే ప్రతిచోటా గెలుపు ఏకపక్షంగానే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు,అభివృద్దే తమకు విజయాన్ని అందిస్తాయని అన్నారు.ప్రచారానికి వెళ్లిన ప్రతి గ్రామంలోనూ ప్రజలు తమ ఆశీర్వాదాలు అందిస్తున్నారని, ఈ ఎన్నికల్లో కూడా కూటమి ప్రభుత్వం విజయకేతనం ఎగురవేయడం ఖాయమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లిపూడిలో జనార్ధన్‌రెడ్డికి మహిళలు హారతులు.. సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన



ప్రజా భూమి ప్రతినిధి, వాకాడు:

నెల్లిపూడి గ్రామ ఎంపీటీసీ అభ్యర్థి దువ్వూరు జనార్దన్‌రెడ్డి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో రెండు ఓట్లు వినియోగించుకోవాలని మహిళలు, స్థానిక ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.గ్రామంలోని అరుంధతివాడలో హరీష్ నాయుడు ఆధ్వర్యంలో జనార్దన్‌రెడ్డికి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఆయన గెలుపును ఆకాంక్షిస్తూ మహిళలు హారతులు పట్టి, కొబ్బరికాయలు కొట్టారు.ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మధు, హరీష్ నాయుడు, మాజీ ఎంపీపీ పల్లాపల్లి వెంకటేశ్వర్లు, ఎంబేటీ పోలయ్య, షేక్ మస్తాన్, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, కుంభాల రమణయ్య, సింహాచలం, వెంకటేశ్వర్లు తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

సూళ్లూరుపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి వేలూరు మునెమ్మ గెలుపు కొరకు డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట పట్టణం నందు ఎన్నికల ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ని ప్రజలు ఆశీర్వదించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు హరికృష్ణ, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వినోద్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు నవీన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కొణతనేరి ఎంపీటీసీగా గాలి మురళి నాయుడు ఏకగ్రీవం



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

తొట్టంబేడు మండలం కొణతనేరి ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి గాలి మురళి నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (ఎన్నికల నిర్వహణ) నియమాలు 2006, నియమం 16 ప్రకారం ఫారం-10 ద్వారా రిటర్నింగ్ అధికారి, ఎంపీటీసీ, జడ్పిటిసి-2026, తొట్టంబేడు మండలం ఈ ఫలితాన్ని అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన గాలి మురళి నాయుడు మాట్లాడుతూ – శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు,రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు,రావెళ్ల మునిరాజు నాయుడు ల ఆధ్వర్యంలో తనకు అందించిన ఈ పదవిని ప్రజా శ్రేయస్సు కొరకు ఉపయోగిస్తానని తెలిపారు.తొట్టంబేడు మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ, తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# కుంగిన మనసుకు ఆత్మీయతే మందు

**మానసిక ఆరోగ్యం మహాభాగ్యం**



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం:

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యమని జిల్లా కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్ అనురాధ, ఎంఈఓ మార్కండేయ నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని సొరకాల పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మానసిక ఆరోగ్య మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిలకు లోనైనప్పుడు ఒంటరిగా ఉండకుండా తమ మనసులోని భావాలను కుటుంబ సభ్యులతో పంచుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఆన్లైన్ వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఒత్తిడి, ఆందోళన వల్ల గుండె జబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం, నిద్రలేమి వంటి సమస్యలు వస్తాయని వివరించారు మానసిక ప్రశాంతత ఉన్నప్పుడు కుటుంబంలో, సమాజంలో వ్యక్తుల మధ్య అనుబంధాలు బలంగా ఉంటాయని తెలిపారు. మానసిక ఆరోగ్యాన్ని రోజువారి అలవాట్లు, జీవన శైలి ద్వారా ఇంట్లోనే మెరుగుపరుచుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరి శంకర్, మాజీ ప్రధానోపాధ్యాయులు దొరస్వామి నాయుడు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వాకాడు చెరువు కట్టపై ఘోర ప్రమాదం.. ఆటో బోల్తా పడి యువకుడు మృతి

**టమాటాల విక్రయానికి వెళ్తుండగా ఘటన.. మరో ఇద్దరికి గాయాలు**



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని బీసీ కాలనీ వద్దగల వాకాడు చెరువు కట్టపై ఆటో బోల్తా పడిన ప్రమాదంలో కోట మండలం శ్యామసుం దరపురానికి చెందిన బింది శ్రీనివాసులు కుమారుడు బింది హనోక్ అనే యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనలో మరో ఇద్దరు గాయపడ్డారు. సమాచారం అందుకున్న వాకాడు ఎస్ఐ ఆర్. నిఖిల్ బాబు పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను. 108 అంబులెన్స్ ద్వారా వాకాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించేలా చర్యలు చేపట్టారు.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ హనోక్ మృతితో అతని కుటుంబంలో విషాదం నెలకొంది.

ప్రజాభూమి
జనరల్ 10
గురువారం 29 అక్టోబరు 2026

# సంక్షేమ పథకాలు అందడం గగనం

## -కూటమి పాలనపై దీపికా వేణురెడ్డి విమర్శలు-షాజియాతో కలిసి వైసీపీ అభ్యర్థుల తరపున విస్తృత ప్రచారం



ప్రజాభూమి, హిందూపురం టౌన్
పురపాలక సంఘ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డి, చైర్మన్ అభ్యర్థి షాజియాతో కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా రోడ్‌షో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ చైర్మన్ అభ్యర్థితో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో మహిళలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి దీపికా వేణురెడ్డి, షాజియా, ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులకు పూలమొక్కలు అందించి, సన్మానాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా దీపికా వేణురెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులకు సంక్షేమ పథకాలు అందకుండా చేస్తోందని ఆరోపించారు. కనీసం ఇళ్లకు ఉన్న మంచినీటి కొళాయిలను సైతం తొలగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రాజ్యాంగబద్ధమైన పాలన సాగడం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగంతో పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. హిందూపురం నియోజకవర్గ ప్రజలు గత 40 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి అవకాశం కల్పిస్తున్నప్పటికీ, ఈ ప్రాంత అభివృద్ధిని ఆ పార్టీ విస్మరించిందని విమర్శించారు. దశాబ్దాల టీడీపీ పాలనలో కనీసం ఒక్క ప్రధాన రహదారిని కూడా విస్తరించలేదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రైల్వే రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. 2029 ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని దీపికా వేణు రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హిందూపురం పురపాలక సంఘానికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి, పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ పార్టీకి సహకరించి చైర్మన్ అభ్యర్థి షాజియాతో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైసీపీ నాయకులు అన్సార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జబీవుల్లా, షబ్బీర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రీ సర్వే సమస్యలపై సమీక్ష నిర్వహించిన జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్..



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం
జిల్లాలో రీ సర్వేకు సంబంధించి కొనసాగుతున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారంపై బుధవారం అనంతపురం నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏడీ సర్వే, ఎస్‌డీసీ, కేఆర్ఆర్‌సీ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులతో రీ సర్వే పురోగతి, భూ రికార్డుల్లో ఉన్న లోపాలు, పరిష్కరించాల్సిన పెండింగ్ సమస్యలపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా రీ సర్వేకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తూ, రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## పళ్ళ తోటల్లో పి ఎం డి ఎస్ వల్ల ఉపయోగాలు ... డి పిఎం లక్ష్మనా నాయక్



ప్రజా భూమి యల్లనూరు
యల్లనూరు గ్రామంలో రైతు రాజేశ్వరి పొలంలో జామ నిమ్మ అంజూర, తోటలలో 10 ఎకరాల విస్తీర్ణంలో పీ ఎం డి ఎస్ విధానం ఐదు ప్రధాన పంటలు 25 బయో డైవర్సిటీ పంటలు పెట్టడం జరిగింది విత్తనాలు పప్పు దినుసులు నూనె గింజలు చిరుధాన్యాలు సుగంధ ద్రవ్యాలు,కూరగాయ ఆకుకూరలు విత్తనాలు గుళికలు చేసిన విత్తనం బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసి ఘన జీవామృతం లతో కలిపి విత్తనం వేయడం జరిగింది. దీనివల్ల భూమి సారవంతం అవుతుంది భూమి బెట్టను తట్టుకొని నేలలో తేమ శాతాన్ని పెంచడానికి భూమి 365 రోజులు పంటలతో కప్పి ఉంచడం దీనివల్ల రైతుకు అదనపు ఆదాయం వస్తుంది మరియు పంట దిగుబడులు పెరుగుతాయి నాణ్యత కలిగిన ఉత్పత్తులు తప్పక వస్తాయని లక్ష్మనా నాయక్ తెలిపారు ఈ కార్యక్రమంలో కే .నరసయ్య ఎం. టీబీ రవీంద్ర ఎం.ఎఫ్.టి తిరుపాలు దేవేంద్ర మెంటల్, వెంకటేశ్వర్ రెడ్డి క్యాడర్స్ ఐ సి ఆర్ పి లు, వెంకటేశ్వర రెడ్డి క్యాడర్స్ ఐ సి ఆర్ పి లు క్రీడా ఫార్మర్లు, రైతులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం

## వివేకానంద రెడ్డిని నరికి చంపింది మీరు కాదా? - 40 ఏళ్ల చరిత్రను తిరగరాద్దాం

## -బీటెక్ రవి, ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు




ప్రజాభూమి, పులివెందుల:
జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థి తూట్ల గీతా కుమారి, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పులివెందుల టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పూలంగల్ల సర్కిల్ వద్ద వారు ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. 40 సంవత్సరాలుగా ఒకటే కుటుంబాన్ని గెలిపిస్తున్నారని, ఇప్పుడు కూటమి చైర్మన్ అభ్యర్థికి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. డబుల్ ఇంజిన్ సర్కారుకు అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని, కూటమి అభ్యర్థి అధికారంలోకి వస్తే పులివెందుల రూపురేఖలు మారుస్తామని స్పష్టం చేశారు.పులివెందులలో వైఎస్ వివేకానంద రెడ్డిని నరికి నరికి చంపి తుడిచిపెట్టింది వీళ్లే కదా అని ప్రశ్నించారు. రాచమల్లు చేసే వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. 2029 లో అధికారంలోకి వస్తే చనిపోయిన వారిని లేపి మరీ కొడతామనడం ఏమిటని మండిపడ్డారు.పులివెందుల ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో కొట్టబోయే దెబ్బకు రాష్ట్రంలో వైకాపా నాయకులకు గుండెలు గుభేల్ మంటాయని హెచ్చరించారు.పులివెందులలో 20 వార్డుల్లో గీతా కుమారి గెలుపు కోసం ప్రచారం చేస్తున్నామని, మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు చేసుకునే వాళ్లమని, అయితే తాము మీతో నామినేషన్లు వేయించకుండా అడ్డుకోలేదన్నారు. వైకాపా పార్టీకి అభ్యర్థులు కరువై నామినేషన్లు వేయలేకపోయారని, దానికి తమకు ఏమి సంబంధమని ప్రశ్నించారు.జగన్ మోహన్ రెడ్డి హయాంలో తమపై జరిగిన అరెస్టులు, వేధింపులు, దాడుల ప్రయత్నాలను ప్రజలు మర్చిపోలేదని, ఐదేళ్ల ప్రశాంత జీవితాన్ని నాశనం చేసి ఇప్పుడు తమపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన దౌర్జన్యాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. జగన్ మాటలకు మాటలతో సమాధానం చెప్పమని, సమయం వచ్చినప్పుడు చేతలతోనే సమాధానం చెబుతామన్నారు. పేదలకు భరోసా – డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పేరుతో జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, వారి డబ్బులు తిరిగి ఇప్పించే బాధ్యత తీసుకుంటామని, పులివెందులలో ఇళ్ల స్థలాల కోసం వచ్చిన సుమారు 3,500 దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కల్పిస్తామన్నారు. నగరిగుట్ట, జయమ్మ కాలనీ, రాజారెడ్డి కాలనీ, రాజీవ్ నగర్ కాలనీల ప్రజల ఇళ్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, కొత్తపల్లె ఎంపీపీ పుష్పనాథ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి, చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతా కుమారి, టీడీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, నల్లగారి భాస్కర్ రెడ్డి, మునివర్ధన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య విద్యార్థులకు శ్రీరామ్ ఫైనాన్స్ స్కాలర్‌షిప్‌లు

## - ఐదుగురు విద్యార్థుల ఎంపిక.. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.4 వేల ఆర్థిక సాయం



ప్రజాభూమి, వేంపల్లె
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ 2026--27 విద్యా సంవత్సరానికి అందిస్తున్న స్కాలర్‌షిప్ పథకానికి స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పథకం ద్వారా 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న అర్హులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.4,000 చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు. రవాణా రంగంలో పనిచేస్తూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారి పిల్లల చదువుకు ఆర్థిక ప్రోత్సాహం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా శ్రీరామ్ ఫైనాన్స్ సీనియర్ బిజినెస్ మేనేజర్ హుస్సేన్ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఇలాంటి స్కాలర్‌షిప్ పథకాలు దోహదపడతాయని తెలిపారు. అనంతరం పాఠశాల చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారి చదువుకు ఆర్థికంగా తోడ్పడే కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన ఐదుగురు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై బాలయ్య గురి..! -గెలుపే లక్ష్యంగా కార్యాచరణ

## -అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

## -మున్సిపల్, ఎంపీటీసీ ఎన్నికలపై సమీక్షలో నాయకులకు ఎమ్మెల్యే బాలకృష్ణ దిశానిర్దేశం



ప్రజాభూమి, హిందూపురం టౌన్
గత రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నాయకులకు సూచించారు. పట్టణంలోని 52 వార్డులపై ప్రత్యేక దృష్టి సారించి, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని సామాజిక వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తూ సామాజిక న్యాయాన్ని సాధించేది తెలుగు దేశం పార్టీ నేతృత్వంలోని ఉమ్మడి కూటమి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కొత్త మున్సిపల్ కౌన్సిల్ కొలువుదీరగానే పట్టణంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మరింత ఊపునిస్తామని తెలిపారు. బుధవారం సాయంత్రం హిందూపురం చేరుకున్న బాలకృష్ణ తన నివాసంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు అనిల్‌కుమార్, రమేష్‌కుమార్, నాయకులు అమర్నాథ్, పరిమళతోపాటు రూరల్ మండల నాయకుడు రాముతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఎంపీటీసీ ఎన్నికలపై సమీక్షించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో హిందూపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో దౌర్జన్యాలు, అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలుగుదేశం పార్టీ చేస్తున్న ఆరోపణలను బాలకృష్ణ ప్రస్తావించినట్లు నాయకులు తెలిపారు. ప్రస్తుత ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగడం కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనమని ఆయన పేర్కొన్నట్లు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలని అభిప్రాయపడినట్లు తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతోపాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు బాలకృష్ణ పేర్కొన్నారని నాయకులు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించడంతోపాటు, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించినట్లు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికలతోపాటు హిందూపురం రూరల్ మండలంలో జరుగుతున్న ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని బాలకృష్ణ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితి, అభ్యర్థుల ప్రచారం, నాయకుల సమన్వయంపై సమీక్షించి, ఎన్నికల ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని దిశానిర్దేశం చేసినట్లు నాయకులు తెలిపారు.

# స్థానిక ఎన్నికల దృష్ట్యా.. కల్లూరులో పోలీసుల కవాతు...

ప్రజా భూమి యల్లనూరు
మండల పరిధిలోని సమస్యాత్మక మైన కల్లూరు గ్రామంలో స్థానిక ఎన్నికలు జరగనున్న క్రమంలో ఎస్ఐ రామాంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కావాతు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సజావుగా సాగాలన్నారు ఉన్నతాధికారుల ఆదేశాలతో కవాతు చేపట్టామని గ్రామంలో ఎలాంటి గొడవలకు ఘర్షణలకు పాల్పడకుండా ఓర్పుతో ప్రతి ఒక్కరూ సజావుగా ఎన్నికలు జరుపుకోవాలని ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన శాంతి భద్రతలకు భంగం కలిగించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని గ్రామంలో ఏ ఒక్కరైనా ఘర్షణలకు పాల్పడినట్లు తెలిసి నట్లయితే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు పోలీసుల నిఘా ప్రతి ఒక్కరి పైన ఉంటుందని ఎస్ఐ రామాంజనేయ రెడ్డి గ్రామ ప్రజలకు తెలిపారు.



# ప్రజలు సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## -: డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

ప్రజా భూమి పోరుమామిళ్ల :
ప్రజలందరూ సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోరుమామిళ్ల డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన ప్రైవేట్ డాక్టర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే అన్ని ఆసుపత్రుల్లో నెలకొన్న వివిధ సమస్యలపై సమావేశంలో చర్చించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్యులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షెనాయ్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ బాలకృష్ణారెడ్డి, డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ జనార్దన్, డాక్టర్ మృదుల, డాక్టర్ సృజన, డాక్టర్ శశి వర్ధన్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ జనార్ధన్, డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.



# పులివెందుల మున్సిపల్ ఎన్నికల సిబ్బందికి ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు - కమిషనర్ తనూజ

## నేటి ఉదయం 8 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేసే అవకాశం

ప్రజాభూమి, పులివెందుల:
పులివెందుల పురపాలక సంఘం పరిధిలో నిర్వహించనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు, 2026లో భాగంగా చైర్మన్ మరియు వార్డు సభ్యుల ఎన్నికల విధులకు నియమించబడిన సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నేటి ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు పులివెందుల పట్టణము నందు 2 ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అహోబిలపురం, పులివెందుల పట్టణము నందు ఈ సెంటర్లు ఏర్పాటు చేశారు.కావున ఎన్నికల విధులకు నియమించబడిన సిబ్బంది అందరూ తమకు కేటాయించిన ఎన్నికల విధులకు సంబంధించిన ఉత్తర్వులతో పాటు ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ ) మరియు ఆధార్ కార్డును తీసుకొని, పై తేదీ మరియు సమయాల్లో ఏర్పాటు చేసిన 2 ఫెసిలిటేషన్ సెంటర్స్ నందు ఓటు హక్కును వినియోగించుకోగలరని కోరారు.

# పుట్లూరు మండలంలో 85 మందిపై బైండోవర్

ప్రజాభూమి పుట్లూరు. రానున్న ఎంపీటీసీ/ జడ్పిటిసి మరియు గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా పుట్లూరు మండలం శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు ముందు చర్యలో భాగంగా పుట్లూరు మండలంలో వున్న పుట్లూరు, పి. చింతలపల్లి, కోమటికుంట్ల, మడుగుపల్లి, సురేపల్లి, అరకటి వేముల, కడవకల్లు, జి సి పల్లి గ్రామలకు చెందిన 85 మందివ్యక్తులను బైండ్ ఓవర్ చేయడం జరిగిందని ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు.పుట్లూరు మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విగాథం కలిగించిన ఎడల వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, నాన్ బేలబుల్ సెక్షన్లు విధించి, చట్టరీత్యాకఠినమైన చర్యలు తీసుకోబడుననీ, ఎలక్షన్లు పూర్తి అయ్యేంతవరకు గ్రామాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా, గొడవలు పడకుండా ఉండాలని ఎస్సై సురేంద్రబాబు తెలిపారు.



# గుల్లెటివాడ అడవుల్లో పెద్దపులి కలకలం

- రెండు పశువులపై దాడి.. ఒకటి మృతి, మరొక పశువుకు తీవ్రంగా గాయాలు.
- చింతూరు ఏజెన్సీలో కొనసాగుతున్న పులి సంచారం.. భయాందోళనలో గ్రామస్థులు.
- అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారుల సూచన





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలం గుల్లెటివాడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రైతు వంజం దూలయ్యకు చెందిన రెండు పశువులపై పెద్దపులి దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ దాడిలో ఒక పశువు మృతి చెందగా, మరో పశువు తీవ్రంగా గాయపడింది. దీంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా పెద్దపులి ఏజెన్సీ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం. గోదావరి నది దాటి పాపికొండల అటవీ ప్రాంతంలోకి ప్రవేశించిన పులి తొలుత తుమ్మిలేరు పంచాయతీ పరిధిలోని కొండేపూడి ప్రాంతంలో సంచరించినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం వి.ఆర్.పురం అటవీ రేంజ్ పరిధిలో సంచరిస్తూ మంగళవారం చింతూరు అటవీ రేంజ్ పరిధిలోకి ప్రవేశించినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించినట్లు సమాచారం. మంగళవారం రాత్రి సుమారు రెండు గంటల సమయంలో టేకులూరు అటవీ ప్రాంతంలో పెద్దపులి ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించగా, బుధవారం ఉదయం అది చదలవాడ అటవీ ప్రాంతం వైపు వెళ్లినట్లు సమాచారం.

**అడవుల్లోకి ఒంటరిగా వెళ్లొద్దు**

పెద్దపులి సంచారం నేపథ్యంలో పశువులను మేపేందుకు, కట్టెలు, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం అడవుల్లోకి వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎవరూ ఒంటరిగా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకూడదని, చిన్నారులను అడవుల వైపు పంపించవద్దని హెచ్చరిస్తున్నారు. పులి సంచారం వల్ల ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, పశువులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అటవీ శాఖ అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

## అర్నబ్ తుఫాను ప్రభావం.. మొల్లేరులో రోడ్డుపై పడిన తాడి చెట్టు తొలగింపు



ప్రజాభూమి ప్రతినిధి-గంగవరం

అర్నబ్ తుఫాను ప్రభావంతో గంగవరం మండలం మొల్లేరు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా పడిన తాడి చెట్టును డిప్యూటీ ఎంపీడీవో కే గోపన్న దొర పంచాయతీ సిబ్బంది కలిసి తొలగించారు చెట్టు రోడ్డుపై పడటంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా అధికారులు సిబ్బంది సమన్వయంతో చర్యలు చేపట్టారు పంచాయతీ సిబ్బంది సహకారంతో చెట్టును తొలగించి రహదారిని రాకపోకలకు అనువుగా చేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె గోపన్న దొర గంగవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది మొల్లేరు జేపీబీసీ ప్రతినిధులు పాల్గొన్నారు తుఫాను ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారిపై అడ్డంకులను తొలగించడంలో సిబ్బంది చర్యలు చేపట్టారు.

## తుఫాను వర్షంలో కారు బోల్తా..

### స్వల్ప గాయాలతో బయటపడ్డ మహిళ



ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

అడ్డతీగల మండలం పాపంపేట సమీపంలో ఎన్‌హెచ్-516ఈ జాతీయ రహదారిపై బుధవారం సుమారుగా 3 గంటల సమయం లో కారు బోల్తా పడింది. జడ్డంగి నుంచి అడ్డతీగల వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం, అతి వేగం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న మహిళ స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం. ప్రమాదంలో ఆమెకు ప్రాణాపాయం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.తుఫాను నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వర్షం కురుస్తున్న సమయంలో వేగాన్ని నియంత్రించి ప్రయాణించాలని సూచిస్తున్నారు.

## అర్నబ్ తుఫానునూ లెక్కచేయకుండా వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం

### మరిపాలెం పంచాయతీ పరిధిలో విస్తృతంగా ప్రచారం



ప్రజా భూమి ప్రతినిధి-గంగవరం

గంగవరం మండలం మరిపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో అర్నబ్ తుఫాను ప్రభావాన్ని సైతం లెక్కచేయకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు మాజీ ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ అభ్యర్థి పీరు బాలురెడ్డితో కలిసి పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇంటింటి ప్రచారం చేపట్టారు ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి గ్రామాల్లోని ఓటర్లను కలుసుకుంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి పీరు బాలురెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు ఎన్నికల్లో ఆయనకు అండగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా ప్రచార కార్యక్రమాన్ని కొనసాగిస్తూ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తమ అభ్యర్థి తరఫున ఓటర్లను కలిసి మద్దతు కోరారు.

# యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

- ఈదురు గాలులు, వర్షాలతో ఆటంకం.. సాయంత్రానికి సరఫరా లభ్యం:
- పోలవరం కలెక్టర్ కె.దినేష్ కుమార్




ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

భారీ వర్షాలు, ఈదురుగాలులు కారణంగా జిల్లాలో స్తంభించిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖ చర్యలను వేగవంతం చేసిందని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

**350 మందితో ప్రత్యేక బృందాలు**

జిల్లా వ్యాప్తంగా సుమారు 350 మంది విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలానికి ఒక అసిస్టెంట్ ఇంజినీర్ (ఆజు)ను నియమించడంతో పాటు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామన్నారు. ముందస్తుగా విద్యుత్ స్తంభాలు, జేసీబీ యంత్రాలను సిద్ధం చేసుకోవడంతో పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం 12 సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాను ఇప్పటికే పునరుద్ధరించినట్లు వెల్లడించారు.సాయంత్రం నాటికి మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు.ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి గ్రామాలకు వెళ్లే ఎల్‌టీ లైన్ల మరమ్మతులు ముమ్మరంగా జరుగుతున్నాయని, రాత్రి వేళల్లోనూ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు.వై.రామవరం, అడ్డతీగల మండలాల్లో పనులు పురోగతిలో..మిగిలిన మండలాల్లో విద్యుత్ పునరుద్ధరణ పూర్తయినప్పటికీ.. వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో పనులు ఇంకా జరుగు తున్నాయని, అక్కడ కూడా త్వరలోనే పూర్తి చేస్తామని కలెక్టర్ చెప్పారు.

### కూలిన చెట్ల తొలగింపు, రహదారుల

# పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశం

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్ రంపచోడవరం సబ్ కలెక్టర్ డీ పృథ్వి రాజ్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి మండలంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్,రంపచోడవరం సబ్ కలెక్టర్ డి.పృథ్వీ రాజ్ కుమార్ విస్తృతంగా పర్యటించి,అర్నబ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులు, కూలిన చెట్ల తొలగింపు పనులు, సహాయక చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.బుధవారం రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు, నెలిమెట్ల కాలువను పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ ,రంపచోడవరం సబ్ కలెక్టర్ డి.పృధ్వి రాజ్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లా కలెక్టర్ కే దినేష్ కుమార్ వారి ఆధ్వర్యంలో విపత్తులు ఎదుర్కొనే విధంగా జిల్లా యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిదంగా రహదారులపై కూలిన చెట్లను తొలగించే పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. జేసీబీల సహాయంతో రహదారులపై ఉన్న అడ్డంకులను తక్షణమే తొలగించి, ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని ఆయన సూచించారు.ఆదేవిదంగా ఇంటిపై కూలిన చెట్టును జాయింట్ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బాధితులకు తక్షణ సహాయం అందించాలని, జరిగిన నష్టాన్ని అంచనా వేసి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అర్నబ్ తుఫాన్ కారణంగా ఈదురు గాలులతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందువలన వాగులు వంకలు పొంగుతాయని ఎట్టి పరిస్థితుల్లోనూ కాలువలు దాటే ప్రజలు కాలువలు దాట వద్దని ఆయన తెలిపారు. పెద్ద పెద్ద గాలులు వీచినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కింద ఉండవద్దని అదేవిధంగా అవసరాన్ని బట్టి ఇంట్లో నుండి బయటకు రావాలని ప్రజలను ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో పోలవరం జిల్లాలో కరెంటుకు ఎటువంటి అంతరాయం కలగకుండా ఎక్కడైనా కరెంట్ స్తంభాల మీద చెట్లు పడిన యెడల వెంటనే స్పందించి తొలగించేందుకు ఎక్కడికి అక్కడ ప్రత్యేక టీములను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. జేసీ, సబ్ కలెక్టర్ వారి వెంటా తహసీల్దార్ స్వామీ ,సీ ఐ సన్యాసి నాయుడు,ఎస్ ఐ షరీఫ్,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### కూటమి అభ్యర్థులకు

# అఖండ మెజారిటీ అందించండి

### పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసింది కూటమి ప్రభుత్వమే

### వడ్డీగూడెంలో ఇంటింటి ప్రచారం

### సూపర్ సిక్స్ సూపర్ హిట్.. అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలంలోని వడ్డీగూడెం గ్రామంలో కూటమి అభ్యర్థులు బుధవారం విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి జడ్పీటీసీ అభ్యర్థి వాళ్ల విష్ణుప్రియ, ఎంపీటీసీ అభ్యర్థి గొంది చంద్రయ్యలకు అఖండ మెజారిటీతో విజయం అందించాలని కోరుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇది ప్రజల ప్రభుత్వం, మంచి ప్రభుత్వం అని ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములయ్యే కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని నాయకులు వివరించారు. వడ్డీగూడెం గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. జడ్పీటీసీ అభ్యర్థి వాళ్ల విష్ణుప్రియ, ఎంపీటీసీ అభ్యర్థి గొంది చంద్రయ్యలను అత్యధిక మెజారిటీతో గెలిపించి కూటమికి బలమైన ప్రజా మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఇంటింటి ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతు కూడగట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముత్యాల రామారావు, వాళ్ల రంగారెడ్డి, బొర్రా నరసింహారావు, ఆచంట శ్రీను, ముత్యాల చంద్రశేఖర్, జనసేన వీర మహిళ బాగుల ప్రమీల, అంజన్‌రావు, బీజేపీ జిల్లా కార్యదర్శి బొర్రా కామేశ్వరి, కడుపు రాజు, అచ్చిరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను వేళ అప్రమత్తంగా ఉండాలి

### ఓవర్‌ఫ్లో కాలువలను పరిశీలించిన ఎస్పీ

### ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పోలీసులకు ఆదేశాలు



ప్రజాభూమి ప్రతినిధి-రాజవొమ్మంగి

తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓవర్ ఫ్లో కాలువలను పరిశీలించారు. కాలువల వద్ద పరిస్థితులను గమనించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## సున్నిత ప్రాంతాల గుర్తింపు.. కీలక పాయింట్ల వద్ద పోలీసు పికెట్లు



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

మండల పరిధిలోని కీలక ప్రాంతాల్లో పోలీసు భద్రతను కట్టుదిట్టం చేశారు. గ్రామాలను అనుసంధానించే ప్రధాన రహదారుల్లో కట్‌ఆఫ్ పాయింట్లను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు అడ్డతీగల సీఐ ఎం. గజేంద్రకుమార్ తెలిపారు.రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా మంగళవారం తహసీల్దార్ ఎం. తేజస్విని, ఎస్ఐ బి. వినోద్‌తో కలిసి సీఐ మండల పరిధిలోని కీలక రహదారులను పరిశీలించారు. గ్రామాల మధ్య రాకపోకలు జరిగే మార్గాల్లో పరిస్థితులను సమీక్షించి, సున్నిత ప్రాంతాలను గుర్తించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసి సిబ్బందిని అప్రమత్తం చేశారు.పికెట్లను స్వయంగా సందర్శించిన సీఐ విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని, విధి నిర్వహణలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

## తుఫాను ప్రభావం.. ప్రయాణికులు లేక వెలవెలబోయిన బస్టాండ్




ప్రజాభూమి ప్రతినిధి-అడ్డతీగల

తుఫాను ప్రభావంతో ఏజెన్సీలో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తుండటంతో అడ్డతీగల బస్టాండ్ ప్రయాణికులు లేక వెలవెలబోయింది. ప్రతిరోజూ ప్రయాణికులతో రద్దీగా కనిపించే బస్టాండ్ బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో బోసిపోయింది. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనులపై ప్రయాణించాల్సిన వారు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. తుఫాను ప్రభావంతో సాధారణ జనజీవనం స్తంభించగా, వర్షాలు తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి రావాలని స్థానికులు ఆశిస్తున్నారు.

## మద్ది గడ్డ రిజర్వాయర్‌కు భారీ వరద.. రెండు గేట్లు ఎత్తివేత




ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు అడ్డతీగల మండలంలోని మద్ది గడ్డ రిజర్వాయర్‌కు వరద నీరు భారీగా చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో రిజర్వాయర్ నీటిమట్టం పెరుగుతోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు రిజర్వాయర్‌కు చెందిన రెండు గేట్లను తెరిచి దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు.
రిజర్వాయర్‌లోకి చేరుతున్న వరద నీటి ప్రవాహాన్ని అధికారులు షిఫ్టుల వారీగా పర్యవేక్షిస్తున్నారు. నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, నీటి ప్రవాహాలు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

## ఏ విధమైన ప్రాణ నష్టం లేదు

## ఆర్నబ్ తుఫాన్ నివేదికలో పోలవరం జిల్లా కలెక్టర్

ప్రజా భూమి ప్రతినిధి-రంపచోడవరం

ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో పోలవరం జిల్లాలో ఏర్పడిన పరిస్థితులు ముందు జాగ్రత్త చర్యలు లకు సంబంధించి పోలవరం జిల్లా కలెక్టరేట్ నివేదికను విడుదల చేసింది తుఫాన్ ఎదుర్కొనేందుకు సన్నాహక కార్యక్రమాలు ఏ విధంగా ఏర్పాటు చేశారు సహాయక శిబిరాలకు ఎంత మందిని తరలించినది వైద్య సదుపాయాలపై గుర్తించిన ప్రెగ్నెన్సీ మహిళలు పలు వివరాలను వెల్లడించారు మరోవైపు ఎన్ని సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారు అత్యవసర పరిస్థితులకు ఎదుర్కొనేందుకు ట్రాఫిక్ క్లియరెన్స్, ప్రజలను తరలించేందుకు ఏర్పాటుచేసిన వెహికల్స్ మరియు విద్యుత్ వ్యవస్థలను తిరిగి పునరుద్ధరించేందుకు ఏర్పాటుచేసిన టీమ్స్ ని పూర్తిస్థాయి వివరాలతో నివేదిక ఉంది అయితే తుఫాను ప్రభావంతో ఏ విధమైన మరణాలు సంభవించలేదని ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోలేదని తెలిపారు కంట్రోల్ రూమ్ కి వచ్చిన ఫిర్యాదులను ఎన్ని పరిష్కరించారు ఎంత వేగంగా స్పందించారు నివేదికలో పేర్కొన్నారు ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ అర్ధరాత్రి 12 గంటలకు బుధవారం ఉదయం ఐదు గంటలకు రివ్యూ మీటింగ్ నిర్వహించారు అనంతరం ఉదయం 6 గంటల నుంచి ప్రభావిత ప్రాంతాలలో స్వయంగా పర్యటించారు.

## తుఫానును లెక్కచేయని కూటమి నేతలు.. జోరుగా ఎన్నికల ప్రచారం

### ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, పరిశీలకుడు కుడిపూడి సత్తిబాబు



ప్రజా భూమి ప్రతినిధి-అడ్డతీగల

తుఫాను ప్రభావాన్ని సైతం లెక్కచేయకుండా పోలవరం జిల్లా అడ్డతీగల మండలంలో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. జెడ్పీటీసీ అభ్యర్థి వంతల రాజేశ్వరికి మద్దతుగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఎన్నికల పరిశీలకుడు కుడిపూడి సత్తిబాబు కలిసి బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అడ్డతీగల-1, అడ్డతీగల-2 ఎంపీటీసీ పరిధిలోని ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కూటమి బలపరిచిన ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో జెడ్పీటీసీ అభ్యర్థి వంతల రాజేశ్వరితో పాటు బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీల ఎంపీటీసీ అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల నిరంతర అప్రమత్తత..

**అర్నబ్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల్లో ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ**

**విఎంసి సిబ్బందితో సమన్వయంతో తక్షణ చర్యలు**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:



అర్నబ్ తుఫాను ప్రభావంతో విజయవాడ నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు నిరంతరం అప్ర మ త్తంగా విధులు నిర్వహిస్తు న్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నగరవ్యాప్తంగా ట్రాఫిక్ సజావుగా సాగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపడుతున్నారు.ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం, ఆధ్వర్యంలో, ట్రాఫిక్ ఏసీపీల పర్యవేక్షణలో ట్రాఫిక్ సిబ్బంది నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్, జమ్మిచెట్టు సెంటర్, ఎం.జి. రోడ్, ఏలూరు రోడ్, బందర్ రోడ్, రమేష్ హాస్పిటల్ జంక్షన్ తదితర ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు.వర్షాల కారణంగా రహదారులపై నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (VMC) సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ నీటి నిల్వలను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన చోట్ల వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నారు.

**వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విధుల్లో ట్రాఫిక్ పోలీసులు**

ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ట్రాఫిక్ పోలీసులు వర్షంలోనూ క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్నారు. సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అసౌకర్యం తగ్గించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ విధి నిర్వహణ పట్ల చూపుతున్న నిబద్ధత, అప్రమత్తత ప్రజాసేవ పట్ల ట్రాఫిక్ పోలీసుల అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. వర్షాల సమయంలో వాహనాలను నెమ్మదిగా నడపాలి. ఇతర వాహనాలకు తగినంత దూరం పాటించాలి. నీరు నిలిచిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి. ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలనీ విజ్ఞప్తి చేశారు.

## ఆర్నాబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు



**ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి బుధవారం సాయంత్రం 5 గంటల వరకు అందిన నివేదిక ప్రకారం...**

**857 ప్రభావిత గ్రామాల్లో 707 గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ**

**979 సబ్‌స్టేషన్లలో 156 ప్రభావితం 135 పునరుద్ధరణ , (65) 33 కేవీ ఫీడర్లలో తుఫాన్ ప్రభావితం (57) పునరుద్ధరణ**

**1995 మంది సిబ్బందితో 399 ప్రత్యేక బృందాలు ఏర్పాటు**

**ప్రాథమిక అంచనా ప్రకారం విద్యుత్ వ్యవస్థకు రూ.1.57 కోట్ల(ఒక కోటి యాభై ఏడు లక్షలు)నష్టం**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని పలు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లినప్పటికీ, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి పుల్లారెడ్డి తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ఇతర విద్యుత్ పరికరాలకు మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాను దశలవారీగా పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు.తుఫాన్ ప్రభావంతో మొత్తం 857 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా, 707 గ్రామాల్లో సరఫరాను పునరుద్ధరించినట్లు సీఎండీ తెలిపారు. ఇంకా ఇంచుమించు 150 గ్రామాల్లో పునరుద్ధరణ పనులు ఈ రాత్రికి పూర్తి చేసి విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యంప్రజలు తెగిపడిన విద్యుత్ వైర్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను తాకకుండా అప్రమత్తంగా ఉండాలని సీఎండీ సూచించారు. విద్యుత్ ప్రమాదాలు, సరఫరా అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కు తెలియజేయాలని కోరారు.జిల్లాల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు కృష్ణ-6281709355, ఎన్టీఆర్-9440817561,బాపట్ల -9281413774, గుంటూరు -9440817526,ప్రకాశం-9440817491,పల్నాడు-7661019447.

## తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కొండవీటి రామకృష్ణ



అవనిగడ్డ,కోడూరు కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలంలోని స్వతంత్రపురం హైస్కూలులో ఏర్పాటు చేసిన ఆర్ణబ్ తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాన్ని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండవీటి రామకృష్ణ పరిశీలించారు. కోడూరు స్వతంత్రపురం, కోడూరు మార్కెట్ ప్రాంతాల్లోని ఎస్టీ కుటుంబాలకు చెందిన తుఫాన్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలను సందర్శించి, అక్కడ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ఆయన పరిశీలించారు. బాధితులకు అందిస్తున్న భోజనం, తాగునీరు, వైద్య సేవలపై ఆరా తీశారు.తుఫాన్ ముప్పు పూర్తిగా తొలగిపోయే వరకు బాధితులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించే జాగ్రత్తలను పాటిస్తూ పునరావాస కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని కొండవీటి రామకృష్ణ కోరారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు అధికారులకు సహకరించి, తమ భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.





## పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

బాధితులకు భోజనం వడ్డించి భరోసా.. సురక్షితంగా ఉండాలని సూచన

ప్రజాభూమి ప్రతినిధి , అవనిగడ్డ నాగాయలంక

అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో నాగాయలంక మండలం భావదేవరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాన్ని బుధవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. శిబిరంలో ఆశ్రయం పొందుతున్న బాధితులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెబుతూ మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు.తుఫాన్ ముప్పు తగ్గినప్పటికీ వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అధికారులు సూచించే జాగ్రత్తలను పాటిస్తూ, వారికి సహకరించాలని, పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు సురక్షితంగా ఉండాలని కోరారు.తుఫాన్ సహాయక చర్యలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తోందని మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. పునరావాస కేంద్రంలో బాధితులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని సిబ్బందికి సూచించారు. శిబిరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో డీపీఓ ధనలక్ష్మి క్షేత్రస్థాయి పర్యటన

**నేలకొరిగిన చెట్ల తొలగింపు, నీటి నిల్వల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి





ఆర్ణబ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న గ్రామాల్లో సహాయక చర్యలు, పారిశుధ్య నిర్వహణ, పునరావాస ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కృష్ణా జిల్లా పంచాయతీ అధికారి ఎం. ధనలక్ష్మి క్షేత్రస్థాయిలో పర్యటించారు. కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాల్లోని పలు గ్రామ పంచాయతీలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు.ఈ సందర్భంగా తుఫాను ప్రభావంతో రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లను తక్షణమే తొలగించి రాకపోకలకు ఆటంకాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

**పునరావాస కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ఆరా**

తుఫాను బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించిన డీపీఓ, అక్కడ బాధితులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించాలని స్పష్టం చేశారు.

**నీటి నిల్వల తొలగింపునకు ప్రాధాన్యం**

గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే తొలగించాలని, డ్రైనేజీ కాలువల్లో పూడిక, చెత్తాచెదారాన్ని తొలగించి నీరు సజావుగా ప్రవహించేలా చూడాలని ఆదేశించారు. పారిశుధ్య పనులను ముమ్మరం చేసి, మురుగునీటి నిర్వహణతో పాటు దోమల వ్యాప్తి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.తుఫాను కారణంగా దెబ్బతిన్న రహదారులు, వీధి దీపాలు, ఇతర ప్రజా మౌలిక సదుపాయాలను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.గ్రామ పంచాయతీల పరిధిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ చెట్ల తొలగింపు, నీటి నిల్వల నివారణ, పారిశుధ్య నిర్వహణ, పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన వంటి పనులను సమన్వయంతో చేపట్టాలని డీపీఓ ధనలక్ష్మి ఆదేశించారు. తుఫాను అనంతరం గ్రామాల్లో సాధారణ పరిస్థితులను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అధికారులు, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

## అర్ధరాత్రి వేళ.. జోరువానలో వృద్ధుడికి పోలీసుల అండ

❖ కారుపై పడిన రేకుల షెడ్డు.. రహదారిపై కూలిన చెట్లు

❖ అనారోగ్యంతో ఉన్న వృద్ధుడిని సురక్షితంగా బంధువుల ఇంటికి చేర్చిన పెడన సీఐ, కృత్తివెన్ను ఎస్ఐ ❖ పోలీసుల మానవతా సేవలను అభినందించిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ప్రజాభూమి కృత్తివెన్ను, రూరల్







ఆర్ణబ్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల నేపథ్యంలో అర్ధరాత్రి వేళ ఆపదలో చిక్కుకున్న అనారోగ్యంతో ఉన్న వృద్ధుడికి కృష్ణా జిల్లా పోలీసులు అండగా నిలిచారు. కారు మీద రేకుల షెడ్డు పడటంతో పాటు, రహదారిపై చెట్లు కూలి ప్రయాణానికి అంతరా యం ఏర్పడిన పరిస్థితుల్లో తక్షణమే స్పందించి వృద్ధుడిని సురక్షితంగా బంధువుల ఇంటికి చేర్చి మానవత్వా న్ని చాటుకున్నారు. ఈ సహాయక చర్యల్లో చొర వ చూపిన పెడన సీఐ కె. నాగేంద్ర ప్రసాద్, కృత్తివెన్ను ఎస్ఐ ఏ. పైడిబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ అభినందించారు.

**112కు ఫోన్ చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు**

వివరాల్లోకి వెళితే.. అమలాపురానికి చెందిన కామాడి మణికంఠ తన తండ్రి కామాడి మల్లేశ్వరరావుకు నరాలకు సంబంధించిన అనారోగ్య సమస్య ఉండటంతో చికిత్స నిమిత్తం 2026 అక్టోబర్ 27న విజయవాడలోని విజయ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి కారులో తీసుకెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి వస్తుండగా కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామ సమీపంలో రహదారి పక్కన ఉన్న రేకుల షెడ్డు ఒక్కసారిగా కారుపై పడింది. అదే సమయంలో రహదారిపై చెట్లు కూలిపోవడంతో వాహనం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.భారీ వర్షం, ఈదురుగాలుల మధ్య ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్న మణికంఠ వెంటనే 112 అత్యవసర సేవలకు ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరారు.

**సొంత వాహనంలో వృద్ధుడిని సురక్షిత ప్రాంతానికి తరలింపు**

సమాచారం అందుకున్న పెడన సీఐ కె. నాగేంద్ర ప్రసాద్, కృత్తివెన్ను ఎస్ఐ ఏ. పైడిబాబు సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కారుపై పడిన రేకులను తొలగించడంతో పాటు, రహదారికి అడ్డంగా పడిన చెట్లను తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేశారు.అనారోగ్యంతో ఉన్న మల్లేశ్వరరావును అదే కారులో తీసుకెళ్లడం ఇబ్బందికరంగా ఉండటాన్ని గుర్తించిన సీఐ నాగేంద్ర ప్రసాద్, తన బొలెరో వాహనంలో వృద్ధుడిని సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోని వారి బంధువుల ఇంటికి సురక్షితంగా తీసుకెళ్లి అప్పగించారు. ఈ సహాయక చర్యల్లో ఎస్ఐ పైడిబాబు, సిబ్బంది కీలకంగా సహకరించారు.

**పోలీసుల సేవలకు కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**

అర్ధరాత్రి వేళ ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా తక్షణమే స్పందించి, ఆపదలో అండగా నిలిచిన పోలీసుల సేవల పట్ల మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఆపదలో ఉన్న ప్రజలకు తక్షణ సహాయం అందించడం, వారి భద్రతకు భరోసా కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యతని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలవాలని పోలీసు అధికారులకు సూచించారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు



నవంబర్ 5న పోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు

సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించిన కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:

కృష్ణా జిల్లాలో నిర్వహించనున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్పులు చేసినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించాల్సి ఉంది. అయితే అదే రోజున పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో పోలీసు సిబ్బంది, పోలింగ్ సిబ్బంది, ఇతర వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను సవరించినట్లు కలెక్టర్ వివరించారు.సవరించిన ఎన్నికల షెడ్యూల్- పోలింగ్: నవంబర్ 5న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.- రీపోలింగ్ (అవసరమైతే): నవంబర్ 6న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.- ఓట్ల లెక్కింపు: నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి.సవరించిన ఎన్నికల షెడ్యూల్‌ను అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్లు గమనించాలని కలెక్టర్ సూచించారు. షెడ్యూల్‌లో చేసిన మార్పులపై విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను తాజా షెడ్యూల్‌కు అనుగుణంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## కృష్ణా జిల్లాలో తుఫాను సహాయక చర్యలు ముమ్మరం

జిల్లావ్యాప్తంగా 177 పునరావాస కేంద్రాలు.. 15,101 మందికి ఆశ్రయం

ప్రాథమిక అంచనా ప్రకారం 65 ఇళ్లు దెబ్బతిన్నట్లు గుర్తింపు

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి



ఆర్ణబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృష్ణా జిల్లా యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డీకే బాలాజీ తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ముం దస్తు జాగ్రత్తలు చేపట్టడంతో పాటు, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. తుఫాను ప్రభావం దృష్ట్యా జిల్లావ్యాప్తంగా మొత్తం 177 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, 15,101 మందికి ఆశ్రయం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా కేంద్రాల్లో బాధితులకు అవసరమైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా అనే అంశాన్ని సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు.

**ప్రాథమికంగా 65 ఇళ్లు దెబ్బతిన్నట్లు గుర్తింపు**

తుఫాను ప్రభావంతో జిల్లాలో ఇప్పటివరకు ప్రాథమిక అంచనా ప్రకారం 65 ఇళ్లు దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తున్నారని, ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

**పంట, విద్యుత్ నష్టంపై వివరాల సేకరణ**

తుఫాను కారణంగా వ్యవసాయ పంటలకు జరిగిన నష్టం, నేలకొరిగిన చెట్లు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖల అధికారులు సేకరిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తయిన అనంతరం సమగ్ర నష్ట వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.జిల్లాలో తుఫాను ప్రభావిత ప్రాంతాల పరిస్థితులను యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు.

## యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశం



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

తుపాను ప్రభావం తగ్గుముఖం పట్టినప్పటికీ, అసలైన సవాలు ఇప్పుడే మొదలవుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను హెచ్చరించారు. నీటి నిల్వలు, పారిశుధ్య లోపం కారణంగా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున జిల్లా యంత్రాంగం మొత్తం పూర్తి అప్రమత్తతతో, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. వీఎంసి కమిషనర్, డిపిఓ, డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులతో నిర్వ హిం చిన అత్యవసర టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. రేపటిలోగా 100% పారిశుధ్య పనులు పూర్తి కావాల న్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా ప్రతి గ్రా మం, ప్రతి వార్డులో 24/7 ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వెంటనే బ్లీచింగ్ చల్లడం, మురుగునీటి కాలువలను క్లియర్ చేయడం వంటివి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఏ ఒక్క ప్రాంతం కూడా మిగలకుండా దోమల నివారణకు పూర్తిస్థాయిలో ఫాగింగ్ నిర్వహించాలన్నారు. అన్ని తాగునీటి వనరులు, ఓవర్ హెడ్ ట్యాంకులను తక్షణమే శుభ్రం చేయించాలన్నారు. ప్రతి నీటి వనరు వద్ద నిర్బంధంగా క్లోరినేషన్ చేపట్టి, రాబోయే మూడు రోజుల పాటు నిరంతరం క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేపట్టాలన్నారు. అతిసార (డయేరియా), డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల లక్షణాలు ఉన్నవారిని తక్షణమే గుర్తించాలన్నారు. ఎక్కడైనా చిన్నపాటి వ్యాప్తి లేదా కేసులు నమోదైనా వెంటనే అక్కడ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, తాజా వేడి ఆహారాన్ని తీసుకోవాలని, బయటి ఆహార పదార్థాలను తినవద్దని విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎల్లుండి నుంచి సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ ప్రారంభం కానున్నందున, అధికారులు గ్రామాలకు వెళ్లే సమయానికి ఎక్కడా పారిశుధ్య లోపం, వ్యాధుల సమస్యలు లేదా వైద్య సేవలు అందలేదన్న ఫిర్యాదులు రాకూడదని పేర్కొన్నారు. రేపు సాయంత్రానికల్లా నిర్దేశించిన అన్ని రక్షణ చర్యలు, పారిశుధ్య పనులు 100% పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## అర్ధరాత్రి వేళ.. భీకర గాలివానల్లోనూ ప్రజల భద్రతకు కృష్ణా జిల్లా పోలీసుల భరోసా

**నేలకొరిగిన భారీ వృక్షాల తొలగింపు.. రహదారులపై అడ్డంకుల నివారణ**

**పోలీసుల సేవలను అభినందించిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి









ఆర్ణబ్ తుఫాను ప్రభావంతో కృష్ణా జిల్లా వ్యాప్తంగా వీచిన భీకర ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగి రహదారులపై పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి వేళ సైతం కృష్ణా జిల్లా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి సహాయక చర్యలు చేపట్టారు.జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి, ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా రహదారులపై కూలిన భారీ వృక్షాలను తొలగించే చర్యలు చేపట్టారు. రహదారులకు అడ్డంగా పడిన చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. అత్యవసర ప్రయాణాలు సాగించే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రజా రవాణాకు అంతరాయం తగ్గించేలా సమన్వయంతో పనిచేశారు.అర్ధరాత్రి సమయం, భీకర గాలివానలను సైతం లెక్కచేయకుండా ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులు చేపట్టిన సహాయక చర్యలతో పలు ప్రాంతాల్లో రహదారులపై అడ్డంకులు తొలగిపోయాయి. విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలిచి, సకాలంలో స్పందించిన పోలీసు అధికారులు, సిబ్బంది సేవలను కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ అభినందించారు. ప్రతికూల పరిస్థితుల్లో ప్రజల భద్రతే లక్ష్యంగా విధులు నిర్వర్తించిన పోలీసుల సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

# ఆర్నబ్ తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అధికారుల సూచనలు పాటించాలి.. అవసరమైతే తప్ప బయటకు రావొద్దు: ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

ప్రజాభూమి, ప్రత్తిపాడు



ఆర్నబ్ తుపాను ప్రభావం నేపథ్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకూడదని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకున్నా వెంటనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అందుబాటులో ఉంటామని తెలిపారు. తుపాను నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, అధికారుల సూచనలు పాటించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా విజ్ఞప్తి చేశారు.

# ఏలేరు ఆధునీకరణ ఏదీ..? నీట మునుగుతున్న పంట పొలాలు!

- ప్రభుత్వాలు మారినా రైతుల కష్టాలు తీరడం లేదు.. తాత్కాలిక మరమ్మతులతోనే సరి
- శాశ్వత పరిష్కారం చూపాలని కూటమి ప్రభుత్వానికి రైతుల విజ్ఞప్తి

ప్రజా భూమి, ప్రత్తిపాడు



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఏలేరు ప్రాజెక్టు కాలువల ఆధునీకరణ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలకు అక్కడక్కడా గండ్లు పడటం, నీరు పంట పొలాల్లోకి చేరడంతో పంటలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా.. ఏలేరు కాలువల ఆధునీకరణ మాత్రం కార్యరూపం దాల్చడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువలకు గండ్లు పడిన ప్రతిసారీ తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని అంటున్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ఏలేరు ఆధునీకరణ అంశం తెరపైకి వస్తోందని, ఎన్నికలు ముగిసిన తర్వాత మాత్రం పరిస్థితి యథావిధిగా మారుతోందని రైతులు పేర్కొంటున్నారు. కాలువల వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆధునీకరించకపోవడంతో నీరు ఎక్కడికక్కడ లీకేజీలకు గురవుతోందని, కొన్ని ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునుగుతుండగా, కాలువల చివరి ఆయకట్టుకు సక్రమంగా నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలి**

ఏలేరు కాలువల ఆధునీకరణ పనులను చేపట్టి, పటిష్టమైన నిర్మాణాలతో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని రైతులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏలేరు ఆధునీకరణకు చర్యలు తీసుకుని, పంట పొలాలు ముంపునకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులకు స్వస్తి పలికి, రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు..!

- కడపలో డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

ప్రజాభూమి ప్రతినిధి,కడప



కడప నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, తదితర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కడప ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూములను అలాగే మౌలానా ఆజాద్ ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యుత్ సౌకర్యం, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో మౌలిక వసతులు, అధికారుల రాకపోకలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమైన దశ అని, ఈ ప్రక్రియలో ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి అప్రమత్తతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భద్రతా చర్యల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ఎన్నికల సామగ్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, కడప నగరపాలక సంస్థ కమిషనర్ డా. పి. భవానీ ప్రసాద్, డీఎస్పీ టి. భవానీ సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## ఆర్నబ్ తుఫాన్ నష్టంపై సమగ్ర సర్వే.. ప్రతి రైతుకూ న్యాయం జరగాలి!

**జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం**

ప్రజాభూమిప్రతినిధి,కోటబొమ్మాళి

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, వాస్తవ వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు, అధికారులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫోన్‌లో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి, తుఫాన్ ప్రభావం, పంటల పరిస్థితి, రైతులకు అందించాల్సిన సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో పంట నష్టాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించడంతో పాటు, నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది నుంచి మండల, జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.



## భారీ వర్షాలకు జలమయమైన రహదారి

- ఒమ్మంగి-శరభవరం మార్గం మూసివేత
- ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో ముందస్తు చర్యలు.. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసుల సూచన

ప్రజా భూమి, ప్రత్తిపాడు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఒమ్మంగి--శరభవరం రహదారి జలమయమైంది. దీంతో వాహనదారులు, ప్రజల భద్రత దృష్ట్యా ఈ రహదారిని తాత్కాలికంగా మూసివేశారు. సీఐ బి.ఎస్. అప్పారావు ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రహదారిపై రాకపోకలను నిలిపివేసినట్లు ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు. రహదారి పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రజలు, వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించవద్దని పోలీసులు సూచించారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని ఎస్సై కోరారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు.

## సిరిపురంలో అంబేడ్కర్ విగ్రహం కూల్చివేత.. తీవ్ర ఉద్రిక్తత!

- స్థల వివాదంతో రెండు వర్గాల మధ్య వివాదం.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దళితులు

ప్రజా భూమి, ప్రత్తిపాడు



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం కూల్చివేత ఘటన తీవ్ర కలకలం రేపింది. విగ్రహం ఏర్పాటు చేసిన స్థలంపై వివాదం తలెత్తడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని ఓ కాలనీకి చెందిన నివాసితులు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఆ స్థలం తమదేనంటూ ఇద్దరు వ్యక్తులు విగ్రహాన్ని కూల్చివేసినట్లు సమాచారం. ఈ ఘటనతో అంబేడ్కర్‌ను గౌరవించే వర్గాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చివేయడం ఆయనకు అవమానంగా భావిస్తున్నామని పలువురు పేర్కొంటున్నారు. స్థల వివాదం కారణంగా చోటుచేసుకున్న ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

**గ్రామంలో ఉద్రిక్తత.. న్యాయం చేయాలని డిమాండ్**

అంబేడ్కర్ విగ్రహం కూల్చివేత ఘటనపై దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వివాదానికి సంబంధించి పూర్తి వివరాలు, అధికారుల స్పందన తెలియాల్సి ఉంది. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఏలేరు రిజర్వాయర్ వద్ద హై అలర్ట్!

- తుపాను హెచ్చరికలతో అప్రమత్తమైన అధికారులు.. భారీగా పెరిగే అవకాశం ఉన్న వరద ప్రవాహాలు
- కాలువలకు 5,125 క్యూసెక్కుల నీటి విడుదల.. పంట పొలాల ముంపుపై రైతుల్లో ఆందోళన

ప్రజాభూమి, ప్రత్తిపాడు



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ప్రాంతంలో తుపాను హెచ్చరికల నేపథ్యం లో ఏలేరు రిజర్వాయర్ వద్ద అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రిజర్వాయర్‌కు వరద ప్రవాహాలు పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఏలేరు రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, మంగళవారం సాయంత్రం 6 గంటలకు నీటి నిల్వలు 18.016 టీఎంసీలకు చేరినట్లు అందిన సమాచారం. ఉదయం 1,400 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రం 5 గంటలకు 5,125 క్యూసెక్కులకు పెరిగింది. అయితే సాయంత్రం 6 గంటలకు వరద ప్రవాహం 339 క్యూసెక్కులకు తగ్గినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. రిజర్వాయర్‌కు వరద ప్రవాహాలు పెరిగే అవకాశాల నేపథ్యంలో కాలువలకు 5,125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాల తీవ్రతను బట్టి ఈ ప్రవాహం 10 వేల నుంచి 15 వేల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అతి భారీ వర్షాలు కురిస్తే నేటి నుంచి రేపటి వరకు వరద ప్రవాహాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఏలేరు కాలువలకు నీటి విడుదల నేపథ్యంలో పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి ప్రాంతాల్లో నీటి ప్రవాహ ఉధృతి పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే కాలువల పరిసర ప్రాంతాల్లో పంటల పరిస్థితిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. మరింత నీటిని విడుదల చేయాల్సి వస్తే పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. తుపాను ప్రభావంతో వర్షాలు పెరిగే అవకాశం ఉన్నందున రిజర్వాయర్‌లో నీటి మట్టాలు, ఇన్‌ఫ్లో, కాలువల ప్రవాహాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించా ల్సిన అవసరం ఉంది. రైతులు, కాలువల పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని కోరుతున్నారు.

# అవినీతిని అరికట్టడం అందరి బాధ్యతగా గుర్తించాలి

ప్రజాభూమి బ్యూరో ఏలూరు జిల్లా.




సమాజంలో అవినీతిని అరికట్టడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలనీ ఇంచార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి ఎం. ముక్కంటి చెప్పారు. విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా స్థానిక కలెక్టరేట్ లో బుధవారం అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 నెంబర్ పై ప్రచురించిన గోడప్రతులను డిఆర్ఓ ముక్కంటి, ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నందు అడిషనల్ ఎస్పీ వై. ప్రసాద్ రావు లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ ముక్కంటి మాట్లాడుతూ సమాజం నుండి అవినీతిని పారద్రోలేందుకు ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. అవినీతి విరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు విస్తృత ప్రచారం కల్పించి, ప్రజలలో అవగాహన తీసుకురావాలన్నారు. అదనపు ఎస్పీ వై. ప్రసాదరావు మాట్లాడుతూ సమాజంలో అవినీతి రహిత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రజల్లో చైతన్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 నెంబర్ కి ప్రజలు కాల్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చుని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయన్నారు. అవినీతి నిరోధక శాఖ డిఎస్పి జి.వి. కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో అవినీతిని తొలగించేందుకు అవినీతి నిరోధక శాఖ కృషి చేస్తున్నదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా ప్రజలు భయపడకుండా వెంటనే అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 ద్వారా తెలియపరచాలని, ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, అవినీతి నిరోధక శాఖ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసు, సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజధానిలో తాగు నీటి సమస్య రాకూడదు

- రాజధానిలో తాగు నీటి సమస్య రాకూడదు...
- క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు వంద శాతం పని చేయాలి
- భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీరు వినియోగించాలి
- తాగు నీరు సరఫరా, ఎస్టీపీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్

రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పని చేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని సెక్రటేరియట్ తో పాటు సీఎంవో, అవుటర్ రింగ్ , మెట్రో రైల్ , ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు వినియోగించేలా చూడాలని సీఎం తెలిపారు. పబ్లిక్ పార్క్ లు, రోడ్ల శుభ్రత కు కూడా ట్రీటెడ్ వాటర్ నే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు.

ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొదన్నారు.

ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికిప్పుడు హైడ్రా పర్యవేక్షించాలన్నారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్ ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంధకారంలో అడ్డతీగల మండలం..

**24 గంటలుగా విద్యుత్ సరఫరా నిలిపివేత**

**తాగునీటికి తిప్పలు.. చీకట్లోనే విద్యార్థుల అవస్థలు**




**ప్రజభూమి ప్రతినిధి-అడ్డతీగల**

తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలుల కారణంగా అడ్డతీగల మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం రాత్రి సుమారు 7 గంటల నుంచి బుధవారం రాత్రి 7 గంటలు దాటినా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలు అంధకారంలోనే ఉండిపోయాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. ముఖ్యంగా గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రంతా చీకట్లో గడపడంతో పాటు నీటి కొరతతో అవస్థలు పడ్డారు. గ్రామాల్లోనూ విద్యుత్ లేక ప్రజల సాధారణ జీవనం స్తంభించింది. మరోవైపు, ఉదయం నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు చెబుతుండటంతో ప్రజలు ఎదురు చూసినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం రాత్రి వరకు కూడా విద్యుత్ రాకపోవడంతో ప్రజలు నిరాశకు గురయ్యారు.

**అధికారులు తక్షణమే స్పందించాలి**

తుఫాను పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ఒకవైపు, తాగునీటి సమస్య మరోవైపు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా విద్యాసంస్థల్లో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# వాగుల వద్ద పోలీసుల అప్రమత్తత

**సీఐ సన్యాసినాయుడు పర్యవేక్షణలో భద్రతా చర్యలు.. ప్రజల రాకపోకలపై ప్రత్యేక నిఘా**



**ప్రజభూమి ప్రతినిధి-రాజవొమ్మంగి**

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రాజవొమ్మంగి మండలంలో వాగులు, కాలువల వద్ద పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ఎన్. సన్యాసినాయుడు పర్యవేక్షణలో ఎస్సై కె. షరీఫ్, పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం గమనిస్తూ ప్రజల భద్రతకు చర్యలు చేపడుతున్నారు. శాంతినగర్ వాగు బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో శాంతినగర్, దుర్గానగర్, బూరుగుపల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు గింజర్తి కాలువ పొంగి ప్రవహిస్తుండటంతో కొత్త ఎర్రంపాడు, పాత ఎర్రంపాడు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో నీటి ప్రవాహాన్ని పోలీసులు పర్యవేక్షిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. వర్షాల కారణంగా రహదారులపై చెట్లు నేలకొరిగిన ప్రాంతాల్లో వాటిని తొలగించేందుకు జడ్డంగి పోలీసులు చర్యలు చేపడుతున్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా రహదారులపై భద్రతా చర్యలు చేపడుతున్నారు. సీఐ సన్యాసినాయుడు, ఎస్సై షరీఫ్ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతూ వాగులు, కాలువల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు వాగులు, కాలువల వద్ద అప్రమత్తంగా ఉండాలని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న మార్గాల్లో ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

# ఉదయం నుంచి విద్యుత్ కరువు.. రాజవొమ్మంగి అంధకారం

**ప్రత్యామ్నాయ సరఫరాపై అభ్యంతరాలేంటి? సిబ్బంది క్షేత్రస్థాయి పనులపై స్పష్టత ఏది?**



**ప్రజాభూమి ప్రతినిధి-రాజవొమ్మంగి**

రాజవొమ్మంగి మండల కేంద్రంలో బుధవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ పునరుద్ధరణ కాకపోవడం, సరఫరా ఎప్పటికి వస్తుందనే సమాచారం లేకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

రాజవొమ్మంగికి ప్రత్యామ్నాయంగా కాకరపాడు వైపు నుంచి సుమారు 12 కిలోమీటర్లు, అడ్డతీగల వైపు నుంచి సుమారు 30 కిలోమీటర్ల మార్గంలో విద్యుత్ సరఫరా తీసుకొచ్చే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ మార్గాల ద్వారా సరఫరా తీసుకునే విషయంలో అభ్యంతరాలు ఎదురవుతున్నట్లు సమాచారం. ఆ అభ్యంతరాలకు కారణాలేమిటి? సాంకేతిక సమస్యల వల్ల సరఫరా సాధ్యం కావడం లేదా? అనే అంశాలపై విద్యుత్ శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. విద్యుత్ సిబ్బంది వర్షంలోనూ పెట్రోలింగ్ చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, సరఫరా పునరుద్ధరణలో జాప్యానికి కారణం ఏమిటన్నది తెలియడం లేదు. మండల కేంద్రంలో ఎంతమంది సిబ్బంది విధుల్లో ఉన్నారు? ఎంతమంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు? విద్యుత్ అంతరాయం ఎక్కడ ఏర్పడింది? మరమ్మతులు ఏ దశలో ఉన్నాయి? అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. విద్యుత్ లేక మారుమూల గ్రామాల్లో ఫోన్ ఛార్జింగ్, అత్యవసర సమాచార మార్పిడికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తుఫాను పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించి, సరఫరా పునరుద్ధరణకు తీసుకుంటున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలి. లివిద్యుత్ ఎప్పుడు వస్తుందో చెప్పలేని పరిస్థితికి కారణమేంటన్నదే ఇప్పుడు రాజవొమ్మంగి ప్రజల ప్రశ్న.

# పోలవరం నిర్వాసితులకు పూర్తి న్యాయం జరిగేలా పోరాటం

**రేకపల్లిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ప్రచారం.. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి**





**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం**

వి.ఆర్.పురం మండలం రేకపల్లి ఎంపీటీసీ సెగ్మెంట్ పరిధిలోని ఎస్సీ కాలనీలో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ అభ్యర్థి విజయలక్ష్మి, ఎంపీటీసీ అభ్యర్థి సోడే దినేష స్థానిక గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి విజయలక్ష్మి మాట్లాడుతూ.. మండల సమస్యలపై అవగాహనతో పాటు గతంలో ఎంపీటీసీగా, సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. ముఖ్యంగా గిరిజనులు, పోలవరం నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. మండల పరిధిలో పోలవరం ముంపునకు గురవుతున్న మరికొన్ని గ్రామాలను ముంపు గ్రామాల జాబితాలో చేర్పించి, ఆయా గ్రామాల నిర్వాసితులకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. తరతరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయించేలా ప్రభుత్వంతో పోరాడుతామని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి పోలవరం నిర్వాసిత కుటుంబానికి పునరావాస ప్యాకేజీ అందేలా కృషి చేస్తామని, గ్రామాలు ఖాళీ చేసే సమయానికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కూడా ప్యాకేజీ అందేలా పోరాటం చేస్తామని తెలిపారు. నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీగా రూ.10.50 లక్షలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అన్నవరం వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయడంతో పాటు మండలంలోని గ్రామాల అభివృద్ధికి ఎంపీ నిధులను వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీధిలైట్లు, రహదారులు, బోర్‌వెల్స్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న తమ అభ్యర్థి విజయలక్ష్మిని, ఎంపీటీసీ అభ్యర్థి సోడే దినేష్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నాయకులు, అభ్యర్థులు గ్రామస్తులను కోరారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జేసీ, సబ్ కలెక్టర్ పర్యటన

**కూలిన చెట్ల తొలగింపు, రహదారుల పునరుద్ధరణకు ఆదేశాలు**



**ప్రజభూమి ప్రతినిధి-రాజవొమ్మంగి**

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వీరాజ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాజవొమ్మంగి మండలంలోని ఎర్రంపాడు, నెలిమెట్ల ప్రాంతాల్లో పర్యటించిన వారు వర్షాల ప్రభావం, కాలువల పరిస్థితి, దెబ్బతిన్న రహదారులు, కూలిన చెట్ల తొలగింపు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారులపై పడిన చెట్లను జేసీబీల సహాయంతో వెంటనే తొలగించి రాకపోకలకు ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. దెబ్బతిన్న మార్గాల్లో పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి ప్రజలకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావంతో ఇంటిపై చెట్టు కూలిన ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. బాధితులకు అవసరమైన సహాయం అందించాలని, జరిగిన నష్టాన్ని అంచనా వేసి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జేసీ సూచించారు. వాగులు, కాలువలు పొంగే అవకాశం ఉన్నందున వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని, బలమైన గాలులు వీచే సమయంలో చెట్ల కింద నిలబడకూడదని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, విద్యుత్ స్తంభాలపై చెట్లు పడిన చోట వెంటనే తొలగింపు చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో తహసీల్దార్ స్వామి, సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ షరీఫ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈదురుగాలులకు నేలకొరిగిన చింతచెట్టు.. ఇంటిపై పడటంతో భయాందోళన

**రేకుల షెడ్ ధ్వంసం.. లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని బాధిత కుటుంబం ఆవేదన**





**ప్రజభూమి ప్రతినిధి-రాజవొమ్మంగి**

రాత్రి వేళ వీచిన బలమైన ఈదురుగాలులు ఓ కుటుంబాన్ని భయాందోళనకు గురిచేశాయి. 99 క్వార్టర్స్‌లో రైతు భరోసా కార్యాలయం వెనుక వైపు నివాసం ఉంటున్న పరిశిక సోమలమ్మ ఇంటి ఆవరణలోని చింతచెట్టు బుధవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో గాలుల తీవ్రతకు నేలకొరిగింది. చెట్టు ఇంటిపై పడటంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు భయంతో ఆందోళనకు గురయ్యారు. చెట్టు పడటంతో ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్ పూర్తిగా ధ్వంసమైందని కుటుంబ సభ్యులు తెలిపారు. షెడ్ నిర్మాణానికి సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. చెట్టు పడిన ప్రభావంతో ఇంటి పిల్లర్లు సైతం కిందకు కుంగినట్లు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో తమకు భారీ నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబం వాపోయింది.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు..!

**కడపలో డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ**



**ప్రజాభూమి ప్రతినిధి-కడప**

కడప నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, తదితర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కడప ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూములను అలాగే మౌలానా ఆజాద్ ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యుత్ సౌకర్యం, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో మౌలిక వసతులు, అధికారుల రాకపోకలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ఏజెంట్లకు అవసరమైన సౌకర్యాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమైన దశ అని, ఈ ప్రక్రియలో ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి అప్రమత్తతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భద్రతా చర్యల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ఎన్నికల సామగ్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, కడప నగరపాలక సంస్థ కమిషనర్ డా. పి. భవానీ ప్రసాద్, డీఎస్పీ టి. భవానీ సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

**అర్నబ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి..**

# ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు!

- **టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్**
- **తాగునీరు, వైద్యం, విద్యుత్ పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించాలి.. పంట కాలువలకు గండ్లు పడితే తక్షణమే మరమ్మతులు చేపట్టాలి**
- **తుఫాన్ తగ్గుముఖం పట్టిన వెంటనే పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి**



**ప్రజాభూమి ప్రతినిధి-కోటబొమ్మాళి**

అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ఎంపీడీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ ఎంపీడీవోలతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాన్ ప్రభావం, ముందస్తు చర్యలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే సముద్ర తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులు, అధికారుల సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజలు కూడా అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు.

**పంట కాలువలకు గండ్లు పడితే తక్షణమే మరమ్మతులు**

భారీ వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పంట కాలువలకు గండ్లు పడినా, నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడినా వెంటనే స్పందించి మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ భూములకు, పంటలకు నష్టం వాటిల్లకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

**తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు**

తుఫాన్ ప్రభావంతో ఏ గ్రామంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**తుఫాన్ తగ్గగానే పారిశుద్ధ్య పనులు**

తుఫాన్ ప్రభావం తగ్గుముఖం పట్టిన వెంటనే గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని మంత్రి సూచించారు. రహదారులు, వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్యం విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

**విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు తక్షణ చర్యలు**

బలమైన గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగినా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినా సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని మంత్రి సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ విద్యుత్ సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని తెలిపారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సమన్వయంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.